# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

ఆదివారం, మే 24, 2026 | సంపుటి - 20 | సంచిక 245 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


### పశ్చిమాసియాలో సడలని

## ఉద్రిక్త పరిస్థితులు

**ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమైనట్లుగా వార్తలు**

**తమ గగన తలాన్ని మూసేస్తూ ఇరాన్ ఆదేశాలు**



టెహ్రాన్ : పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే.. ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటు చేసుకుంది.

తరువాయి 2లో

### తెలంగాణ ఎండల తీవ్రతపై

# ప్రభుత్వం అలర్ట్

## వడదెబ్బకు 16 మంది మృతి చెందినట్లు గుర్తింపు

- మృతుల కుటుంబాలకు 4లక్షల చొప్పున పరిహారం
- పరిస్థితిపై అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష



హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వడగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ప్రజల ప్రాణ రక్షణెళి తమ ప్రభుత్వ తొలి



ప్రాధాన్యమని తెలిపారు. వడగాల్పులతో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని చెప్పుకొచ్చారు.

తరువాయి 2లో

### బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు..

## ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు

### హరీష్ వ్యాఖ్యలపై పొంగులేటి కౌంటర్

హైదరాబాద్ : బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. లాగే మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు.

2లో

### దేశంలో పెరుగుతున్న చిన్నారుల

## అదృశ్యం కేసులు

**చిన్నారుల అంతర్ధానంపై సుప్రీంకోర్టు ఆందోళన**

**కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయండి**

**అన్ని రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశం**



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది.

తరువాయి 2లో




### యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

**దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు**

**ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు**

**19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

2లో

### హరీష్‌రావువి

## పగటి కలలు

### అధికారంలోకి రావడం కల్ల

**ఫ్యూచర్ సిటీపై బాధ్యతారాహిత్య ప్రకటన**

**అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బిఆర్ఎస్**

**మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు**



హైదరాబాద్ : ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండి పడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు.

2లో

### యాదగిరిగుట్టలో

## సిఎం పర్యటన

**వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**రూ.43.80 కోట్లతో వేదపాఠశాలలకు భూమిపూజ**





యాదగిరిగుట్ట : యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి

తరువాయి 2లో

### వైఎస్ కుటుంబానిది

## రక్త చరిత్ర

### ఫ్యాక్షన్ రాజకీయాలు వారితోనే మొదలు

### జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి పయ్యావుల కేశవ్



అమరావతి : ఫ్యాక్షన్ రాజకీయాలకు బీజం వేసింది వైఎస్ కుటుంబం అయితే... జగన్ దాన్ని కొనసాగిస్తున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఈ మేరకు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి పయ్యావుల తీవ్రంగా విరుచుకు పడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. పులివెందులలో వైఎస్ రాజారెడ్డి అకృత్యాలను వివరించారు. జగన్ అరాచక రాజకీయాలపై యువత ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జగన్ బాధితుడు కాదని.. నిందితుడంటూ వ్యాఖ్యానించారు.

తరువాయి 2లో

### ప్రజల ఆరోగ్యం

## ప్రభుత్వం బాధ్యత

### ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

**ఆరోగ్యమే మనకు అసలు సిసిలు సంపద**

**యోగా, ధ్యానం, ప్రాణాయామం భాగం కావాలి**

**ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని**

**కండ్రిగలో 'సంజీవని' కార్యక్రమంలో చంద్రబాబు**



చిత్తూరు : ఆహారమే ఔషధం, వంటశాలే ఔషధ శాల. ఈ మాట నేను ఎప్పుడూ చెబుతాను. మనం తినే ఆహారమే మనకు తిరుగులేని ఆరోగ్యాన్ని అందిస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. శనివారం చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. తన వరకు తాను పూర్తి ఆహార నియమాలు పాటిస్తానని, మంచి అలవాట్లు, మంచి ఆహారం, వ్యాయామం, మంచి ఆలోచనల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంపద ఉన్నవాళ్లకంటే ఆరోగ్యంగా ఉన్నవాళ్లే అదృష్టవంతులని ఉద్ఘాటించారు.

తరువాయి 2లో

## బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు..

# ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు

బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు అంటూ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నారా..? అంటూ నిలదీశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఒక్క మెట్రోస్టేషన్ కూడా ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కొత్త నగరాన్ని నిర్మిస్తోందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం ఫాంహౌస్‌లు కట్టుకుందని.. కానీ తాము రాష్ట్ర భవిష్యత్తు కోసం ఫ్యూచర్ సిటీ కడుతున్నామని ఉద్ఘాటించారు. మూసీప్రక్షాళన, లగచర్ల ఇండస్ట్రీస్‌కు బీఆర్ఎస్ నేతలు అడ్డుపడ్డారని ఆగ్రహించారు. యువతకు ఉద్యోగాలు కల్పించే కుట్రలతో అడ్డుకున్నారని ఫైర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం గర్వించే విధంగా తాము ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తు ఖతం చేయాలని బీఆర్ఎస్ నేతలే చూస్తున్నారని సెటైర్లు గుప్పించారు.

# యాదగిరిగుట్టలో సిఎం పర్యటన

ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

# దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. పోలీసుల వద్ద ఉన్న క్రిమినల్ ట్రాకింగ్ డేటాబేస్, చైల్డ్ వెల్ఫేర్ అథారిటీల వద్ద ఉన్న 'విశాల్ వాసిల్య' డేటాబేస్ మధ్య సమన్వయం లేకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఐదు కీలక ఆదేశాలను జారీ చేసింది. దేశంలోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న చిన్నారుల డేటాబేస్‌లన్నింటినీ అనుసంధానం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. దీనివల్ల పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు , జిల్లా బాలల రక్షణ విభాగాలు చైల్డ్ కేర్ హోమ్‌ల మధ్య సమాచారం రియల్ టైమ్‌లో షేర్ అవుతుంది. చాలా జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని అన్ని ంఊ÷ుజలను తగిన అధికారాలు, మౌలిక సదుపాయాలతో 4 వారాల్లోగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏదైనా చైల్డ్ మిస్సింగ్ కేసు నమోదైన వెంటనే.. అధికారులు ప్రాథమికంగా దానిని కిడ్నాప్ లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలి. దీనివల్ల ప్రొసీజర్ ఆలస్యం కాకుండా దర్యాప్తులో సీరియస్‌నెస్ వస్తుందని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆ కేసులో హ్యూమన్ ట్రాఫికింగ్ అనుమానాలు ఉంటే.. నిబంధనల ప్రకారం 4 నెలలు వేచి చూడకుండా వెంటనే కేసును బదిలీ చేయాలని స్పష్టం చేసింది. రక్షించిన లేదా రికవరీ చేసిన చిన్నారులను సాధారణంగా 24 గంటల్లోగా వారి కుటుంబాలకు అప్పగించాలి. ఒకవేళ ఆ నిర్దిష్ట చైల్డ్ ట్రాఫికింగ్ లేదా దోపిడీ వెనుక కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వస్తే తప్ప, మిగిలిన సమయాల్లో తక్షణమే తల్లిదండ్రుల వద్దకు చేర్చాలి. కుటుంబ సభ్యులపై అనుమానం ఉంటే ఆ బాధ్యతను చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు చూసుకోవాలి. రక్షించిన ప్రతి బిడ్డకు ఒకే గుర్తింపు ఉండేలా చూసుకోవడం, భవిష్యత్తులో వారి ఆచూకీని సులభంగా పర్యవేక్షించడం కోసం అవసరమైన అధికారిక రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లను కోర్టు ఆదేశించింది. తద్వారా ఐడెంటిటీ డూప్లికేషన్‌ను నిరోధించవచ్చని పేర్కొంది. 2011 సెప్టెంబరులో చెన్నైలోని విరుగంబాక్కం పరిధిలో 'కవిత' అనే చిన్నారి అదృశ్యమైంది. స్థానిక పోలీసులు, సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు ఈ కేసును ఆచూకీ లభించనిది గా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ ఇచ్చారు. దీనిపై తండ్రి జి. గణేలిష్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 మార్చిలో మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. చిన్నారి 2011 లో మిస్ అయింది కావున, 2013 లో వచ్చిన హోం శాఖ యాంటీ-ట్రాఫికింగ్ గైడ్‌లైన్స్ దీనికి వర్తించవని హైకోర్టు పేర్కొంది. ఈ తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. 'చిన్నారి ఆచూకీ లభించనంత కాలం, చైల్డ్ ప్రొటెక్షన్ గైడ్‌లైన్స్, యాంటీ-ట్రాఫికింగ్ ప్రొటోకాల్స్ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించి, దేశవ్యాప్తంగా ఉన్న మిస్సింగ్ చిన్నారుల సమస్యపై ఈ సమగ్ర ఆదేశాలు జారీ చేసింది. ఇక, ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదా వేసింది. ఆ సమయంలోగా అన్ని రాష్ట్రాలు, అధికారులు దీనిపై నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

# యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్లు వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా ంఎ, ఎని వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు. భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమీకండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం-శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు.

# తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్

ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేయాలని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. హీట్‌వేవ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండదెబ్బకు గురైన వ్యక్తులకు ఆయా ఆస్పత్రులు అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే తెలంగాణలో భానుడి భగభగలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండగా, 18కు పైగా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో అధికారులు 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లోనూ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి 43 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాలు తీవ్ర వడగాలులు ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ ప్రభావం ఆందోళనకరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అలసటగా ఉంటుంది, గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, వేడిగా ఉన్నప్పుడు ఎక్కువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. కండరాల నొప్పి ఉంటుంది. హీట్ ఇంజురీలో శరీర భాగాలు దెబ్బతినే అవకాశం ఉంది. కిడ్నీ, గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. హీట్ స్ట్రోక్ తీవ్రమైన సమస్య.. దీనిలో శరీర భాగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. దీని కారణంగా మెదడు పనితీరు దెబ్బతింటుంది. స్ట్రోక్ సంభవించవచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఈ వడదెబ్బ నుంచి తప్పించుకోవాలంటే.. శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లకపోవడం మంచిది. షుగర్, బీపీ పేషెంట్లు మెడికేషన్ సక్రమంగా తీసుకోవాలి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు బయట తిరగకపోవడమే మంచిది. అత్యవసర పరిస్థితిలో వెళ్లాల్సి వస్తే.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముదురు రంగు దుస్తులు కాకుండా తేలికపాటి లేత రంగు దుస్తులను ధరించాలి. ఆల్కహాల్ శరీరంలోని నీటి శాతాన్ని తగ్గిస్తాయి. ఎండాకాలంలో మద్యానికి దూరంగా ఉండటం మంచిది. ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన నిమ్మరసం లాంటివి శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి భర్తీ చేస్తాయి. దోసకాయలు, పుచ్చకాయలు, దానిమ్మ, బత్తాయి లాంటి పండ్లు తీసుకోవాలి. వేసవిలో తేలికపాటి వ్యాయామాలు ఉదయం 8 గంటల్లోపే ముగించాలి. వడదెబ్బ లక్షణాలు కనిపించగానే చికిత్స అందించాలి. లేదంటే శరీరం పూర్తిగా నిర్జలీకరణం చెంది.. బీపీ, పల్స్ పడిపోయి కొన్నిసార్లు ప్రాణాలు పోవచ్చు.

# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

ఈనెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ నోటమ్ జారీ చేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక, అమెరికా- ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది. అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో.. పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా మరోసారి దాడులకు సిద్ధం అవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఇలా అప్రమత్తమైంది. ఈ పరిణామంతో గల్ఫ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యూఎస్ మరోసారి యుద్ధాన్ని ప్రారంభించిన పక్షంలో దీటుగా ఎదుర్కొనేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇతర సాయుధ దళాలు సిద్ధమవుతున్నట్టు ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా ఆస్తులకు నష్టం కలిగేలా, ప్రయోజనాలు దెబ్బతినేలా దాడులకు ప్రణాళికలను ఇరాన్ మిలిటరీ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ వారాంతాన్ని న్యూజెర్సీలో గడపాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో తన ప్లాన్స్‌ను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు తిరిగొచ్చారు. దీంతో, పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలవుతాయన్న వార్తలు మీడియాలో వెలువడ్డాయి. ఈ వారాంతంలో మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా నిఘా సంస్థల సీనియర్ అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చేశారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి లేని పక్షంలో దాడులు మొదలుపెట్టేందుకు ట్రంప్ కూడా సుముఖంగానే ఉన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్నా తెరవెనుక దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు ముమ్మర స్థాయిలో జరుగుతున్నట్టు కూడా తెలుస్తోంది. చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్టు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది.

# వైఎస్ కుటుంబానిది రక్త చరిత్ర

జగన్ బెంగళూరు నుంచి వచ్చినప్పుడల్లా కొత్త వాదన తెస్తారన్నారు.వివేకా హత్య కేసులో ఏం జరిగిందో నిక్కరు వేసుకున్న కుర్రాడు కూడా చెబుతాడని.. అలాంటి వాటిల్లో కూడా జగన్ అసత్యాలు చెబుతున్నారని అంటూ దుయ్యబట్టారు. వైఎస్ కుటుంబంతోనే రాజకీయాలు నేరమయ్యాయని.. రాజకీయాల్లోకి ఫ్యాక్షన్ తెచ్చారని మంత్రి మండిపడ్డారు. 1989లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీమలో ఫ్యాక్షనిజానికి అండగా నిలిచిందని ఆరోపించారు. నాటి ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో పార్నపల్లి అనే గ్రామంలో టీడీపీకి భారీ మెజార్టీ వచ్చిందని.. ఆ గ్రామానికి చెందిన టీడీపీ నేతల ఇళ్లకు డ్రిల్ చేసి డైనమేట్లు పెట్టి పేల్చారని.. ఇదీ రాజారెడ్డి చరిత్ర అని చెప్పుకొచ్చారు. ఓ ఇంటిని డైనమేట్లు పెట్టి పేల్చేసిన ఘటనను ఇప్పటికీ ఎవ్వరూ మరిచిపోలేదన్నారు. తన ప్రత్యర్థుల మీద దాడి చేయించి... అదే సందర్భంలో వేరే చోట ఉన్నట్టు సృష్టించుకోవడం అనేది వైఎస్ కుటుంబంతోనే మొదలైందని అన్నారు. కడప జిల్లాలోని లింగాల మండలంలో ముగ్గురు టాప్ లీడర్లను భయపెట్టి లొంగదీసుకున్నారని పయ్యావుల ఆరోపించారు. ఇలాంటివి పదుల సంఖ్యలో పులివెందులలో జరిగాయన్నారు. రాజారెడ్డి నుంచి మొదలుకుని పులివెందులలో జరిగిన ఘటనలపై పుస్తకం వేస్తామన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక సీమలో ఫ్యాక్షన్ కంట్రోల్లోకి వచ్చిందన్నారు. వైఎస్ కుటుంబం మొదలు పెట్టిన ఫ్యాక్షన్ రాజకీయాలను కంట్రోల్ చేయడానికి 30 ఏళ్లు పట్టిందని తెలిపారు. రప్పా రప్పా అంటే వారితో ఫొటోలు దిగుతారని.. సొంత పార్టీ కార్యకర్త కారు కింద నలిగిపోయినా పట్టించుకోరని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ గొడ్డలి అంటే జగన్ మోహన్ రెడ్డి ఉలికిపాటుకు గురవుతున్నారన్నారు. గొడ్డలిపోటును గుండెపోటుగా చూపించగలరని దుయ్యబట్టారు. 'నిజాలను ప్రజలకు చెప్పాలి... అవగాహన కల్పించాలి. అందుకే గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం... గొడ్డలి పార్టీ నెవ్వర్ ఎగైన్' అని స్పష్టం చేశారు. ఓ తరానికి ఉపాధి కల్పించేలా చంద్రబాబు అవకాశాలు సృష్టించారని పయ్యావుల కేశవ్ తెలిపారు. జగన్ ఉపాధి అవకాశాలను పోగొడుతున్నారని మండిపడ్డారు. 800 కంపెనీలను గ్రౌండ్ చేయబోతున్నామన్నారు. 'వ్యవస్థల మీద గొడ్డలి పోటు వేశావ్.. పోలవరం మీద గొడ్డలి వేటు వేశావ్.. పరిశ్రమల మీద గొడ్డలి వేటు వేశావ్.. అందుకే మీది గొడ్డలి పార్టీ. అచ్చెన్న అరెస్ట్ నుంచి చంద్రబాబు అరెస్ట్ వరకు భయం సృష్టించే ప్రయత్నం చేశారు. పొ÷-లకెయిన్లతో జగన్ విధ్వంసం చేస్తే... నిర్మాణానికి పొ÷-లకెయిన్లను వాడుతున్నాం. నేరం జగన్ నైజం.. నేరమయ రాజకీయాలను గతంలో వైఎస్ కుటుంబం మొదలు పెట్టింది.. దాన్ని జగన్ కొనసాగిస్తున్నారు. వివేకాను చంపిందెవరో సునీతమ్మ చెబుతోంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మృతి వెనుక రిలయన్స్ ఉందన్నారు. తిరిగి వారికే రాజ్యసభ పదవి ఇచ్చారు. వైఎస్ మరణం వెనుక జగన్ పాత్ర ఉందని బొత్స అన్నారు. దానికి సమాధానం చెప్పగలరా..? వైఎస్ఆర్‌ను ముద్దాయిగా చేసింది జగనే అని ఉండవల్లి అరుణ్ కుమార్ స్వయంగా చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ముద్దాయిగా చేర్చిన పొన్నవోలుకు పదవి ఇచ్చి గౌరవించారు. పాదయాత్రలో అస్వస్థత గురైనప్పుడు విజయమ్మ వెళ్లారు కానీ... జగన్ వెళ్లలేదు. వైఎస్ మరణం వెనుక ముందుగా విచారించాల్సింది జగన్ మోహన్ రెడ్డినేనని లగడపాటి అన్నారని గుర్తు చేశారు. యువకులు తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని.. ఎవరి చరిత్ర ఏంటో.. యువకులు తెలుసుకోవాలని సూచించారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం చంద్రబాబు పరిశ్రమలు తెస్తున్నారని... జగన్ పరిశ్రమలను తరిమేశారంటూ మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత

ఈ సందర్భంగా 'సంజీవని' కార్యక్రమం ప్రాముఖ్యతను సిఎం వివరించారు. 'రామ రావణ యుద్ధంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవనిని తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో, డిజిటల్ హెల్త్ రికార్డులతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ కార్యక్రమానికి 'సంజీవని' అని పేరు పెట్టాం. సంపద కంటే ఆరోగ్యమే గొప్పది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అన్నారు' అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఒక ఏఐ డాక్టర్ ఉంటారని తెలిపారు. సంజీవని పథకం విస్తరణలో భాగంగా డబ్బు, హోదా, కార్లు ఎన్ని ఉన్నా.. అన్నింటికీ మించింది ఆరోగ్యమేనని గుర్తు చేశారు. సంజీవని పథకం కింద ఇంటి నుంచే 74 రకాల వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశముందన్నారు. వ్యాధులు రాకముందే గుర్తించి, నివారించేందుకు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. గత జూలైలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ పథకంలో భాగంగా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజల ఇళ్ల వద్దే నిర్వహించి, రిపోర్టులు అందిస్తామన్నారు. డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, వ్యక్తిగత ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే ఎఐ డాక్టర్ ద్వారా కూడా వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తికి ఒక ఎఐ డాక్టర్ ఉంటాడని స్పష్టం చేశారు. వైద్య ఖర్చుల భారం నుంచి కుటుంబాలను గట్టెక్కించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది వైద్యరంగానికి రూ.19,305 కోట్లు కేటాయించామని, 15వ ఆర్థిక సంఘం నుంచి దేశంలోనే అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు సాధించామని గుర్తు చేశారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల విలువైన వైద్యం, ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.25 లక్షల వరకు ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి బాగుంటేనే మనం బాగుంటామని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సిఎం చంద్రబాబు అన్నారు. సమర్థ నీటి నిర్వహణతో భూగర్భ జలాలను పెంచగలిగామని, దీనికి అన్నమయ్య జిల్లానే నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం చర్యలతో అక్కడ భూగర్భ జలాలు 8.5 మీటర్లు పెరిగి, పచ్చదనం పెరిగిందన్నారు. రాష్ట్రమంతా తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటే, అన్నమయ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గాయని, పిడుగురాళ్లలో 49 డిగ్రీలు నమోదైతే, అన్నమయ్యలో 40 డిగ్రీలే ఉందని నివేదికలను ఉటంకించారు. సాగునీటి ప్రాజెక్టులపై సంకల్పంతో పనిచేస్తున్నామని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తామో క్యాలెండర్ విడుదల చేశామని చంద్రబాబు తెలిపారు. నీవా పనులు పూర్తి చేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తెస్తామని, కల్యాణి డ్యాంకు కూడా నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. గాలేరు-నగరి, మల్లెమడుగు, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి ప్రాజెక్టుల పూర్తికి గడువులను ప్రకటించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే తమ లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# సెంట్రింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు

## వారి సమస్యలు పరిష్కరించాలన్న కవిత

హైదరాబాద్,మే23 : సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. సెంట్రింగ్ కార్మికులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. శనివారం ఇందిరాపార్క్ వద్ద జరుగుతున్న గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ గుత్తేదారుల అసోసియేషన్ మహాధర్నాకు కవిత మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జనసేన రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రెండు రోజుల్లో సెంట్రింగ్ కార్మికుల నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించాలని కవిత డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే రెండు రోజుల తర్వాత తానే స్వయంగా ధర్నాలో కూర్చుంటానని స్పష్టం చేశారు. సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లు గొంతెమ్మ కోరికలు కావని.. న్యాయమైనవేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే కచ్చితంగా విద్య, వైద్యం అందిస్తామని కవిత స్పష్టం చేశారు.

# హరీష్‌రావువి పగటి కలలు

పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు.ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళు న్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

# బెంగుళూరులో కాక్రోచ్ జనతా పార్టీ

### నేడు మానవహారం అంటూ వెలసిన పోస్టర్లు

### అలాంటిదేమీ లేదంటూ పోలీసుల కొట్టివేత

బెంగళూరు,మే23 : సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన 'బొద్దింకల జనతా పార్టీ' పేరుతో మే 24న బెంగళూరులో మానవహారం నిర్వహించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'బొద్దింకల జనతా పార్టీ కర్ణాటక' పేరుతో విడుదలైన పోస్టర్‌లో టౌన్ హాల్ సమీపంలో శాంతియుత మానవహారం చేపడతామని పేర్కొన్నారు. 'బొద్దింకల శక్తి ఆన్‌లైన్‌లోనే కాదు, వీధుల్లో కూడా ఉంది' అని పోస్టర్‌లో పేర్కొనడం చర్చనీయాంశమైంది. అయితే ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని బెంగళూరు పోలీసులు స్పష్టం చేశారు. మానవహారం నిర్వహించేందుకు ఏ వ్యక్తి, సంస్థ లేదా రాజకీయ పార్టీ నుంచి ఇప్పటివరకు దరఖాస్తు రాలేదని తెలిపారు. టౌన్ హాల్ పరిసరాల్లో అనుమతి లేకుండా గుమికూడవద్దని, సోషల్ మీడియాలో ఈ కార్యక్రమానికి సంబంధించిన సందేశాలను షేర్ చేయవద్దని హెచ్చరించారు. నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోలుస్తూ ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై వ్యంగ్యంగా స్పందిస్తూ 'బొద్దింకల జనతా పార్టీ' పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభమైంది. ఈ పేరుతో ప్రారంభమైన ఎక్స్ ఖాతా కొద్ది రోజుల్లోనే వైరల్‌గా మారింది. అనంతరం ఆ ఖాతా నిలిపివేయబడినప్పటికీ, ఇన్‌స్టాగ్రామ్‌లో సీజేపీకి భారీ స్థాయిలో ఆదరణ లభించింది. కొద్ది రోజుల్లోనే సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా 1.85 కోట్ల ఫాలోవర్లను సంపాదించి, ప్రధాన రాజకీయ పార్టీల అధికారిక పేజీలను అధిగమించింది. పుణెకు చెందిన అభిజీత్ దీప్కే అనే యువకుడు ఈ ఖాతాను ప్రారంభించారు. ఖాతా నిలిపివేసిన తరువాత తనకు ప్రాణహాని బెదిరింపులు వస్తున్నాయని ఆయన తెలిపారు.

## దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

### బయటకు రావాలంటే భయపడుతున్న జనాలు

న్యూఢిల్లీ,మే23 : దేశంలో భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు భగభగ మండుతున్నాయి. జనం ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టాలంటే భయంతో వణికిపోతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రానున్న వారం రోజులపాటు కూడా తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాలు సహా వాయవ్య, మధ్య, తూర్పు భారత్‌లోని పలు మైదాన ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అంచనావేసింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఐఎండీ వెల్లడించింది.

# గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

**జూనియర్ కాలేజీల్లో మహద్యాహ్న భోజనం**

**గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం**

**కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు**

**తెలంగాణ కేబినేట్కీలక నిర్ణయం**

హైదరాబాద్,మే24 : వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్ న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# ధాన్యం కొనుగోళ్లలో పూర్తి నిర్లక్ష్యం

**రైతుల అగచాట్లు పట్టని ప్రభుత్వం: వేముల**

నిజామాబాద్,మే23 : పంట కొనుగోలులో దారుణంగా విఫలమైన ప్రభుత్వం అన్నదాతల ఆత్మహత్యలపై తప్పుడు లెక్కలు చెప్తున్నదని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి మండిపడ్డారు. ధాన్యం ఎక్కడా సక్రమంగా కొనగడం లేదన్నారు. నిజామాబాద్‌కు వస్తే రైతులు పడుతున్న అగచాట్లను చూపిస్తానని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో చనిపోయిన రైతులు పది మందిపైనే ఉన్నారని, కానీ ఒక్కరూ చనిపోలేదని మంత్రి అనడం సిగ్గుచేటని నిప్పులు చెరిగారు. 'పంటలు కొనక పోవడంతో గగ్గోలు పెడుతూ రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతులు ప్రాణాలు కోల్పోయినా నిస్సిగ్గుగా అబద్దాలు చెప్తున్నారని విరుచుకుపడ్డారు. అవసరమైతే ప్రభుత్వానికి రైతుల మరణాల వివరాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. మండుటెండల్లో రైతులు పంటలు అమ్ము కొనేందుకు పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాల్లోవివరాలు సేకరించాకనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నానని స్పష్టంచేశారు. పంట కొనుగోలు సంక్షోభం, అన్నదాతలు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులను తెలుసుకుని మాట్లాడాలన్నారు. పంట కొనుగోలు సంక్షోభంపై చర్చించాలని, చర్యలకు ఆదేశించాలని అన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై రైతుల ధర్నా

**శాంతియుత ధర్నా చేస్తున్నా అరెస్ట్ చేస్తే ఎలా**

**ప్రభుత్వంపై మండిపడ్డ గజ్వేల్ బిఆర్ఎస్ నేత వంటేరు**

మెదక్,మే23 : రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తే పోలీసులు బలవంతంగా అరెస్టు చేస్తున్నారని గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి ఆరోపించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. వారికి మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నించారు. పోలీసులు దౌర్జన్యంగా రైతులను అరెస్టు చేసి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు గన్నీ బస్తాలు, లారీలు లేకపోవడంతో వడ్లు కల్లాల్లోనే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతుల ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు దౌర్జన్యంగా ధర్నా చేయకుండా బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఎపికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

**రాహుల్ ప్రధాని అయితేనే ఎపికి లబ్ది**

**రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్రలో బిజెపి**

**మీడియా సమావేశంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**



హైదరాబాద్,మే24 : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసమైనా రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఏపీ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆలోచన చేయాలని.. ఓటు ఎవరికో వేసి దేవుడిని ఏదో అడిగితే ఎవరూ ఏం చేయలేరని అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా సహా పలు అంశాలపై స్పందించారు. 'భక్తి అంటే నాది.. నేను రియల్ ఎస్టేట్‌లో సంపాదించిన డబ్బులతో సీతారాముల కల్యాణం చేస్తాను. తెలంగాణలో ఒక్క బీజేపీ నేత అయినా నాలాగా చేస్తారా?. రాములవారి కల్యాణం చేసి నేనెప్పుడైనా ఓట్లు అడిగానా?. ఛత్రపతి శివాజీకి లేని మతం మీకెందుకు?. శివాజీ దగ్గర ముస్లింలు మంత్రులుగా పనిచేశారు. బీజేపీ నేతలు చదువుకోవాలి. ఆ పార్టీ వాళ్లు మాట్లాడితే హిందువులు అంటారు. రాజ్యాంగాన్ని తీసేసే కుట్ర బీజేపీ చేస్తోంది. రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పాటుపడు తున్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దేశ ప్రజలకు కవచం లాంటిది రాజ్యాంగం. కవచకుండలాలు ఉన్నంతకాలం కర్ణుడిని ఎవరూ చంపలేకపోయారు. అవి దానం చేశాక కర్ణుడి ప్రాణాలు పోయాయి. ఎన్నికల కమిషన్ ద్వారా ఓటు చోరీ చేసి కమలం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఓట్లను దొంగిలించి ఎంపీ సీట్లు గెలిచింది. దేవుడి పేరుతో, మతం పేరుతో, దొంగ ఓట్లతో ఆ పార్టీ గెలుస్తోంది. దేశ ప్రజలు ఇప్పటికే ప్రమాదంలో ఉన్నారు. రాజ్యాంగాన్ని తీసేస్తే మరింత ప్రమాదంలో పడతారు. దేశం 67 ఏళ్ల పాలనలో రూ.54 లక్షల కోట్ల అప్పు చేస్తే.. బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.1,047 లక్షల కోట్ల అప్పులు చేసింది. ఃహుల్ కుటుంబం అధికారం కోసం ఏనాడూ తాపత్రయపడలేదు. ఆయనది ఆస్తులు, ప్రాణత్యాగం చేసిన కుటుంబం. ప్రధాని పదవిని రాహుల్ త్యాగం చేశారు. అధికారం చేపట్టిన తర్వాత మోదీ చేసిన మంచి ఒక్కటి చెప్పండి' అని మండిపడ్డారు.

# పర్సంటేజీ అయితనే సినిమా ఆడుద్ది

**పెద్ది సినిమా నుంచే మొదలు పెడదాం**

**రెంటల్ సిస్టమ్ కాలం చెల్లిన విధానం**

**తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్**

హైదరాబాద్,మే24 : తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ది సినిమా విడుదల చేయాలంటే తమకు పర్సంటేజ్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమా అయినా పర్సంటేజ్ కావాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తేల్చి చెప్పింది. శనివారం తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ.. 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు, మూడు సార్లు చర్చలు జరిగాయి. హరిహర వీరమల్లు రిలీజ్ సమయంలో.. రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. 'కానీ, సంవత్సరం గడిచిపోయింది. పెద్ది సినిమాకు మాకు పర్సంటేజ్ కావాల్సిందే. మమ్మల్ని నిర్మాతలు రెచ్చగొడుతున్నారు. మొదట మూడు వారాలు అన్నారు.. ఇప్పుడు ఆరు వారాలు అంటున్నారు. పర్సెంటేజ్ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడిస్తాము. 120 మంది థియేటర్స్ ఓనర్లు దీనస్థితిలో ఉన్నారు. పర్సంటేజ్ సిస్టంను కావాలనే నిర్మాతలు లేట్ చేస్తున్నారు. మాకు పర్సెంటేజ్ విధానం కావాల్సిందే. అది ఎంత ఇస్తారో చెప్పండి. 10,15 ఏళ్ల కింద థియేటర్స్‌కి మంచి రెవెన్యూ ఉండేది. ఇప్పుడు ఎగ్జిబిటర్స్‌కి రెవెన్యూ రావడం లేదు. కానీ, నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తోంది'.. పర్సంటేజ్ విధానం కొత్త విషయం కాదు. అన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఉంది. కాబట్టి కూర్చుని పర్సంటేజ్‌ను తేల్చండి. అన్ని సినిమాల రిలీజ్ సాఫీగా జరుగుతుంది. మీటింగ్‌లో కూడా పర్సంటేజ్‌కు సైన్ చేస్తేనే పెద్ది రిలీజ్‌కు ఒప్పుకుంటామని చెప్పాము. సబ్ కమిటీలో మెంబర్స్‌గా ఉండి.. మాకు కావలసిన పర్సంటేజ్‌ను సాధించుకుంటాం. మెగాస్టార్ చిరంజీవి పిలిస్తే వెళతాం. పెద్దమనిషికి మా బాధలు చెప్పుకుంటాం. పర్సంటేజ్ సిస్టమే ఉండాలి. రెంటల్ మాట వద్దు' అని అన్నారు.

# మాసాబ్ ట్యాంక్‌లో దారుణ ఘటన

**న్యాయవాదిని కారుతో ఢీకొటంటి చంపిన దుండుగుల**

**కారు నంబర్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు**

హైదరాబాద్,మే23 : హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో న్యాయవాది ఖాజా మొహియుద్దీన్‌పై ప్రత్యర్థులు దాడికి తెగబడ్డారు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన న్యాయవాదిని దుండగులు కారుతో బలంగా ఢీకొట్టారు. పక్కా ప్లాన్‌తో న్యాయవాది కోసం వేచి చూస్తున్న దుండగులు.. ఖాజా మొహియుద్దీన్ బయటకు వచ్చిన వెంటనే అత్యంత వేగంగా వచ్చి ఢీకొట్టి పరారయ్యారు. కారు ఢీకొట్టిన వెంటనే న్యాయవాది గాల్లోకి ఎగిరి కిందపడ్డారు. దీంతో ఆయనకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు.. మొహియుద్దీన్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.అయితే ఆయన అప్పటికే మృతి చెందారు. న్యాయవాదిపై హత్యాయత్నం దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. న్యాయవాదిపై దాడి సమాచారం తెలుసుకున్న తోటి న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాజా మొహియుద్దీన్‌ను కారుతో ఢీకొట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇది న్యాయవ్యవస్థపైనే దాడి అని వారు అభివర్ణించారు. ఈ ఘటనపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాయవాదిపై దాడికి గల కారణాలు, ఆయనపై ఎవరు దాడి చేశారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కారు నంబర్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇకపోతే మాసబ్‌ట్యాంక్ వద్ద కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ కన్నుమూశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ న్యాయవాది తుదిశ్వాస విడిచారు. న్యాయవాది తన కారు వద్దకు వచ్చి వెనక సీట్లో బ్యాగు పెట్టి.. డ్రైవింగ్ సీట్‌లో కూర్చోబోతున్న సమయంలో ఒక్కసారిగా దుండగులు కారుతో అతివేగంగా దూసుకొచ్చి బలంగా ఢీకొట్టారు. క్షణాల్లోనే ఈ ఘటన చోటు చేసుకుంది. న్యాయవాదికి తీవ్రమైన గాయాలవడంతో వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే న్యాయవాది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చివరకు చికిత్స పొందుతూ మొయునుద్దీన్ ప్రాణాలు కోల్పోయారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. కారు నంబర్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

## అంతర్జాతీయ ప్రభావాలపైనే మారకం విలువ

**ఇందులో ప్రభుత్వం జోక్యం ఉండదన్న గోయల్**

న్యూఢిల్లీ,మే24 : ఎక్స్ఛేంజీ రేట్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం ఉండదని వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. రూపాయి విలువ అనేక అంతర్జాతీయ అంశాలు, మార్కెట్‌లపై ఆధారపడి ఉంటుందని వ్యాఖ్యానించారు. దిల్లీలో ఏర్పాటు చేసిన 19వ రోజ్‌గార్ మేళాలో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వం ఎప్పుడూ ఎగుమతులను ప్రోత్సహించడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అయితే, రెండు, మూడు రోజులుగా చూస్తే.. రూపాయి బలపడుతుండటాన్ని గమనించవచ్చన్నారు. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ ఇటీవల కనిష్ఠ స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. అయితే, మార్కెట్ సూచీలు పుంజుకోవడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలతో రెండు రోజులుగా రూపాయి కొంత బలపడుతోంది. అమెరికా-ఇరాన్ శాంతి చర్చల పురోగతిపై ఆశలు పనిచేసినట్లు మార్కెట్ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## వ్యాపార ఎదుగుదలకు తోడ్పడాలి

**చార్టెడ్ అకౌంటెంట్లకు కెటిఆర్ హితవు**

హైదరాబాద్,మే24 : చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగానూ ఎదగాలని ఆకాంక్షించారు. కృత్రిమ మేధను తమ వృత్తిలో భాగం చేసుకోవాలన్నారు. గచ్చిబౌలిలో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర అత్యంత కీలకమని.. ట్యాక్స్‌లు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో వారి అవసరం చాలా ఉందన్నారు.

## భద్రత, వాణిజ్య,సాంకేతిక రంగాల్లో సహకారం

**అమెరికాకు భారత్ కీలక భాగస్వామి**

**ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో చర్చలు**

న్యూఢిల్లీ,మే24 : భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికా-భారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా- భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని.. భారతీయ కంపెనీలు తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న మార్కో రూబియో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. వైట్‌హౌస్‌ను సందర్శించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరఫున ఆయన మోదీని ఆహ్వానించారు. సేవాతీర్థ్ లో దాదాపు గంటకు పైగా ప్రధానితో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్‌కు ముడి చమురు సరఫరా చేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందన్నారు. అదే సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తన ఆధీనంలోకి తీసుకోవడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రధాని మోదీకి, ట్రంప్‌నకు మధ్య మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని రూబియో అన్నారు. వారిద్దరూ కేవలం తాత్కాలిక ప్రయోజనాల గురించే కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలపైనా దృష్టిపెడతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశంలో మండుతున్న ఎండల గురించి మాట్లాడుతూ.. వేడిగా ఉన్నందున తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించాలనుకుంటున్నానంటూ చమత్కరించారు. అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతో భేటీపై ప్రధాని మోదీ స్పందించారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతితోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలు తదితర అంశాలపై చర్చలు జరిపామన్నారు. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పని చేస్తామన్నారు. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించుకోవడానికి శాంతియుత చర్చలు జరపాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు.

# జాతీయ రహదారిపై ఆర్టీసి బస్సు, కారు ఢీ

**ఒక మహిళ మృతి.. పలువురికి గాయాలు**

అంబేడ్కర్ కోనసీమ,మే24 : ముమ్మిడివరం మండలం అనాతవరం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. 216వ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. రాజోలు నుంచి విశాఖపట్నానికి ఆర్టీసీ బస్సు వెళ్తోంది. కాకినాడ నుంచి మామిడికుదురుకు కారు ప్రయాణిస్తోంది. రెండు వాహనాలు అనాతవరం దగ్గరికి రాగానే ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, ఇతర వాహనదారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. అలాగే ముమ్మిడివరం పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. బాధితులను అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అయితే, చికిత్సపొందుతూ బాధితుల్లో ఓ మహిళ మృతిచెందింది. ప్రమాదంలో గాయపడిన వారి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మరోవైపు ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. రంగంలోకి దిగిన పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మధు కుటుంబ పోషణ, పిల్లల బాధ్యత బీఆర్ఎస్ పార్టీదే..

**భరోసా ఇచ్చిన జగదీశ్ రెడ్డి**



పోలీసులు కాంగ్రెస్ కండువాలు కప్పుకొని తిరుగుతున్నారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు. పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ పార్టీ నాయకులకు అడ్డాగా మారాయని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్త మధు అంత్యక్రియల్లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచకాలు పెరిగిపోయాయని జగదీశ్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు నశించాయని అన్నారు. ఇప్పటివరకు తమ జిల్లాలో ఇద్దరు కార్యకర్తలను పొట్టన బెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులకు శిక్షలు పడేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. 2018లో జరిగిన బీఆర్ఎస్ నాయకుడి హత్య కేసులో కీలక సాక్షిగా ఉన్న మధును కాంగ్రెస్ నాయకులు అనేకసార్లు బెదిరించారని తెలిపారు. ఓ పోలీసు అధికారి స్వయంగా పిలిచి నువ్వు ఎగిరిపోతావని బెదిరించాడని పేర్కొన్నారు. ఈ హత్య పోలీసు అధికారులకు తెలిసే జరిగిందని అన్నారు. అందుకే మధును ముందే పోలీసు అధికారి హెచ్చరించారని చెప్పారు. పోలీసోళ్లు బెదిరిస్తున్నారని చెబితే జాగ్రత్తగా ఉండమని చెప్పానని.. కానీ ఏదో పంచాయతీ ఉందని పిలిచి మధును హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మా కార్యకర్తను హత్య చేసిన నిందితులను ఇప్పటివరకు అరెస్టు చేయలేదని తెలిపారు. కాంగ్రెస్ గూండాల చేతిలో దారుణమైన హత్యకు గురైన మా కార్యకర్త మధు కుంటుంబ పోషణ బాధ్యత, పిల్లల చదువుల బాధ్యత బీఆర్ఎస్ పార్టీనే తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కేసులో ఏ అధికారి తప్పు చేసినా మేము గమనిస్తూనే ఉంటామని తెలిపారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఆ అధికారి తప్పించుకోలేదని హెచ్చరించారు. ఇలాంటి క్రిమినల్ కేసులు పదేండ్ల తర్వాత కూడా ఓపెన్ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయని తెలిపారు. తప్పు చేస్తే ఐజీ, డీజీ స్థాయి అధికారులను కూడా వదిలేది లేదని స్పష్టం చేశారు. అది దృష్టిలో పెట్టుకొని పోలీస్ అధికారులు విచారణ చేయాలని సూచించారు.

# సంపాదకీయం

## రిజర్వేషన్లతో కొందరికే లబ్ధి !

స్వాతంత్ర్యం లభించి 80ఏళ్లకు చేరువలో ఉన్నాం. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ప్రజలు త్యాగాలు చేస్తుంటే కొందరు ఫలితాలు అనుభవిస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు అనుభవిస్తున్న లగ్జరీ జీవితం అంతా ఇంతా కాదు. ఒక్కసారి ఎమ్మెల్యే, ఎంపి అయితే చాలు..జీవితాంతం సుఖంగా బతికేయవచ్చన పరిస్థితి ఏర్పడింది. పేరుకే ప్రజాస్వామ్యం కానీ.. అదృష్టమంతా ప్రజాప్రతినిధులదే. అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుని ప్రజలను ఓట్లేసే పురుగుల్లా చూస్తున్నారు. కొన్ని తాయిలాలు ప్రకటించి, మొత్తం అధికారం, ఆర్థిక స్వేచ్ఛ వారు అనుభవిస్తున్నారు. అందుకే ప్రజల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆగ్రహం అప్పుడప్పుడు కట్టలు తెంచుకుంటోంది. ఒక్కోసారి చిన్న సమస్యగా ఉన్న వ్యవహారం పెద్ద ఎత్తున ఉవ్వెత్తున ఎగిసి పడుతోంది. ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవాలి. ప్రజల్లో ఏమూలో దాగివున్న ఆగ్రహం ఇలా బయటకు వస్తోంది. వివిధ రూపాల్లో ఉన్న వ్యతిరేకత ఒక్కటైతే రాజకీయ పార్టీల నేతలు తట్టుకోవడం కష్టం. అనేక దేశాల్లో ఇలాగే ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్న సంగతి చూశాం. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, వెనిజులా తదితర దేశాల్లో ప్రజల ఆగ్రం ఎలా పరిణమించిందో చూశాం. అందువల్ల పాలకులు ప్రజాసంక్షేమం కోరి నిర్ణయాలు తీసుకోవాలి. వాటిని ఆచరణలో పెట్టాలి. నిరంతరం సమస్యలతో పోరాడుతున్న ప్రజలను పట్టించుకోవాలి. తమ సుఖం కాదు..ప్రజల సంక్షేమం ముఖ్యమని గమనించాలి. ధాన్యం కొనుగోలల్లు కావచ్చు, ఫీజుల మోత కావచ్చు...నిరుద్యోగం కావచ్చు...ఇలా అనేక సమస్యలపై ప్రజల్లో ఆందోళనలు గూడుకట్టుకుని ఉన్నాయి. అంఉదకే తరతరాలుగా అధికారంలో తామే ఉండాలన్న కుటిల రాజకీయాలు మానాలి. ఇకపోతే తాజాగా సుప్రీం ధర్మాసనం రిజర్వేషన్ల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. దీనిపై చర్చ జరగాలి. చట్టసభల్లో ఇలాంటి వాటిపై చర్చించాలి. కొందరే రిజర్వేషన్ల ఫలాలు అనుభవించడంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. క్రిమిలేయర్ ఉండాలని ఆయన ఆనాడు అభిప్రాయ పడ్డారు. కొందరు రిజర్వేషన్లు అనుభవించాక, తమ కుటుంబంలోని వారంతా అదే రిజర్వేషన్ల మెట్లెక్కాలని చూస్తున్నారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఎందుకంటే ఇలా ర ఇజర్వేషన్లు పొందిన వారు రాజకీయంగా వారే స్థిరపడిపోతున్నారు. ఉన్నత శ్రేణి ఉద్యోగలు సాధించిన ఐఎఎస్, ఐపిఎస్‌లు కూడా తమ పిల్లకు రిజర్వేషన్లు పొందుతున్నారు. దీనినే సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. ఇది చర్చించాలి. లేకుంటే ప్రజల్లో ఇలాంటి వ్యత్యాసాలపైనా వ్యతిరేకత వస్తుంది. ఎక్కడో ఒకచోట దీనికి చెక్ పెట్టాలి. రిజర్వేషన్లు ఎల్లకాలం కాదన్న నిజం బయటకు రావాలి. అవసరమైతే చట్టం చేయాలి. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం రిజర్వేషన్ కోటాను ఆశించడం సరికాదన్నారు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చుని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. రాజకీయంగా ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు పొందుతున్న వారు తమ కుటుంబాలకు కూడా రిజర్వేషన్ కోటాలో లబ్ధి పొందుతున్నారు. ఒకే కుటుంబం నుంచి రిజర్వేషన్ల కోటాలో ఎన్నికై ఎమ్మెల్యేలు, ఎంపిలు అయి మంత్రి పదవులు అనుభవిస్తున్నారు. ఇలాంటి వారివల్ల పక్కన ఉన్నవారు ఎన్నటికీ రిజర్వేషన్లు పొందలేక పోతున్నారు. దీనిపై దేశవ్యాప్తం చర్చ జరగాలి. కాక్రోచ్ జనతాపార్టీ కూడా చర్చించాలి. వెనకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలకు చెందిన పిల్లలకు రిజర్వేషన్లు ఎందుకని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాంటి వారు కూడా రిజర్వేషన్లు కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి తల్లిదండ్రులిద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అయినందున క్రీమిలేయర్ కిందకు వస్తారని.. రిజర్వేషన్ వర్తించదంటూ ఆ రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. దాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రిజర్వేషన్లపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు రాజకీయాల్లోనూ రిజర్వేషన్లపై చర్చించాలి. అప్పుడే మిగతా వారికి రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయి.

# యువత డిజిటల్ ఉద్యమ సునామీ




దేశ రాజకీయ ముఖచిత్రంలో ఊహించని సరికొత్త పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. డిజిటల్ వేదికగా యువత బొద్దింకల జనతా పార్టీ (కాక్రోచ్ జనతా పార్టీ), జాతీయ పరాన్నజీవుల కూటమి (నేషనల్ పారసైటిక్ ఫ్రంట్) పేర్లతో సృష్టించిన రెండు కొత్త శక్తులు సంచలనం కలిగిస్తున్నాయి. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, వ్యవస్థాగత అవినీతికి నిరసనగా భారతీయ జెన్‌జెడ్ సోషల్ మీడియా వినియోగదారులు సృష్టించిన వ్యంగ్య ఆన్‌లైన్ రాజకీయ ఉద్యమాలివి. ఇవి కేవలం మీమ్స్‌కే పరిమితం కాకుండా యువత ఆక్రోశాన్ని ప్రతిబింబించే సామూహిక డిజిటల్ నిరసనగా రూపాంతరం చెందాయి. ఈ రెండింటికీ ఎన్నికల సంఘం గుర్తింపు లేకపోయినా ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలకు చెమటలు పుట్టిస్తున్నాయి. ఇందులో బొద్దింకల జనతా పార్టీ అసాధారణ డిజిటల్ ఉద్యమం వెనుక ఉజ్వలమైన ఆత్మగౌరవ పోరాటం ప్రజ్వలిస్తోంది. ఇదే నెల (2026 మే)లో ఒక కోర్టు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు నిరుద్యోగ యువతకు తీవ్ర మనస్తాపం కలిగించాయి. నిరుద్యోగ యువత వ్యవస్థపై దాడిచేసే బొద్దింకలని, సమాజాన్ని పట్టిపీడించే పరాన్నజీవులని, సోమరులని, హేళనతో కూడిన ఆ వ్యాఖ్యలకు యువత భగ్గుమంది. దేశవ్యాప్తంగా తిరుగుబాటు జెండా ఎగురవేసే డిజిటల్ రాజకీయ సునామీకి తెరలేపింది. దీంతో సిజెఐ ఆ మరునాడే నాలిక్కర్చుకుని తన వ్యాఖ్యలను తప్పుగా చిత్రీకరించారన్నారు. నకిలీ డిగ్రీలతో న్యాయవాద వృత్తిని భ్రష్టుపట్టిస్తున్న కొందరు నకిలీ న్యాయవాదులను ఉద్దేశించి మాత్రమే వ్యాఖ్యలు చేసినట్టు వివరణ ఇచ్చారు. మమ్మల్ని బొద్దింకలు, పరాన్నజీవులు, సోమరిపోతులంటారా? ఆ పేర్లతోనే కదం తొక్కుతామని యువత డిజిటల్ ఉద్యమం చేపట్టారు. ఈ నేపథ్యంలోనే మే 16న కాక్రోచ్ జనతా పార్టీ పుట్టింది. బోస్టన్ యూనివర్శిటీలో పబ్లిక్ రిలేషన్స్ చదువుతున్న, గతంలో ఆప్ సోషల్ మీడియా వాలంటీర్‌గా పనిచేసిన 30 ఏళ్ల యువకుడు అభిజీత్ దీప్కే ఈ వినూత్న పార్టీని స్థాపించారు. ఈ పార్టీ తమ నినాదంగా సెక్యులర్, సోషలిస్ట్, డెమోక్రటిక్, లేజీ (సోమరి) అని ప్రకటించుకుంది. నిత్యం ఆన్‌లైన్‌లో ఉంటూ సోమరిపోతులుగా ముద్రపడి, ఇటీవల బొద్దింకలు అని పిలవబడ్డ యువత కోసమే ఈ పార్టీ అంటూ వ్యంగ్యంగా తన మేనిఫెస్టోను విడుదల చేసింది. ఈ పార్టీ పెట్టిన కేవలం 48 గంటల్లోనే సొంతంగా వెబ్‌సైట్, పార్టీ గీతాన్ని కూడా విడుదల చేయడం గమనార్హం. మే 20 నాటికి కాక్రోచ్ జనతా పార్టీకి ఎక్స్ ఖాతాలో 60లక్షల వరకు ఫాలోవర్లు పెరిగారంటే ఉద్యమం ఎంత ఊపులో ఉందో తెలుస్తుంది. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన మహువా మొయిత్రా, కీర్తి అజాద్ వంటి ప్రముఖ పార్లమెంటేరియన్లు దీనికి గట్టి మద్దతు ఇస్తున్నారు. ఈ నిరసన ఉద్యమం డిజిటల్ స్క్రీన్లను దాటి వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెట్టింది. దేశ రాజధాని ఢిల్లీలో వందలాది మంది యువ వాలంటీర్లు బొద్దింకల వేషధారణతో కాలుష్యమయమైన యమునా నదిని స్వచ్ఛందంగా శుభ్రం చేస్తూ శాంతియుత ప్రదర్శన నిర్వహించారు. సుప్రీం, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు రిటైరైన తరువాత వారికి ప్రభుత్వ పదవులు ఇవ్వరాదని, ఫిరాయింపుల నిరోధక చట్టం అమలు చేయాలని, చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయాలని, అక్రమ మీడియా సంస్థల లైసెన్సు రద్దు చేయాలని తదితర ఐదు ప్రధాన డిమాండ్లతో మేనిఫెస్టో విడుదల చేసింది. కాక్రోచ్ జనతా పార్టీకి సమాంతరంగా ఏర్పడిన నేషనల్ పారాసైటిక్ ఫ్రంట్ ప్రభుత్వ వైఫల్యాలను, లోపభూయిష్టమైన వ్యవస్థలను ఎండగట్టడమే తమ ప్రధాన లక్ష్యంగా విప్లవాత్మక అసంబద్ధత అనే సరికొత్త ప్రచార శైలిని అనుసరిస్తోంది. పన్నులు కడుతూ కనీస సదుపాయాలు పొందలేకపోతున్న సాధారణ పౌరులు ఈ వ్యవస్థలో బాధితులుగా బతుకుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ాూశ్రీంశీ =ముఁ – ఇక కోల్ గ్యాస్ఫికేషనే శరణ్యం యువత ఆకాంక్షలకు అనుగుణంగా కొన్ని డిమాండ్లను తెరపైకి తీసుకు వస్తోంది. నేరచరిత్ర లేని స్వచ్ఛమైన పార్లమెంట్ ఏర్పాటు కావాలని, దేశంలో మెరుగైన శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించడం, సామాన్యులకు నమ్మకమైన ప్రజా రవాణా, విద్యుత్ వంటి వినియోగ సేవలను తక్కువ ధరకు అందించాలని, వీరు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. మొత్తం మీద ఈ రెండు డిజిటల్ ఉద్యమాలు తమకు మద్దతుగా కొన్ని లక్షల ఫాలోవర్లను చేర్చుకోగలుగుతున్నాయి. ఇది కేవలం నవ్వులాటకో, మీమ్స్ కోసమో పెట్టిన పార్టీ కాదని, కాక్రోచ్ జనతా పార్టీ స్పష్టం చేస్తోంది. దేశంలో హాట్‌టాపిక్‌గా మారిన నీట్ పేపర్ లీకేజీ అంశంపై కాక్రోచ్ జనతా తీవ్రంగా స్పందించింది. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. సిబిఎస్ఇ రీచెకింగ్ ఫీజులను రద్దు చేయాలని కోరుతోంది. యువత సమస్యలపై గళం పెంచుతోంది. భారత యువత అత్యంత అవగాహనతో ఉన్నారని, తమపై జరిగే అపహాస్యాన్ని, తమ అసంతృప్తిని హింసాత్మక మార్గాల్లో కాకుండా అత్యంత ప్రజాస్వామ్యబద్ధంగా, వ్యంగ్యంగా ప్రపంచానికి చాటి చెబుతున్నారని, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. డిజిటల్ సునామీ సృష్టిస్తున్న ఈ యువకులంతా తాము కేవలం సోషల్ మీడియాలో మాట్లాడే వాళ్లు మాత్రమే కాదని, నిర్మాణాత్మక విమర్శల ద్వారా దేశంలో నిజమైన మార్పును కోరుకునే బాధ్యతాయుతమైన పౌరులమని నిరూపించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా జెన్‌జెడ్ యువత ఆకాంక్షలకు తగ్గట్టు వారి సమస్యలను పరిష్కరించలేకుంటే ఈమీమ్ పాలిటిక్స్ భవిష్యత్‌లో అసలైన ఎన్నికల రాజకీయాలను శాసించినా ఆశ్చర్యపోనక్కరలేదు.

## ట్విశా శర్మ మృతిలో వీడని మిస్టరీ

### ఆత్మహత్యకు ముందు సెలూన్‌ను సందర్శించినట్లు గుర్తింపు

ముంబై,మే23 : దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన మాజీ మిస్ పుణె, ఎంబీఏ గ్రాడ్యుయేట్ ట్విషా శర్మ మృతి కేసుకు సంబంధించి పలు కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆమె ఇంట్లో ఉరివేసుకుని కనిపించడానికి కొన్ని గంటల ముందే ఓ సెలూన్ షాప్‌ను సందర్శించింది. సంబంధిత సీసీటీవీ ఫుటేజీ బయటకు వచ్చింది. సుమారు 3 గంటలసేపు సెలూన్‌లో ఉన్న ట్విషా.. హెడ్ మసాజ్, పెడిక్యూర్ చేయించుకున్నట్టు కనిపిస్తోంది. ట్విషా.. మే 12న మధ్యాహ్నం 3:12 గంటల ప్రాంతంలో సెలూన్‌లోకి వెళ్లి, సాయంత్రం 6:15 గంటలకు బయటకు వెళ్లారని సెలూన్ షాప్ యజమాని కిరణ్ పారిహర్ తెలిపారు. ఆ తర్వాతి రోజు ట్విషా అత్త గిరిబాలా సింగ్ ఆమె వివరాలపై పదే పదే ఆరా తీశారన్నారు. 'ట్విషా శర్మ.. మా సెలూన్‌కు తరచుగా వస్తుంటారు. గతంలోనూ ఆమె నాలుగైదుసార్లు వచ్చారు. అయితే.. ఈసారి సుమారు 9 నెలల విరామం తర్వాత వచ్చారు. మరుసటి రోజు ఉదయం గిరిబాల సింగ్.. ట్విషా సెలూన్‌కు వచ్చినప్పటి సీసీటీవీ ఫుటేజీ కావాలని ఫోన్ చేశారు' అని కిరణ్ చెప్పారు. తన కోడలు ట్విషా.. సెలూన్‌కు ఎప్పుడు వచ్చిందో, ఏ సమయంలో తిరిగి వెళ్లిందో స్పష్టంగా తెలపాలని గిరిబాలా సింగ్ కోరినట్టు షాప్ యాజమాని చెప్పారు. అలాగే ఆమె ఏ రకంగా డబ్బు చెల్లించారో.. ఆమె సెలూన్ సందర్శనకు సంబంధించి ఏదైనా ప్రూఫ్ లేదా రికార్డ్స్ కావాలని ఆమె పదే పదే అడిగారన్నారు. అయితే.. ట్విషా ఆ సమయంలో తనకు ఎలాంటి నగదు చెల్లించలేదని, గతంలోనే ప్రీపెయిడ్ ప్యాకేజీ తీసుకున్నారని పారిహర్ చెప్పారు. ఆ తర్వాత గిరిబాలా నుంచి మరోసారి ఫోన్ వచ్చిందని.. ట్విషా యోగక్షేమాల గురించి అడగ్గా.. ఆమె చనిపోయారని సమాధానమిచ్చినట్టు యజమాని చెప్పుకొచ్చారు. కాసేపటికే లాయర్ వస్త్రధారణతో కూడిన ఐదారుగురు వ్యక్తులు తన షాప్ వద్దకు వచ్చి.. తాము అడ్వకేట్లమని పరిచయం చేసుకుని సీసీటీవీ ఫుటేజీ తీసుకెళ్లారని పేర్కొన్నారు. అయితే.. తాము న్యాయవాదులమని చెప్పుకున్న ఆ బృందంలోని సభ్యుల గుర్తింపులు తెలియరాలేదు. దీంతో ట్విషా శర్మ మృతికేసు ఇంకా మిస్టరీగానే ఉంది. పోస్ట్‌మార్టం నివేదిక, ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు ప్రకారం.. ట్విషాది ఆత్మహత్యేనని పోలీసులు చెబుతున్నారు. ఈ కేసులో ఆమె కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు ట్విషా మృతదేహానికి రెండోసారి పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు మధ్యప్రదేశ్ హైకోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే.. పది రోజులుగా పరారీలో ఉన్న భర్త సమర్థ్ సింగ్‌ను ఎట్టకేలకు పోలీసులు మే 22న అరెస్ట్ చేశారు. అతణ్ని కోర్టులో హాజరుపరచనున్నారు.

## కుమారుడు ట్రంప్ జూనియర్ వివాహం

### ప్రస్తుత పరిస్థితుల్లో హాజరు కాలేనన్న ట్రంప్

వాషింగ్టన్,మే23(ఆర్ఎన్ఎ): ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి తాను హాజరుకాక పోవచ్చని పేర్కొన్నారు. ఆ వేడుకకు హాజరైనా.. హాజరుకాకపోయినా తప్పుడు వార్తలతో తనను చంపేస్తారని చమత్కరించారు. అందుకే వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని.. అయితే ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో అది కష్టంగా మారే అవకాశం ఉందని తెలిపారు. 48 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారాంతంలో తన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్‌ను వివాహం చేసుకోనున్నారు.

## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

### లారీని ఢీకొన్న క్రూజర్.. ఐదుగురు దుర్మరణం

బెంగళూరు,మే23 : కర్ణాటకలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లాడ్లాపూర్ సమీపంలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. వేగంగా వెళ్తున్న క్రూజర్ వాహనం ముందున్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లాడ్లాపూర్ దగ్గర లారీని క్రూజర్ వాహనం ఢీకొట్టడంతో ఐదుగురు మృతిచెందారని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. మృతులను క్యాష్వార్, హుస్సేన్, అలీ, రసూల్, ఫాతిమాగా గుర్తించారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని పోలీసులు వెల్లడించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో క్రూజర్ వాహనం పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒక్కసారిగా కుటుంబంలోని ఐదుగురు మృతిచెందడంతో బంధువులు, స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## సమదృష్టి సాధ్యమా?



ఆధ్యాత్మికం

చరాచర ప్రకృతిలోని సకల జీవులను తనతో సమంగా భావిస్తూ, తనలో దర్శిస్తూ, ఇతరుల కష్టసుఖాలకు సహృదయంతో స్పందించేవారిని, పరమ యోగులుగా పరిగణిస్తాను' అంటాడు కృష్ణపరమాత్మ. వ్యక్తి ఎలాగైతే శరీరంలోని అవయవాలను తనవిగా భావిస్తూ అన్నిటినీ సమానంగా ఆదరిస్తాడో, అలాగే తన అంశ అయిన అన్ని జీవరాసులనూ పరమాత్మ సమంగానే చూస్తాడు. పరమాత్మలాగే పరమయోగులూ ప్రపంచంలోని ప్రతి జీవినీ సమదృష్టితో దర్శిస్తారు. జీవకోటీ శ్రేయస్కరమైన మార్గంలో తరించాలనీ తపిస్తారు. 'సమం పశ్యతి' అంటే సమదర్శనం. సృష్టిలో ఒకే విధంగా జనించని అందరినీ సమంగా దర్శించడం సాధ్యమా? ఒక్కొక్కరి బలాలు, బలహీనతలు వేరువేరుగా ఉంటాయి. అలాంటప్పుడు అం దరినీ సమదృష్టితో ఆదరించాలి అనడం వినడానికి బాగుంటుందేమో కాని ఆచరణలో సాధ్యమా? నిజానికది చూసేవారి దృష్టికోణమే కాని, చూడబడేవారికి సంబంధించినది కాదు! కాబట్టి అసాధ్యం కాదు.. సాధన చేస్తే సమదృష్టి అలవడడం జరుగుతుంది. వ్యక్తిలో భౌతిక ఆధ్యాత్మిక పార్శ్వాలలో జాత్యంతరీకరణ జరగాలి. జాతి అంటే స్థాయి. నిజానికి వ్యక్తుల సాధనలో వారి స్థాయిని బట్టి వారి దృష్టి పరిణతి చెందుతుంది. భౌతిక దృష్టికోణంతో పరిశీలిస్తే.. 'నేను నాది, నీవు నీది' అనే భేదభావం కలుగుతుంది. స్థాయి కొంత ఉన్నతమైతే ఎదుటివారిని భౌతికంగా కాకుండా ఆత్మగా భావిస్తాం. భేదమనేది భౌతికమే కాని ఆత్మపరంగా లేదనే సత్యం అవగతమైతే జాతి మత స్థాయి భేదాలకు ప్రాధాన్యం లేకుండా అందరినీ ఒకే దృష్టితో చూస్తాం. స్థాయిని మరింత పెంచుకున్న సాధకులు అందరిలోనూ పరమాత్మను దర్శించగలుగుతారు. అయితే వారు కూడా భౌతిక జగత్తును పట్టించుకుంటారు.. కాకపోతే ఫలితాలపై ఉదాసీన వైఖరితో కర్మలను ఆచరిస్తారు. సమాజంలో మంచిని మాత్రమే స్వీకరించి చెడును వదిలేస్తారు. పరమయోగులు అత్యున్నత స్థాయికి చెందినవారు.

# సీసీ ఫుటేజ్‌తో భారీ చోరీ కేసు ఛేదించిన అమీన్పూర్ పోలీసులు: 50 లక్షల బంగారం స్వాధీనం





**పటాన్చెరు(అమీన్పూర్), మే 23(ది క్రైమ్ న్యూస్):** గత నెలలో జరిగిన భారీ చోరీ కేసును అమీన్పూర్ పోలీసులు కేవలం 15 రోజుల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. బంధం కొమ్ము కాలనీలోని హిల్ టాప్ హోమ్స్‌లో నివాసం ఉంటున్న వెంకటరమణ- భవాని ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహబూబ్‌నగర్‌కు చెందిన శివ అనే వ్యక్తి సుమారు రూ.50 లక్షల విలువ చేసే అర కిలో బంగారాన్ని అపహరించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. దొంగిలించిన బంగారాన్ని స్వాధీనం చేసుకుని బాధితురాలికి అప్పగించారు. ఈ సందర్భంగా హిల్ టాప్ హోమ్స్ కాలనీలో పోలీసులు కాలనీవాసులతో సమావేశం నిర్వహించి పలు జాగ్రత్తలు సూచించారు. దొంగతనాలు నివారించాలంటే ప్రతి ఇంటికి, కాలనీల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటిని ఖాళీగా వదిలి బయటకు వెళ్లేటప్పుడు బయట లైట్లు ఉంచాలని, నగదు, బంగారాన్ని నమ్మకమైన వ్యక్తుల వద్ద లేదా బ్యాంకు లాకర్లలో భద్రపరచాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హిల్ టాప్ హోమ్స్ కాలనీలో త్వరలోనే సమగ్ర సీసీటీవీ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని కాలనీవాసులకు పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఏసీపీ శ్రీనివాస్, అమీన్పూర్ సీఐ నరేష్, డీఐ సత్యనారాయణతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# పెండింగ్ క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలి: టి యు సి ఐ

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** శుక్రవారం ఖమ్మం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్లో భవనిర్మాణ కార్మికుల అడ్డవద్ద కరపత్రం ఆవిష్కరణ చేసి ప్రచారం నిర్వహించడం జరిగింది టి యు సి ఐ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ జిల్లా నాయకులు పేరబోయిన వెంకన్న పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఉన్న కార్మికులకు పూర్తిస్థాయిలో ఫలితాలు అందడం లేదు. రాష్ట్రంలో ఉన్న కార్మికులందరికీ బిఓసి కార్డులు లేవు కార్డు తీసుకున్న కార్మికులు రెన్యువల్సు చేసుకోలేకపోతున్నారు కార్డు ఉండి రెన్యువల్ అయినా కార్మికులకు క్లెయిమ్స్ సక్రమంగా అందడం లేదు. ఏ రకంగా చూసిన నిరక్షరాసులైన భవన నిర్మాణ కార్మికులకు సులభతరంగా లబ్ధి దొరకడం లేదు దాంతో తీర్వమైన నష్టాలకు గురవుతున్నారు. 60 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికుడికి కార్డు ఉపయోగపడటం లేదు. భవన నిర్మాణ కార్మికుడిగా నెలకు1000 చొప్పున సంవత్సరానికి 12 రూపాయలు చెల్లిస్తున్న ఆ కార్మికుడికి పెన్షన్స్ సౌకర్యం లేదు ప్రభుత్వ వాగ్దానంలో భాగంగా సహజంగానే పెన్షన్లు ప్రకటిస్తున్న ప్రభుత్వాలు కార్మికుడిగా నమోదు చేసుకున్నప్పటికీ పెన్షన్లు ప్రకటించడానికి ప్రభుత్వం వెనకాడుతున్నది. చలిలో వణుకుతూ, వానలో తడుస్తూ, ఎండలో ఎండుతూ, ఆరుగాలం కష్టపడి నిర్మాణాలు ( ప్రాజెక్టులు, పెద్ద పెద్ద బిల్డింగులు) చేస్తున్న జాతి నిర్మాణం కోసం కృషి చేస్తున్న పెన్షన్ ఇవ్వడం లేదు 60 సంవత్సరాల పైబడిన వారికి నెలకు 9000 పెన్షన్ ఇవ్వాలని కోరుతున్నాం. మరియు ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలు డెలివరీ, మ్యారేజ్ గిఫ్ట్, సహజ మరణం, పథకాలను




పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈనెల 25 వ తేదీన చలో హైదరాబాద్ ను అన్ని గ్రామాలలో ఉన్న భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘశీ వేముల ఉపేందర్, నరసయ్య, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ లోని కాశ్మీర్ గడ్డలో ఘనంగా 'నిజాం గేమింగ్ జోన్' ప్రారంభోత్సవం





**కరీంనగర్ టౌన్, మే23(ది క్రైమ్ న్యూస్):** నగరంలోని కాశ్మీర్ గడ్డ ప్రాంతంలో, గ్రో హై అకాడమీ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన 'నిజాం గేమింగ్ జోన్' శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ఈ సరికొత్త గేమింగ్ జోన్‌ను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో 60వ డివిజన్ కార్పొరేటర్ జనాబ్ ఇబ్రహీం బియాబాని, మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి, స్థానిక డివిజన్ నాయకులు, గేమింగ్ జోన్ నిర్వాహకులు, స్థానిక డివిజన్ వాసులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# రామప్రభు ఆధ్వర్యంలో 4వ వారం అన్నదాన కార్యక్రమం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారాంత అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం నాలుగో వారం అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. సమాజంలో ఆపన్నులకు అండగా నిలవాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా అవసరమైన వారికి ప్రేమతో, సేవాభావంతో అన్నదానం అందజేశారు. పేదలు, నిరాశ్రయులు, కార్మికులు, అవసరమైన పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొని భోజనం స్వీకరించారు. సేవ చేయడం ద్వారా సమాజానికి తోడ్పాటు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ పి టీమ్ సభ్యులు, ట్రస్ట్ ప్రతినిధులు, యువకులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ఏర్పాట్లలో సహకరించారు. ఈ సందర్భంగా అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ, సమాజ సేవలో భాగంగా భవిష్యత్తులో కూడా నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కన్నా గొప్ప సేవ మరొకటి లేదని పేర్కొన్నారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ట్రస్ట్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాటా శ్రీనివాస్ గౌడ్‌పై కాటా సునీతరాజేష్ గౌడ్ ఫైర్

### ప్రాణహాని ఉందంటూ ఏసీబీకి ఫిర్యాదు




**పటాన్చెరు(అమీన్ పూర్), మే 23(ది క్రైమ్ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ కాట శ్రీనివాస్ గౌడ్‌పై ఆయన వదిన కాట సునీత గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆస్తి పంపకాల విషయంలో మాట్లాడదామని పిలిచి కాట రాజేష్ గౌడ్‌పై దాడి చేశారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు రామచంద్రాపురం ఏసీపీ శ్రీనివాస్ కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సునీత గౌడ్ మాట్లాడుతూ, "దర్శన్ గౌడ్‌కు రాజేష్ గౌడ్ పుట్టలేదని చెప్పడం హాస్యాస్పదం" అని విమర్శించారు. కాట దర్శన్ గౌడ్‌కు రాజేష్ గౌడ్ పుట్టలేదని ఎలా చెబుతున్నారంటూ ప్రశ్నించారు. నిజానిజాలు బయటపడేందుకు డీఎన్ఏ పరీక్ష చేయించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం కట్ట మైసమ్మ దేవాలయానికి పసుపు బట్టలతో రావాలని కాట శ్రీనివాస్ గౌడ్‌కు సవాల్ విసిరారు. కాట శ్రీనివాస్ గౌడ్ ఇంచార్జీ పదవి ఊడబికే వరకు తాను ఊరుకోనని సునీత గౌడ్ స్పష్టం చేశారు. అలాగే తన కుటుంబ సభ్యులకు కాట శ్రీనివాస్ గౌడ్‌తో ప్రాణహాని ఉందని ఆరోపిస్తూ, పోలీసు అధికారులు తగిన రక్షణ కల్పించాలని కోరారు.

# కాఫీ విత్ ఎ కాప్ - మానసిక ఆరోగ్యంపై యువతతో సైబరాబాద్ పోలీసుల ప్రత్యేక చర్చ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "కాఫీ విత్ ఎ కాప్" కార్యక్రమం రెండో ఎపిసోడ్ యువతలో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే దిశగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "మానసిక ఆరోగ్యం సంభాషణతోనే ప్రారంభమవుతుంది" అనే థీమ్‌తో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 16 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు గల యువత పాల్గొని పోలీసులతో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఎస్‌సీఎస్‌సీ డైరెక్టర్, స్ట్రాటజిక్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూషన్ రష్మి శ్రీవాస్తవ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువతకు ఆత్మీయ వాతావరణాన్ని కల్పించారు. కార్యక్రమం ప్రారంభంలో పాల్గొన్న వారు తమ మానసిక పరిస్థితిని ఒకే పదంలో వ్యక్తపరుస్తూ "వన్ వర్డ్ చెక్-ఇన్" నిర్వహించారు. సైబరాబాద్ మహిళా, శిశు భద్రత విభాగం డీసీపీ కె. సృజన మాట్లాడుతూ కఠిన పరిస్థితుల్లో లక్ష్యసాధన పట్ల అంకితభావమే మనిషికి ధైర్యాన్ని ఇస్తుందని తెలిపారు. ఉద్యోగంలో ఎదురయ్యే ఒత్తిడిని కుటుంబ జీవితానికి దూరంగా ఉంచడం ద్వారా సమతుల్యత సాధించవచ్చని పేర్కొన్నారు. క్లిష్టమైన కేసులను ఎదుర్కొన్న అనుభవాలను యువతతో పంచుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన "రెడ్ ఫ్లాగ్ -- గ్రీన్ ఫ్లాగ్" యాక్టివిటీ ద్వారా మానసిక ఆరోగ్యానికి హానికరమైన అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవన విధానాలపై చర్చించారు. అలాగే డంబ్ చరేడ్స్ ఆటల ద్వారా యువత తమ భావాలను వినూత్నంగా వ్యక్తపరిచారు. చివరగా "గివ్ మీ సమ్ సన్‌షైన్...", "లవ్ యూ జిందగీ" పాటలను అందరూ కలిసి ఆలపించడంతో కార్యక్రమం ఆహ్లాదకరంగా ముగిసింది. ప్రతి నెలా కొత్త అంశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ యువత, పోలీసుల మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# వీటిని మీ డైట్‌లో చేర్చుకుంటే.. ఖచ్చితంగా బరువు తగ్గుతారు..

భారతీయ వంటకాల్లో ఉపయోగించే మసాలాలు చాలా ఫేమస్. వీటిని కేవలం వంటలకు మాత్రమే కాకుండా..ఇతరఆరోగ్యప్రయోజనాలుకూడాఉన్నాయి. పూర్వం మందులు సరిగ్గా లేనప్పుడు..వీటినే చికిత్సకు ఉపయోగించేవారు. ఈమసాలాల్లో లవంగాలు కూడా ఒకటి. లవంగాలను పలు రకాల ఆహార పదార్థాల్లో ఉపయోగిస్తూ ఉంటారు. లవంగాల్లో ఎన్నో ఆరోగ్య కరమైన పోషకాలు ఉన్నాయి. వీటితో అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చు. లవంగాల్లో పలు రకాల యాంటీ ఆక్సిడెంట్లు కూడా లభ్యమవుతాయి. లవంగాలు తీసుకోవడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి అనేది పెరుగుతుంది. దీని వల్ల పలు రకాల సీజనల్ వ్యాధులతో పోరాడే శక్తి లభిస్తుంది. లవంగాలతో నోటి ఆరోగ్యాన్ని కూడా మెరుగు పరచుకోవచ్చు. దంతాలు, చిగుళ్ల సమస్యలు, నోటి దుర్వాసన తగ్గించుకోవచ్చు.లవంగాల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలతో... శరీరంలోని ఫ్రీ రాడికల్స్ సమస్యను తగ్గించుకోవచ్చు. వీటితో క్యాన్సర్, గుండె జబ్బులు, డయాబెటీస్ వంటి వాటిని కంట్రోల్ చేయవచ్చు.లవంగాలతో ముఖ్యంగా బరువు కూడా తగ్గొచ్చు. వెయిట్ లాస్ అయ్యేందుకు చాలా రకాలుగా లవంగాలను యూజ్ చేయవచ్చు. రాత్రి పడుకునే ముందు గ్లాస్ నీటిలో రెండే లేదా మూడు లవంగాలను వేసి.. ఉదయం తాగాలి. అదే విధంగా లవంగాలను పొడిలా చేసుకుని.. గోరు వెచ్చని నీటిలో కలిపి అయినా తీసుకోవచ్చు. లవంగాలతోటీకూడా తయారు చేసుకుని తాగవచ్చు. ఇలా ఎలా తీసుకున్నా వెయిట్ లాస్ అవుతారు.

# కౌమార బాలికల ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**మెప్మా ఆధ్వర్యంలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహణ**






**కరీంనగర్ టౌన్, మే23(ది క్రైమ్ న్యూస్):** పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కింద కరీంనగర్ నగరంలోని 2వ డివిజన్ తీగలగుట్టపల్లి లోని బస్తీ దావాఖానాలో కౌమార బాలికల హెల్త్ క్లీనింగ్ క్యాంపును నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ ఆరోగ్య శిబిరంలో కిశోర బాలికలకు అవసరమైన హెచ్‌బి, ఎనీమియా, హైట్, వెయిట్, సీబీపీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన క్యాన్సర్ నివారణ ఇంజెక్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ బాలికల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.అలాగే పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న విద్యా అవకాశాలను తీగలగుట్టపల్లి ప్రాంతానికి చెందిన కౌమార దశ పిల్లలు వినియోగించుకోవడం విశేషంగా నిలిచింది అన్నారు.బాలికల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పీడీ స్వరూపారాణి , సీఓ సునీత , ఆర్ పి లు, డివిజన్ ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలి



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** ఏఐపీకే ఎంఎస్ పాలేరు డివిజన్ ప్రధాన కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర లు ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామ కూలీలతో కూలీల సమస్యలు పరిష్కరించాలని, ఉపాధి కూలీలకు రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని, భూమిలేని కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయలు జీవన భృతి ఇవ్వాలి రైతు భరోసాని ఇవ్వాలి. పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ఏప్రిల్ మే 2 నెలలు ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని 50 శాతం అదనంగా కూలి ఇవ్వాలి. ఉపాధి పని స్థలాలలో కనీస సౌకర్యాలు త్రాగునీరు టెంట్లు వైద్య పరమైన సౌకర్యాలు కల్పించాలి. ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయిస్తూ 200 రోజులు పని దినాలు కల్పించాలి దినసరి కూలి 600 ఇవ్వాలి. కూలీలందరికీ జీవిత బీమా కల్పించాలి. నిత్యవసర సరకుల ధర లన్నింటిని నియంత్రించాలి. కూలీలందరికీ ఆత్మీయ భరోసా అందించాలి. జిరామ్ జి పథకాన్ని తొలగించి మహాత్మ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలి. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి నాట్లు కోతలు కలుపు వివిధ వ్యవసాయ అవసరాలకు ఉపాధి హామీ పథకాలను అమలు చేయాలి ఫోటో క్యాప్సర్ను రద్దు చేయాలి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

# రామగుండం-2 ఏరియాలోని ఓసీపీ-3లో ఓవర్ బర్డన్ తరలింపులో భారీ అక్రమాలు

**● సింగరేణి సంస్థను ఆర్థికంగా నష్ట పరుస్తున్న ఆర్వీఆర్ కాంట్రాక్ట్ సంస్థ ● అర్విఅర్ సంస్థ చేస్తున్న కుంభకోణం పై విజిలెన్స్ విచారణ చేసి బ్లాక్‌లిస్ట్ లో పెట్టాలి ● సింగరేణి సి అండ్ ఎండి ని కోరిన మద్దెల దినేష్**





**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం-2 ఏరియా పరిధిలోని ఓసీపీ-3లో అధికారుల కళ్ల ముందే భారీ అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని టెండర్ నిబంధనల ప్రకారం ఓసీపీ-3 నుండి తవ్వకపు మట్టిని 4.5 కి.మీ దూరంలోని ఎక్స్టర్నల్ డంప్‌యార్డుకు తరలించాలని ఉన్నప్పటికీ గుత్తేదారు ఆర్వీఆర్ సంస్థ కేవలం 400 మీటర్ల దూరంలో ఉన్న ఇంటర్నల్ డంప్‌యార్డులోనే భారీగా మట్టిని డంప్ చేస్తూ కోట్ల రూపాయల లాభం పొందుతూ యాజమాన్యాన్ని ఆర్థికంగా నష్టపరుస్తుందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ సింగరేణి సి అండ్ ఎండి కి, చీఫ్ విజిలెన్స్ అధికారికి, ఆర్జీ - 2 జనరల్ మేనేజర్ లను కోరినట్లు పేర్కొన్నారు. ఓసీపీ-3లో మూడేళ్ల కాలపరిమితో 807 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తరలింపు టెండర్ ఇవ్వబడిందని, రెండేళ్లు పూర్తయినా టెండర్ గైడ్ లైన్ వర్క్ ఆర్డర్ ప్రకారం ఆర్.వి.ఆర్ కాంట్రాక్ట్ సంస్థ పనిచేయడం లేదని ఆరోపించారు. కేవలం రెండేళ్లలో యాభై శాతం క్యూబిక్ మీటర్ల మట్టిని మాత్రమే ఎక్స్టర్నల్ డంప్‌యార్డ్ కు తరలించి రికార్డులో నమోదు చేసారని అన్నారు. మిగిలిన క్యూబిక్ మీటర్ల మట్టిని 75 శాతం ఇంటర్నల్ గా దూరంలోనే లీడ్ లో డంప్ చేసినట్లు సమాచారం, వర్క్ ఆర్డర్ ప్రకారం అధికారులు కాంట్రాక్ట్ సంస్థతో కుమ్మకై ఏలాంటి పెనాల్టీలు కూడా వేయడం లేదు అని, ప్రతి నెల బిల్లులు కూడా అనేక అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నాయని వాటి పై కూడా పూర్తిగా సమగ్ర విచారణ చర్పాట్టాలని డిమాండ్ చేసారు. అదే విధంగా ఈ కుంబకోణానికి సంబంధితఅధికారుల సహకారం అన్నిరకులుగా ఉన్నట్లు అనుమానం బలంగా ఉందని అలాగే రామగుండం రిజియాన్లోని ఓసిపీ లకు అనుగుణంగా ఉన్న ఓబీ కంపెనీలలో ప్రధాన అధికార్లతోపాటు అధికారులు లాలూచి పడుతూ సింగరేణికి వచ్చే అధాయాన్ని గండికోడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేసారు. కావున దీని వల్ల గుత్తేదారుకు కోట్ల రూపాయల లాభం జరుగుతుండగా, సింగరేణి సంస్థకు కోట్లాది రూపాయలు ఆర్థిక నష్టం వాటిల్లుతోందని, కావున, తమరు తక్షణమే స్పందించి ఈ అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించి, బాధ్యులైన అధికారులు, గుత్తేదారుపై కఠిన చర్యలు తీసుకొని, ఆర్వీఆర్ కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేసారు. ముఖ్యంగా సింగరేణిలో ఇప్పటివరకు ఓబీ గుత్తేదార్లు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. ఓబీ పనుల్లో సాంకేతిక సమస్యలను అనుకూలంగా మలచుకొని అక్రమాలకు పాల్పడ్డారు. సకాలంలో పనులు పూర్తి చేయకపోయినా అంతర్గతంగా మేనేజ్ చేస్తూ వస్తున్నారు. టెండరులో ఉన్న లీడ్ కు క్షేత్రస్థాయిలో రవాణా చేసే దూరానికి పొంతన లేకుండా పనులు చేపడుతున్నారు. దీని వల్ల గుత్తేదారు కంపెనీలకు రూ.కోట్ల ఆదాయం సమకూరుతుంది. గతంలో ఇలాంటివి అనేక సంఘటనలు వెలుగు చూసినా చర్యలు తీసుకున్నది చాలా తక్కువే. భవిష్యత్తులో ఇలాంటి వాటికి అవకాశం లేకుండా హెచ్చరిక కోసమైన ఆర్ వి ఆర్ కాంట్రాక్ట్ సంస్థను సింగరేణి యాజమాన్యం బ్లాక్ లిస్ట్ లో పెట్టె నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ దినేష్ చేసారు. ఇట్టి కుంభకోణం విజిలెన్స్ విచారణ చేయాలని, అలాగే కొంతమంది సింగరేణి అధికారులు నిర్లక్ష్యం చేస్తే అర్విఅర్ గుత్తేదార్ పై హై కోర్ట్ ను ఆశ్రయిస్తామని దినేష్ హెచ్చరించారు.

# చనిపోయిన హోంగార్డ్‌కు నివాళులు అర్పించిన పెద్దపల్లి డీసీపీ

**● హోమ్ గార్డ్ శ్రీనివాస్ సేవలు చిరస్థాయిగా స్మరించుకుంటాం**



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హోం గార్డ్ బి.శ్రీనివాస్ శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచిన విషయం తెలుసుకున్న పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్‌తో కలిసి గోదావరిఖని శ్రీనగర్ కాలనీ (వినాయక్ నగర్)లోని ఆయన నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... 1996 సంవత్సరంలో హోంగార్డ్‌గా ఎంపికైన బి.శ్రీనివాస్ గత 30 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో నిబద్ధతతో, నిజాయితీతో ప్రజా సేవలో అహర్నిశలు శ్రమించారని తెలిపారు.ఆయన ఆకస్మిక మరణం పోలీస్ శాఖకు, కుటుంబ సభ్యులకు, సహచర సిబ్బందికి తీరని లోటని పేర్కొన్నారు.ఆయన సేవలను చిరస్థాయిగా స్మరించుకుంటామని, కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ తరఫున హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం, ఓర్పు కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నామని డీసీపీ తెలిపారు. పోలీస్ శాఖ తరఫున అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10,000 చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. డీసీపీ వెంట గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, గోదావరిఖని 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి, రామగుండం సీఐ కృష్ణ,హోంగార్డ్ ఆర్.ఐ పెద్దన్న, ఎంటీవో మల్లేశం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## టీబీ ముక్త్ భారత్ అభియాన్ను సద్వినియోగం చేసుకోండి: రాపాక ప్రవీణ్



**మానకొండూర్, మే23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(వెల్ది)లో శనివారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ఉప సర్పంచ్ రాపాక ప్రవీణ్ హాజరై మాట్లాడుతూ.... దేశ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా ప్రధాని మోడి చేపట్టిన టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ ప్రజలకు టీబీ(క్షయ వ్యాధి)పై ఎక్స్-రే పరీక్షలు నిర్వహించి వ్యాది నిర్మూలనకు చర్యలు శిబిరం ద్వారా చేపట్టబడుతున్నట్లు ప్రవీణ్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి చవన్లాల్, వైద్యాధికారి డా.సాయిప్రసాద్, పీహెచ్ఎన్‌రుద్రమదేవి, హెచ్ఈఓ వెంకటేశం, హెల్త్ సూపర్వైజర్ హాజీ బాబా, ఏఎన్ఎంలు సుమతి, స్వప్న, ఆశా కార్యకర్తలు అంజలి, ఎం.భాగ్యలక్ష్మి, ఎ.భాగ్యలక్ష్మి కారోబార్ సుంక శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బత్తిని పుట్టినరోజు వేడుకల్లో మండల కాంగ్రెస్ నాయకులు



**మానకొండూర్, మే23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శంకరపట్నం మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన టిపిసిసి సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని శ్రీనివాస్ గౌడ్ కు శాలువా కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపెల్లి సంపత్ గౌడ్, బండి మల్లేశం, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీకాంత్, పార్టీ జిల్లా కార్యదర్శి కనకం కుమార్ శ్రీనివాస్ గౌడ్ కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## ఉపాధి కూలీల పట్ల సర్పంచ్, అధికారుల నిర్లక్ష్యం



**మానకొండూర్, మే23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ?అన్నారంలో ఉపాధి హామీ ప్రదేశాన్ని ఉప సర్పంచ్ దాడి సత్తీష్ స్థానిక నాయకులతో కలిసి శనివారం సందర్శించి కూలీలకు చల్లటి నీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సత్తీష్ మాట్లాడుతూ..... గ్రామానికి దూరంగా ఉన్న గుట్టల్లో పనులు కల్పించి, తాగునీరు, నీడ, మెడికల్ కిట్ వంటి కనీస వసతులు కల్పించకపోవడంతో కూలీల పరిస్థితి దయనీయంగా మారిందని, తీవ్ర ఎండలో సైతం కూలీలతో పనులు చేయిస్తూ కూలీల ఆరోగ్యంతో సర్పంచ్, అధికారులు చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు.ఎండ తీవ్రతలు తగ్గే వరకు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు మజ్జిగ,చల్లటి నీరు పంపిణీ చేయడం జరుగుతుందని, పని ప్రదేశం వరకు కూలీలకు ట్రాక్టర్ సౌకర్యం, మంచినీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను డిమాండ్ చేశారు.పార్టీ సింగిల్ విండో డైరెక్టర్ రొడ్డ మహేందర్,మాజీ ఉపసర్పంచ్ మూగల మహేందర్ రెడ్డి,అట్ల గట్టయ్య,రాయికంటి కిరణ్, రాచర్ల రామస్వామి,పురంఅనిల్, రాయికంటి అజయ్ తదితరులు ఉప సర్పంచ్ తో పాటు సందర్శనలో పాల్గొన్నారు.

## రోజూ ఈ మొక్క ఆకులు నాలుగైదు నోట్లో వేసుకుంటే ఏ రోగం దరిచేరదు..

తులసి దాదాపు ప్రతి ఇంట్లో కనిపించే మొక్క. చాలా సులభంగా పెరుగుతుంది. ఈ చిన్న మొక్క శరీరం నుంచి ఎన్నో వ్యాధులను దూరం చేస్తుంది. ఇంట్లో తులసి చెట్టు తప్పకుండా పెంచుకోవాలని మన పూర్వీకుల కాలం నుంచి పెద్దలు చెబుతుంటారు. ఈ మొక్కలో ఎన్నో ఔషధ గుణాలు నిండి ఉంటాయి. ఆయుర్వేదంలో కూడా దీనికి అధిక ప్రాముఖ్యత ఉంది. తులసి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది యాంటీఆక్సిడెంట్‌గా ఉండటమే కాకుండా, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. అంటే ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ఆకు వల్ల కలిగే లాభాలు అన్నీఇన్నీకావు. తులసిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. ఇది జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కలిగిస్తుంది. తులసి జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా ఒత్తిడిని తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. తులసి రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడుతుంది. గొంతు నొప్పి నుంచి ఉపశమనం పొందడానికి తులసి ఆకులు ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇది జ్వరం, చర్మం, జుట్టుకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. రోజూ నాలుగైదు తులసి ఆకులను తింటే ఎన్నో రోగాల నుంచి విముక్తి లభిస్తుంది. అయితే సరైన పద్ధతిలో తింటేనే ఈ ప్రయోజనాలన్నీ పొందవచ్చు. తులసితో టీ కూడా తాగవచ్చు. దీని ఆకులను ఎండబెట్టి, నీటిలో మరిగించి అయినా తాగొచ్చు

## 40వ డివిజన్‌లో డ్రైన్, కల్వర్ట్ నిర్మాణానికి భూమి పూజ చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ టౌన్, మే23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 40వ డివిజన్‌లో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో 10 లక్షల రూపాయలతో చేపట్టనున్న డ్రైన్ , కల్వర్ట్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి డివిజన్‌లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా, వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా ఈ కల్వర్ట్ నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ నలువాల పుష్పలత రవీందర్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు డివిజన్ వాసులు పాల్గొన్నారు.

## పాలకుర్తి నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన కలెక్టర్



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పాలకుర్తిలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి జూన్ 10 నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాలకుర్తిలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి జూన్ 10 నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయ నిర్వహణకు అవసరమైన విద్యుత్, ఇంటర్నెట్, తాగునీటి తదితర మౌలిక సదుపాయాలను కూడా అదే గడువులో పూర్తి చేయాలని సూచించారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, అధికారులు తరచూ పనులను పర్యవేక్షిస్తూ పనుల పురోగతిని సమీక్షించాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కార్యాలయ భవనం అన్ని సౌకర్యాలతో సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఈఈ పీఆర్ శంకరయ్య, తహసీల్దార్ సునీత తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన సర్పంచ్



**మానకొండూర్, మే23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం శ్రీనివాస్ నగర్ లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్ శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఎండ తీవ్రత ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరిగిన తరుణంలో కూలీల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఎవరికీ వడదెబ్బ తగలకుండా పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంటుకు సర్పంచ్ సూచించారు.మండుటెండలో తమ ఇబ్బందులను గుర్తించి సకాలంలో మజ్జిగ పంపిణీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ కు ఉపాధి కూలీలు కృతజ్ఞతలు తెలిపారు.పంచాయతీ కార్యదర్శి అనిత, కరోబార్ శ్రీనివాస్,ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్ తదితరులు పంపిణీలో పాల్గొన్నారు.

## టిపిసిసి డాక్టర్స్ సెల్ సలహాదారుగా ఎమ్మెల్యే కవ్వంపల్లి



**తిమ్మాపూర్,మే23(ది క్రైమ్ న్యూస్):** టిపిసిసి డాక్టర్స్ సెల్ సలహాదారుగా రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను నియామిస్తూ టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ శనివారం ఉత్తర్వు జారీ చేశారు. డాక్టర్ ఏం.రాజీవ్ చైర్మన్ గా కొనసాగుతున్న డాక్టర్ సెల్‌కు రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ గౌరవ సలహాదారుగా, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సలహాదారుగా నియామకమయ్యారు. వీరితో పాటు మరో 16 మందిని సలహాదారులుగా నియమించినట్లు ప్రకటన వెలువడింది.

# మయూరి నగర్‌లో 102 సీసీ కెమెరాల ప్రారంభం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.16 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 102 సీసీ కెమెరాలను శనివారం పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీ రమేష్ రెడ్డి, డీసీపీ రితీరాజ్, అడిషనల్ డీసీపీ సుదర్శన్, ఏసీపీ రవి కిరణ్ రెడ్డి, సీఐ శివ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ మాట్లాడుతూ తన విజ్ఞప్తికి స్పందించి మయూరి నగర్ కాలనీ వాసులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం ఎంతో సంతోషకరమని అన్నారు. 102 సీసీ కెమెరాలను ప్రారంభించడం కాలనీ భద్రతకు కీలక అడుగని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన కాలనీ కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తూ, ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కాలనీల్లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రధాన కూడళ్లు, పార్కులు, బ్లాక్ స్పాట్లు వంటి అవసరమైన ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. "ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం" అని పేర్కొంటూ, నేర నివారణతో పాటు కేసుల పరిష్కారంలో కూడా ఇవి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. పోలీస్ అధికారులు ప్రజల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారని, ప్రజలు కూడా బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు తన వంతు సహకారంగా ఎమ్మెల్యే ఫండ్ (సీడీపీ) ద్వారా రూ.1 కోటి కేటాయించినట్లు వెల్లడించారు. మహిళల భద్రత, ప్రజల రక్షణ, దొంగతనాల నివారణలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగ పడతాయని తెలిపారు. 24 గంటలు నిరంతరం పనిచేసే నిఘా నేత్రాలను ప్రతి కాలనీ, ప్రతి బస్తీలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో, కీలక సాక్ష్యాలుగా ఇవి ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. అన్ని కాలనీల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని, మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మియాపూర్ డివిజన్, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లగండ్ల హుడా కాలనీలో రూ.5.85 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో రూ.5 కోట్ల 85 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న నూతన బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. నల్లగండ్ల హుడా కాలనీలో చేపడుతున్న బీటీ, సీసీ రోడ్ల నిర్మాణంతో కాలనీ వాసులకు ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలబెడతామని గాంధీ తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ రహిత, సౌకర్యవంతమైన రవాణా కోసం రోడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, గచ్చిబౌలి డివిజన్‌ను ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతానని గాంధీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైర్ చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా ముఠా అరెస్ట్

**రామగిరి ఎస్ఐలు తాడవేని శ్రీనివాస్, దివ్య,సిబ్బంది అభిషేక్,రమేష్, రాజ్‌కుమార్‌లను అభినందించన డీసీపీ, ఏసీపీలు పెద్దపల్లి డీసీపీ భూక్యా రామ్‌రెడ్డి**







**రామగిరి, మే 23(ది క్రైమ్ న్యూస్):-** పంట పొలాల వద్ద, రోడ్ల వెంబడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరును చోరీ చేస్తున్న దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు పెద్దపల్లి డీసీపీ భూక్యా రామ్‌రెడ్డి తెలిపారు. శనివారం రామగిరి పోలీస్ స్టేషన్‌లో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, మంథని సీఐ బొల్లపల్లి రాజు, రామగిరి ఎస్ఐలు తాడవేని శ్రీనివాస్, దివ్య సిబ్బందితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం నమ్మదగిన సమాచారం మేరకు కల్వచర్ల మారుతీనగర్ హనుమాన్ ఆలయం వద్ద దొంగిలించిన వస్తువులను తరలిస్తుండగా సుల్తానాబాద్ మండలం దేవునిపల్లికి చెందిన శీర్ల లచ్చయ్య, మోటం దేవేందర్, మోటం జంపయ్య, మోటం అజయ్‌లను ఎస్ఐ తాడవేని శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరంతా దగ్గరి బంధువులని, ప్రస్తుతం రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నారని చెప్పారు. వీరు ముఠాగా ఏర్పడి రామగిరి మండలం పన్నూరులోని జేఎన్‌టీయూ కళాశాల సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్, మంథనిలోని అయ్యగారు చెరువు కట్ట, కూచిరాజ్‌పల్లి, అక్కేపల్లి ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు, సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్, అంతర్గాం మండలం కుందనపల్లి పంప్‌హౌస్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్, రామగిరి మండలం కల్వచర్ల కృష్ణవేణి పాఠశాలలోని ఏసీ ఔటర్ చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. దొంగిలించిన రాగి వైర్, ఏసీ ఔటర్‌ను మోటార్ బైక్‌లపై తరలిస్తుండగా కల్వచర్ల హనుమాన్ ఆలయం వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.80 వేల విలువైన కాపర్ వైర్, రూ.20 వేల విలువైన ఏసీ ఔటర్, 2 మోటార్ బైక్‌లు,3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రామగిరి ఎస్ఐలు తాడవేని శ్రీనివాస్, దివ్య,సిబ్బంది అభిషేక్, రమేష్, రాజ్‌కుమార్‌లను డీసీపీ, ఏసీపీలు అభినందించారు.

# ప్రభుత్వం అనుమతించిన నిర్ణీత ప్రదేశాల్లోనే జంతువధ నిర్వహించాలి

- బహిరంగ ప్రదేశాలలో జంతు అవశేషాలను పారవేయకుండా పరిశుభ్రత పాటించాలి
- అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి డీసీపీ బి.రామ్ రెడ్డి




**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వం అనుమతించిన నిర్ణీత ప్రదేశాల్లోనే జంతువధ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాలలో జంతు అవశేషాలను పారవేయకుండా పరిశుభ్రత పాటించాలని పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి తెలిపారు. శనివారం గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ లో ముస్లిం, హిందు, క్రిస్టియన్ మత పెద్దలతో నిర్వహించిన పోలీసుల శాంతి సమన్వయ సమావేశంలో డీసీపీ పాల్గొని మాట్లాడారు. పండుగ నేపథ్యంలో ఎలాంటి అపోహలు, వదంతులు వ్యాప్తి చెందకుండా ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా వచ్చే అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని, వాటిని బాధ్యతారాహిత్యంగా ఇతరులకు షేర్ చేయవద్దు అని స్పష్టం చేశారు. పండుగ రోజుల్లో పరిశుభ్రత పాటిస్తూ మున్సిపల్ సిబ్బందికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని, అంతే తప్ప చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోకూడదన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవిస్తూ, సోదరభావంతో బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ఈ సమన్వయ సదస్సులో గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్ ఐ లు రమేష్, మనోహర్, అనుష మరియు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాత్రుళ్లు చపాతీలు తినవచ్చా.? ఆరోగ్య ప్రయోజనాలెన్నో తెలిస్తే.!

ఉరుకుల పరుగుల జీవితంలో భాగంగా ప్రజల లైఫ్ స్టైల్ రోజురోజుకూ మారుతూ వస్తోంది. ఇలా మారడం మూలంగా పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం చాలా మందిని పట్టి పీడిస్తున్న సమస్య అధిక బరువు. రెగ్యులర్ డైట్‌లో క్యాలరీలు ఎక్కువ కావడం, శారీరిక శ్రమ లేకపోవడం.. అలాగే టైంకి సరిగ్గా తినకపోవడం.. ఇవి జరుగుతున్నాయ్. ఇక ఇలా ఉంటే మీ ఆరోగ్యానికే ప్రమాదమని అంటున్నారు వైద్య నిపుణులు. ఇదిలా ఉండగా.. చాలామంది రాత్రుళ్లు అన్నం బదులుగా జొన్న రొట్టెలు, రోటీ లేదా చపాతీలు లాంటివి తింటుంటారు. రాత్రిపూట ఎక్కువగా వైట్ రైస్ బదులే.. ఈ చపాతీలు తినడానికే ప్రాధాన్యత ఇస్తారు. ఎందుకంటే.! చపాతీలను తయారు చేసే గోధుమపిండిలో విటమిన్ బీ, ఇ, కాల్షియం, ఐరన్, జింక్, సోడియం, పోటాషియం, మెగ్నీషియం వంటివి పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి కావాల్సినంత శక్తిని ఇస్తాయి. పైగా వైట్ రైస్ కంటే త్వరగా చపాతీలు జీర్ణం అవుతాయి. ఇక చపాతీలను కాల్చేటప్పుడు తక్కువ నూనె వేసి కాల్చితే.. అన్నంతో పోలిస్తే క్యాలరీలు కూడా తక్కువ ఉంటాయి. రెండు లేదా మూడు చపాతీలు తింటేనే మనకు కడుపు నిండిన ఫీలింగ్ ఉంటుంది. దీని వల్ల మన బరువు కూడా కంట్రోల్‌లో ఉంటుంది. అయితే రాత్రిపూట అప్పుడే చేసుకుని చపాతీలు తినడం కంటే.. నిల్వ ఉన్న చపాతీలు తినడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. మిగిలిపోయిన చపాతీలు తినడం వల్ల బ్లడ్ ప్రెషర్ లెవెల్స్ సమతుల్యంగా ఉండటమే కాకుండా కడుపునొప్పి సమస్య కూడా ఉండదని అంటున్నారు. గ్యాస్, కాన్స్టిపేషన్, ఎసిడిటీ వంటి సమస్యలు దూరం అవుతాయట. డయాబెటిస్ కంట్రోల్‌లో ఉంటుందట. పాలల్లో నానబెట్టుకుని తీసుకునే చపాతీలతో కూడా ఇన్నే ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు. కాగా, మీరు ఏదైనా డైట్ ఫాలో అయ్యే ముందు కచ్చితంగా మీ డాక్టర్‌ను సంప్రదించండి.. పై వార్త కేవలం పలు అధ్యయనాలు ఆధారంగా ప్రచురితం చేసింది మాత్రమే.

# రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ ఉక్లా డిమాండ్



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మే 23(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ ఉక్లా ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వికసిత్ భారత్ కార్యక్రమాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన కోరారు. అలాగే కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతన్న ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తికాకపోవడం దురదృష్ట కరమని అన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఎన్నో హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐకేపీ కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. ధాన్యం కొనుగోలు ఆలస్యం కారణంగా రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రాత్రింబవళ్లు కాపలా కాస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే పలువురు రైతులు మృతి చెందారని, మృతి చెందిన రైతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతన్నల సమస్యలను వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని బానోత్ ఉక్లా ప్రభుత్వాలను కోరారు.

# ఖాసింపేట ఐకెపి ముందు రైతులతో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన



**గన్నేరువరం,మే23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం ఖాసీంపేటలోని ఐకేపీ ముందు బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో రైతులు శనివారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా గంప వెంకన్న మాట్లాడుతూ.... మండల వ్యాప్తంగా ఐకెపి, డీసీఎంఎస్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్ష నిర్వహించకపోవడం వలన కొనుగోలు కేంద్రాలలో తూకం, లోడింగ్ సరఫరాలో నత్తనడక కొనసాగుతుందన్నారు.ఆయా కేంద్రాలలో తూకం వేసిన బస్తాలు, వడ్ల కుప్పలు విరివిగా ఉండడం వలన రైతులు ఎండవేడికి తట్టుకోలేక వడ్ల కుప్పల వద్దనే మరణించారని,ఇది కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల హత్యలేనని ఆరోపించారు. పది రోజుల్లో రోహిణి కార్తె మొదలు కానుండగా అధికంగా వర్షాలు పడితే ఆరుగాలం కష్టపడి పండించిన రైతుల వడ్లు వర్షార్పణం అయితే నష్టపోయేది రైతు లేనని,అన్ని కేంద్రాలలో గన్ని సంచులు కొరత, లారీల కొరత ఉందని స్పష్టంగా కనిపిస్తుండగా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆయా కేంద్రాలను సందర్శించి కేంద్రాల నిర్వహకులతో మాట్లాడిన సందర్భాలు లేవన్నారు. ఈ నిర్లక్ష్య ధోరణితో రైతులకు నష్టం జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల యొక్క ఉసురు , కన్నీళ్లు శాపంగా తగులుతాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి తూకంలో వేగం పెంచి ఎప్పటికప్పుడు లోడింగ్ చేసి మిల్లులకు తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పుల్లెల లక్ష్మణ్, న్యాత సుధాకర్, మీసాల ప్రభాకర్, గొల్లపల్లి రవి, కొట్టే భూమయ్య, దొగ్గలి బాలయ్య, బూర శ్రీనివాస్, జీల తిరుపతి,రామంచ ఈదయ్య తదితరులు అధిక సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు.

# పోషకాల దానిమ్మ.. లాభాలతోపాటు నష్టాలు కూడా ఉన్నాయండోయ్..

## ఈ సమస్యలున్న వారు తినకూడదంట..



పండ్లు మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. రెగ్యులర్‌గా పండ్లు తినేవారికి జబ్బులు అంత తేలికగా దరిచేరవు. అందుకే.. వైద్యులు పండ్లను తినాలని సూచిస్తుంటారు. ఎందుకంటే.. పండ్లలో పోషకాలతోపాటు.. వ్యాధులను నివారించే లక్షణాలను కలిగి ఉంటాయి.. అలాంటి పండ్లలో దానిమ్మ ఒకటి.. దానిమ్మ పండు.. చాలా రుచిగా.. తీపిగా ఉంటుంది. ఇది అనేక వ్యాధుల నివారణకు కూడా ఉపయోగపడుతుంది. రక్తహీనత, పలు సమస్యల నివారణకు దానిమ్మపండు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. దానిమ్మ పండులో విటమిన్ సి, బి ఉంటాయి. ఇందులో మెగ్నీషియం, పొటాషియం, ఫాస్పరస్, సెలీనియం, జింక్ పుష్కలంగా ఉన్నాయి. అయితే.. దానిమ్మ పండు తినడం వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు, కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. దానిమ్మ తినడం వల్ల కలిగే లాభాలు, నష్టాలు ఏంటో తెలుసుకోండి.. దానిమ్మలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇతర పండ్ల రసాల కంటే దానిమ్మ రసంలో ఎక్కువ యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది కణాలను దెబ్బతినకుండా కాపాడుతుంది. క్యాన్సర్ రాకుండా ఉండాలంటే దానిమ్మపండు తినాలి. దానిమ్మ రసం క్యాన్సర్‌తో బాధపడేవారికి మేలు చేస్తుంది. ప్రోస్టేట్ క్యాన్సర్ కణాలను నిరోధించడానికి దానిమ్మ రసం తీసుకోవాలి. ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. అల్జీమర్స్ వ్యాధి రాకుండా ఉండాలంటే దానిమ్మపండు తినాలి. దీని విత్తనాలు అల్జీమర్స్ వ్యాధి అభివృద్ధిని నిరోధిస్తాయి. ఇంకా జ్ఞాపకశక్తిని బలపరుస్తాయి. దానిమ్మ రసం పేగు మంటను తగ్గించడం ద్వారా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. విరేచనాల సమస్య ఉంటే, దానిమ్మ రసం తీసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. కీళ్ల నొప్పులు, నొప్పి.. ఇతర రకాల ఆర్థరైటిస్‌లకు దానిమ్మ రసం ప్రయోజనకరంగా ఉంటుంది. దానిమ్మ రసం గుండె జబ్బులకు కూడా మేలు చేస్తుంది. రక్తపోటు రోగులకు కూడా దానిమ్మ రసం ప్రయోజనకరంగా ఉంటుంది. మధుమేహం ఉన్న వారు సైతం దానిమ్మ రసాన్ని తాగొచ్చు.. దానిమ్మ ఇన్సులిన్, రక్తంలో చక్కెరను తగ్గించడంలో సహాయపడుతుంది. దానిమ్మ తినడం వల్ల కలిగే నష్టాలు తక్కువ రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్న వారు దానిమ్మ రసాన్ని తక్కువ మోతాదులో తీసుకోవాలి. విరేచనాలు అయ్యే సమయంలో కూడా దానిమ్మ రసం తాగకూడదు. చర్మానికి దానిమ్మ రసాన్ని రాసుకుంటే చాలా మందికి దురద, వాపు లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది. దానిమ్మ ఎక్కువగా తీసుకుంటే.. మీ జీర్ణశయాంతర ప్రేగులను చికాకుపెడుతుంది.. ఇది జీర్ణవ్యవస్థను అడ్డుకుంటుంది. దానిమ్మను ఎక్కువగా తీసుకోవడం వల్ల కొన్ని సందర్భాల్లో వికారం, వాంతులు, కడుపు నొప్పి, మలబద్ధకం లేదా విరేచనాలు సంభవించవచ్చు.

### ఈ జబ్బులుంటే పచ్చి మామిడి ముక్కపై ఉప్పు, కారం కలిపి ఒక్కసారి తినండి..!

# మీ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికినట్టే..



మామిడికాయల్లో చక్కెర చాలా తక్కువగా ఉంటుంది. మధుమేహంతో బాధపడేవారు ఎలాంటి ఆందోళన లేకుండా పచ్చి మామిడి కాయలను ఎంచక్కా లాంగించేయొచ్చు. ఇలా తీసుకోవడం వల్ల శరీరంలో రక్తప్రసరణ కూడా మెరుగుపడుతుంది. రక్తప్రసరణ సక్రమంగా జరిగితే గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మామిడి రక్తపోటును తగ్గించడంలో కూడా సహాయపడతాయి. పచ్చిమామిడిలో మెగ్నీషియం, పొటాషియం,సంపూర్ణం గా లభిస్తాయి. కాబట్టి, పచ్చి మామిడికాయ తినడం గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. పచ్చి మామిడికాయ తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ నియంత్రణలోకి వస్తే అనేక వ్యాధులను నయం చేస్తుంది. మామిడికాయలో జీర్ణక్రియకు



అవసరమైన అమైలేస్ అనే డైజెస్టివ్ ఎంజైమ్‌లు ఉంటాయి. అమైలేస్ ఎంజైమ్‌లు సంక్లిష్ట కార్బోహైడ్రేట్‌లను మాల్టోస్, గ్లూకోజ్ వంటి చక్కెరలుగా మార్చడంలో సహాయపడతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి మామిడికాయలు ఉత్తమ ఔషధం. మామిడిలో ఉండే ఎనెనిన్ కొవ్వు, కొలెస్ట్రాల్, చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. దీని ద్వారా మామిడి కూడా బరువు నియంత్రణలో సహాయపడుతుంది. పచ్చి మామిడి కాయ వేసవి వేడిమి ప్రభావాన్ని తగ్గిస్తుంది. శరీరంలో నీటి శాతం పెంచేందుకు పచ్చి మామిడి తింటారు. ఇమ్యునిటీ ని తిరిగి పొందాలంటే పచ్చి మామిడి దోహదం చేస్తుంది. పచ్చిమామిడిలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. కాబట్టి పచ్చి మామిడి ముక్కలపై కాస్త ఉప్పు, కారం దట్టించి తింటే.. ఇమ్యునిటీ ని పెంచేందుకు సహకరిస్తుంది. అంతేకాదు.. పచ్చి మామిడి కాయ తినటం వల్ల వేసవిలో వచ్చే సమస్యల నుంచి రక్షించుకోవచ్చు. పచ్చి మామిడి కాయలో లభించే ఫెనోల్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్ పుష్కలంగా లభిస్తాయి. అది క్యాన్సర్ వల్ల వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మామిడి కాయ శరీరంలో వచ్చే వాపులను తగ్గిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. పచ్చి మామిడి కాయ తినడం వల్ల చర్మం సంరక్షిస్తుంది. పచ్చిమామిడి తినడం వల్ల మొటిమలు, మొటిమల వల్ల ఏర్పడే మచ్చలు, కంటికింద చారలు, గుంటలు పడడం, రకరకాల సమస్యలను దూరం చేస్తుంది.

## మధుమేహులకు అద్భుత మెడిసిన్ మంజిష్ట ..!ఇలా వాడితే షుగర్ కంట్రోల్..?

మధుమేహం.. ఇప్పుడు మన దేశంలో ఒక మహమ్మారిలా విస్తరిస్తోంది. ఒక లెక్క ప్రకారం, ప్రస్తుతం దేశంలో మధుమేహంతో బాధపడుతున్న వారి సంఖ్య 10 కోట్లకు పైగా ఉంది. ప్యాంక్రియాస్ తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయడం ఆపివేసినప్పుడు లేదా ఇన్సులిన్ ఉత్పత్తి చేయబడి సరిగ్గా పని చేయనప్పుడు వారు మధుమేహాన్ని ఎదుర్కొంటారు. అటువంటి పరిస్థితిలో ఆహారం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అవసరానికి మించి పెరుగుతాయి. ఈ పరిస్థితిని మధుమేహం అంటారు. ప్రస్తుతం మధుమేహానికి ఖచ్చితమైన చికిత్స లేదని మనందరికీ తెలిసిందే. అయితే మంచి జీవనశైలి, సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఈ తీవ్రమైన వ్యాధిని చాలా వరకు నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇదీ కాకుండా, ఆయుర్వేదంలో ఇటువంటి అనేక మూలికలు ప్రస్తావించబడ్డాయి. ఇవి మధుమేహం పరిస్థితిని నియంత్రించడంలో సహాయపడతాయి. అటువంటి ఆయుర్వేద



మూలికల గురించి ఇక్కడ తెలుసుకుందాం.. మంజిష్ట.. ఈ ఆయుర్వేద మూలిక మధుమేహ రోగులకు ఔషధం.. దీని శాస్త్రీయ నామం రూబియా కార్డిఫోలియా ఎల్. ఆయుర్వేదం కాకుండా అనేక ఆరోగ్య నివేదికలు కూడా ఈ హెర్బ్ మధుమేహం నిర్వహణలో తోడ్పడుతుందని చెబుతున్నాయి. సైన్స్ ప్రకారం, మంజిష్ట హైపోగ్లైసీమిక్ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. దీని కారణంగా భోజనం తర్వాత శరీరంలో చక్కెర మొత్తం పెరగడానికి అనుమతించదు. ఇది కాకుండా, ఈ ఆయుర్వేద మూలికలో కొన్ని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. ఇవి మధుమేహ సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. మంజిష్ట దాని వేడి స్వభావం కారణంగా శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్ తగ్గించడం ద్వారా జీవక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. తిన్న వెంటనే శరీరంలో చక్కెర తగ్గుతుంది. మళ్లీ పెరగదు. ఇది కాకుండా, మంజిష్ట ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. ఎలా తీసుకోవాలంటే. ఒక చెంచా మంజిష్ట పొడిని ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లతో కలిపి భోజనం, రాత్రి భోజనం తర్వాత క్రమం తప్పకుండా తీసుకుంటే మేలు జరుగుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ పద్ధతిని అనుసరించడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

## బొప్పాయితో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు.. కానీ దీన్ని ఇలా తింటేనే మంచిది!



బొప్పాయి.. అందరికీ అందుబాటులో ఉండే చవకైన రుచికరమైన, జ్యూసీ పండు. ఇది వేసవి కాలంలో తినడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది చాలా తీపి మరియు జ్యూసిగా ఉంటుంది, ఇది తిన్న తర్వాత చాలా తాజాగా అనిపిస్తుంది. బొప్పాయి చాలా రుచికరమైన పండు, ఇందులో అనేక విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇందులో ఉండే పాపిన్ అనే ఎంజైమ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే పోషకాలు అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలో కూడా సహాయపడతాయి. అంతే కాదు బొప్పాయి తినడం వల్ల చర్మానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. అంతేకాదు.. బొప్పాయిని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోండి. బొప్పాయి ప్రయోజనాలు: షుగర్‌ని నియంత్రించడం నుండి బరువు తగ్గడం వరకు, ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు. బొప్పాయి చాలా రుచికరమైన పండు. ఇందులో అనేక విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇందులో ఉండే పాపిన్ అనే ఎంజైమ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందువల్ల, బొప్పాయిని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. బొప్పాయిలో పపైన్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఈ ఎంజైమ్ ప్రోటీన్లను జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. బొప్పాయి సహజమైన భేదిమందు కూడా. ఇది మలబద్ధకం నుండి ఉపశమనాన్ని అందించడంలో కూడా సహాయపడుతుంది. అందువల్ల, ఉదయం ఖాళీ కడుపుతో దీన్ని తినడం వల్ల ప్రేగుల కదలిక మెరుగుపడుతుంది. ఉబ్బరం సమస్యను నివారిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి: బొప్పాయిలో యాంటీ-ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో ఫ్రీ రాడికల్స్ డ్యామేజ్‌ని తగ్గిస్తుంది. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇది కెరోటినాయిడ్స్ వంటి యాంటీ-ఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. ఇది ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. తద్వారా అనేక వ్యాధులను నివారిస్తుంది. గుండెకు ప్రయోజనకరం: బొప్పాయిలో విటమిన్ సి, యాంటీ-ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది మంచి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అందువల్ల, బొప్పాయి తినడం ఆరోగ్యకరమైన గుండెకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది: బొప్పాయిలో లైకోపీన్, విటమిన్ సి ఉన్నాయి. ఇది ఫ్రీ రాడికల్స్ డ్యామేజ్‌ని తగ్గిస్తుంది. అకాల వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. డార్క్ స్పాట్స్‌తో పాటు ముడతలు, ఫైన్ లైన్‌లను తగ్గించడంలో కూడా ఇది చాలా సహాయపడుతుంది. ఫలితంగా మెరిసే, ఆరోగ్యకరమైన చర్మం ఏర్పడుతుంది. రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది: బొప్పాయిలో ఉండే ఫైబర్ బ్లడ్ షుగర్ నియంత్రణలో సహాయపడుతుంది . ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది, ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడంలో చాలా సహాయపడుతుంది. కడుపు నిండుగా ఉంటుంది: బొప్పాయిలో ఫైబర్ ఉంటుంది. ఇది చాలా కాలం పాటు కడుపు నిండుగా ఉంచుతుంది. దీని కారణంగా, అతిగా తినాలనే కోరిక ఉండదు. బరువు పెరగడం లేదా ఉబ్బరం వంటి సమస్యలను నివారించడంలో కూడా ఇది సహాయపడుతుంది.

## మారేడు దళం.. సర్వ రోగాలకు దివ్యౌషధం..! ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఇలా తింటే ప్రయోజనాలు అమోఘం..

బిల్వ పత్రం.. మారేడు దళం.. ఆ మహా శివుడికి అత్యంత ప్రీతికరమైనది. పరమ శివుడిని ప్రసన్నం చేసుకోవాలంటే..చెంబు నీళ్లు, ఒక్క మారేడు దళం సమర్పిస్తే చాలని భక్తుల విశ్వాసం. ఎటువంటి ఆడంబరాలు లేకపోయినా బిల్వదళం అర్పిస్తే ఆ పరమేశ్వరుడు సంతోషిస్తాడని అంటారు. అయితే ఈ మారేడు దళం కేవలం పూజకు మాత్రమే కాదు.. ఆరోగ్యానికి కూడా చాలామంచిదని ఆయుర్వేద నిపుణుల చెబుతున్నారు. మారేడులో విటమిన్లు ఎ, బి1, బి2, సి, ఖనిజాలు, కాల్షియం, పొటాషియం, ఇనుముతో కూడిన అనేక పోషకాలున్నాయి. ముఖ్యంగా వేసవికాలంలో ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో మారేడు ఆకులు తింటే బోలెడు ఆరోగ్యప్రయోజనాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులోని ఔషధ గుణాలు, ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. మారేడు ఆకులు.. ఆరోగ్య పరంగా ఎంతో మేలు చేస్తుంది. దీనిని తినడం వల్ల గుండె జబ్బులు, కాలేయ సంబంధిత వ్యాధులు తగ్గుతాయి. ఖాళీ కడుపుతో బెల్‌పత్రి తింటే ఎన్నో ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో మారేడు ఆకులను తీసుకుంటే, అందులో ఉండే యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మారేడు ఆకులలో ధమనులు గట్టిపడకుండా నిరోధించే గుణం వుంది. ఇవి గుండెను వ్యాధుల నుండి రక్షిస్తాయి. బిల్వ పత్రంలో పొటాషియం సమృద్ధిగా ఉండటం వల్ల రక్తపోటుతో బాధపడేవారికి మేలు చేస్తుంది. బిల్వపత్రంలో ఉండే ఐరన్ రక్తంలో ఎర్ర రక్త కణాలు, హిమోగ్లోబిన్ కౌంట్‌ను పెంచుతుంది. బిల్వ పత్రంలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండటం వల్ల ఇది శరీరానికి తగినంత శక్తిని అందిస్తుంది. మారేడుతో అధిక కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. తరచూ మీకు నోటిపూతతో ఇబ్బంది పడేవారు ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో బెల్ పత్రి తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. దీని కోసం మీరు నాలుగు మారేడు ఆకులు తీసుకుని పచ్చిగానే నమిలి తినవచ్చు. అంతేకాదు..మధుమేహం బాధితులకు సైతం ఇది మందుగా పనిచేస్తుంది. బిల్వ పత్రం అతిసార, మొలలు, చక్కెర వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు చేస్తుంది. డయాబెటిక్ పేషెంట్ ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో బెల్‌పత్రిని తీసుకోవచ్చు. ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ ఆకులు తినటం వల్ల గ్యాస్, అసిడిటీ, అజీర్ణం నుండి ఉపశమనం లభిస్తుంది. మారేడులో ఉండే కాల్షియం దంతాలు, ఎముకలను బలోపేతం చేయడానికి, బోలు ఎముకల వ్యాధిని నివారిస్తుంది. జ్వరం, జలుబు, దగ్గు మరియు అలెర్జీలతో బాధపడేవారికి బెల్పత్రి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. వేసవిలో ఉదయాన్నే పరగడుపున ఈ పచ్చి ఆకును తింటే ఈ ప్రయోజనాలు పొందుతారు. మలబద్ధకం లేదా ఉదయం సరిగ్గా కడుపుని ఖాళీ చేయని సందర్భాల్లో తక్షణ ఉపశమనం పొందడంలో మారేడు ఆకులు చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఇది మీ పొట్టను శుభ్రపరచడమే కాకుండా మీ చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. బెల్ పత్రిని ఎలా తీసుకోవాలి? కొన్ని ఆకులను తీసుకుని నీటితో శుభ్రం చేసి వాటిని అలాగే నమిలి తినేయండి. లేదంటే మారేడు ఆకులో కాస్త నల్ల ఉప్పు వేసి కొద్దిగా వేడి చేసి తినవచ్చు. బేల్‌పత్రిని ఒక గ్లాసు నీటిలో మరిగించి దాని కషాయాన్ని కూడా సేవిస్తారు.



## మీరు మర్చిపోయి కూడా లెమన్ వాటర్ తాగకండి..! అది మీ ఆరోగ్యానికి మేలు కంటే హాని చేస్తుంది!



లెమన్ వాటర్ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. దాని ఆరోగ్య ప్రయోజనాల కారణంగా మనలో చాలా మంది ఉదయం నిద్ర లేవగానే ఒక గ్లాస్ లెమన్ వాటర్ తాగడం అలవాటుగా చేసుకున్నారు. ఇది శరీరాన్ని డిటాక్సిఫై చేసి బరువు తగ్గడంలో సహాయపడుతుంది. నిమ్మకాయ నీటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. అయితే నిమ్మరసం తాగడం వల్ల కొంతమందికి హాని కలుగుతుందని మీకు తెలుసా? అవును, లెమన్ వాటర్ ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో అనేక సమస్యలు వస్తాయి ..కాబట్టి..ఎలాంటి వ్యక్తులు నిమ్మరసం తాగకూడదో ఇక్కడ తెలుసుకుందాం.. ఎసిడిటీ సమస్య ఉన్నవారు.. ఎసిడిటీ సమస్యలతో బాధపడేవారు లెమన్ వాటర్ ఎక్కువగా తీసుకోవడం మానుకోవాలి. వాస్తవానికి, ఇది పెద్ద మొత్తంలో సిట్రిక్ యాసిడ్ ను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో ఆమ్లతను మరింత పెంచుతుంది. దీని కారణంగా మీరు ఇతర కడుపు సంబంధిత సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. దంత సమస్యలు ఉన్నవారు .. దంత సమస్యలు ఉన్నవారు లెమన్ వాటర్ తాగడం మానుకోవాలి. నిమ్మకాయల్లో ఉండే యాసిడ్ పంటి ఎనామిల్‌ను దెబ్బతీస్తుంది. ఇది దంతాలలో సున్నితత్వ సమస్యలను కలిగిస్తుంది. మీకు దంత సమస్యలు ఉంటే, దానిని తీసుకునే ముందు మీ దంతవైద్యుడిని సంప్రదించండి. ఎముక సంబంధిత సమస్యలు ఉన్నవారు .. ఎముక సంబంధిత సమస్యలతో బాధపడేవారు నిమ్మరసం తాగకూడదు. నిమ్మరసం ఎక్కువగా తాగడం వల్ల మీ ఎముకలు దెబ్బతింటాయి. వాస్తవానికి, ఇందులోని యాసిడ్ కారణంగా, ఎముకలలో కాల్షియం తీవ్రమైన కోతను అనుభవిస్తుంది. ఇది మూత్రం ద్వారా విసర్జించబడుతుంది. దీని కారణంగా ఎముకలు బలహీనపడటం ప్రారంభిస్తాయి. లోపల నుండి బోలుగా మారతాయి. ఇది బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. కిడ్నీ సమస్యలు ఉన్నవారు.. కిడ్నీ వ్యాధితో బాధపడేవారు నిమ్మరసం తాగకూడదు. ఇది మూత్రపిండాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది అనేక ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధితో బాధపడేవారు దీనిని పొరపాటున కూడా తీసుకోరాదు. హార్ట్ బర్న్ సమస్య.. హార్ట్ బర్న్ సమస్యతో బాధపడేవారు నిమ్మరసం తాగడం మానుకోవాలి. వాస్తవానికి, ఇది పెప్సిన్ అనే ఎంజైమ్‌ను సక్రియం చేస్తుంది. అంతే కాకుండా దీన్ని రోజూ తీసుకోవడం వల్ల పెప్టిక్ అల్సర్ సమస్య పెరుగుతుంది.

## ఈ వ్యాధులను తరిమికొట్టే సీతాఫలం.. ఆకులు కూడా అమృతమే!



సీతాఫలాన్ని ఆంగ్లంలో “కస్టర్డ్ యాపిల్” అంటారు . ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న భారత ఉపఖండంలో ప్రసిద్ధి చెందిన పండు. సీతాఫలం మాత్రమే కాదు, దాని ఆకులు కూడా చాలా ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. దీని ఆకులను ముఖ్యంగా ఆయుర్వేదంలో చాలా ఉపయోగకరంగా భావిస్తారు. ఎందుకంటే ఇది అనేక ఆరోగ్య సమస్యలను నయం చేస్తుంది. మీరు సీతాఫలం ఆకులను జ్యూస్, డికాక్షన్ లేదా టీ రూపంలో తీసుకోవచ్చు. ఇది శరీరానికి అనేక పోషకాలను అందిస్తుంది. మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. సీతాఫలం ఆకులు మన ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయో తెలుసుకుందాం. సీతాఫలం ఆరోగ్య ప్రయోజనాలు: సీతాఫలం ఆకుల్లో ఎన్నో పోషకాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ సి, ఐరన్, ఫైబర్, కాల్షియం కూడా ఉన్నాయి. ఇందులో చాలా యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి, శరీరాన్ని అనేక వ్యాధుల నుండి దూరంగా ఉంచడంలో సహాయపడతాయి. శరీరంలో వాపు, నొప్పి నుండి ఉపశమనాన్ని అందించే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. డయేరియా సమస్య నుండి ఉపశమనం: సీతాఫలం ఆకులను తీసుకోవడం వల్ల అనేక పొట్ట సంబంధిత సమస్యలు నయమవుతాయి. సీతాఫలంలో టానిన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది అతిసారాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే ఈ ఆకులో ఉండే పీచు అజీర్ణ సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. గ్యాస్ ఎసిడిటీ వంటి సమస్యలను తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. అధిక రక్తపోటు సమస్య నుండి ఉపశమనం: సీతాఫలం ఆకుల్లో పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇది అధిక రక్తపోటు సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. అలాగే సీతాఫలం ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి పెరుగుతుంది. చర్మానికి మేలు చేస్తుంది: సీతాఫలం ఆకులు చర్మ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. ఇందులోని విటమిన్ సి చర్మానికి పూర్తి పోషణను అందిస్తుంది. అలాగే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చర్మానికి పోషణను అందిస్తాయి. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు దద్దుర్లు, మొటిమల వంటి చర్మ సమస్యల నుండి ఉపశమనం పొందుతాయి. క్యాన్సర్ నుండి రక్షిస్తుంది: సీతాఫలం ఆకుల్లో క్యాన్సర్ నిరోధక శక్తి ఉందని చాలా అధ్యయనాలు కనుగొన్నాయి. సీతాఫలంలో ఉండే ఫైటోకెమికల్స్ యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాల వల్ల క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. ఇందులో ఉండే విటమిన్ సి మరియు విటమిన్ ఎ పోషకాలు క్యాన్సర్ కణాలను నాశనం చేయడంలో సహాయపడతాయి.

## పుట్టగొడుగులు తింటే యూరిక్ యాసిడ్ పెరుగుతుందా? ఎలాంటి కూరగాయలు తీసుకోవాలి?

ఎలివేటెడ్ యూరిక్ యాసిడ్ ఈ రోజుల్లో సాధారణ సమస్యలలో ఒకటిగా మారుతోంది. ఇది జీవక్రియ రుగ్మత, దీనిలో శరీరం ప్యూరిన్‌లను జీర్ణించుకోలేకపోతుంది. అవి ఎముకలలో పేరుకుపోవడం ప్రారంభిస్తాయి. ఇది చేతులు, కాళ్లు, మణికట్టు చుట్టూ పేరుకుపోతుంది. తరువాత గౌట్ సమస్యలను కలిగిస్తుంది. ఇలా శరీరంలో ప్యూరిన్స్ పెరగడం వల్ల ఎముకల్లో ఖాళీలు ఏర్పడి వాపులు వస్తాయి. దీంతో కీళ్లలో దృఢత్వం, నొప్పి వస్తుంది. అటువంటి పరిస్థితుల్లో ప్యూరిన్ పెంచే ఆహారాలకు దూరంగా ఉండాలి. ఇంతకీ మష్రూమ్ తినడం వల్ల యూరిక్ యాసిడ్ పెరుగుతుందో లేదో తెలుసుకుందాం? పుట్టగొడుగులలో యూరిక్ యాసిడ్ పెంచడానికి పని చేసే ప్రోటీన్లు మంచి మొత్తంలో ఉంటాయి. ఇది మీ ఎముకలలో పెరగడం మొదలవుతుంది. వాపు పెరుగుతుంది. నిజానికి, మీరు పుట్టగొడుగులను తిన్నప్పుడు శరీరం వాటిని జీర్ణం చేస్తుంది. ప్యూరిన్లను విసర్జిస్తుంది. ఈ ప్యూరిన్ ఎముకలో పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. అడపాదడపా నొప్పిని కలిగించే సమస్యను సృష్టిస్తుంది. మీరు ప్రోటీన్ అధికంగా ఉండే ఇతర ఆహారాలను తిన్నప్పుడు ఈ నొప్పి తీవ్రమవుతుంది. అందుకే యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటే లేదా మీకు గౌట్ సమస్య ఉంటే పుట్టగొడుగుల వినియోగాన్ని నివారించండి. మీ యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటే, మీరు పుట్టగొడుగులకు బదులుగా అధిక ఫైబర్ ఫుడ్స్ తినవచ్చు. వోట్స్, గంజి, నారింజ వంటి పండ్లు వంటివి. ఇది కాకుండా మీరు ఈ సమస్యలో చాలా ఉపయోగకరంగా ఉండే మొలకెత్తిన ధాన్యాలను కూడా తీసుకోవచ్చు. ఈ పరిస్థితులన్నింటిలో మీరు పుట్టగొడుగులకు బదులుగా ఈ ఆహారాన్ని తినాలి. ఇది కాకుండా మీరు ఆకుకూరలు, పసుపు వంటి వాటిని తీసుకోవాలి. ఇది కాకుండా మీరు చియా గింజలను తినవచ్చు. గోరువెచ్చని నీరు తాగవచ్చు. ఈ పదార్థాలు యూరిక్ యాసిడ్ తగ్గించడంలో కూడా సహాయపడతాయి.


# స్పోర్ట్స్

# వన్డేలు, టీ20ల్లోనూ 'గులాబీ బంతి'..

## డ్రింక్స్ బ్రేక్‌లో హెడ్‌కోచ్‌కు అనుమతి..!

మారుతున్న పరిస్థితులకు తగ్గట్టు అంతర్జాతీయ క్రికెట్‌లో సమూల మార్పులకు ఐసీసీ (×జజ) శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే వరల్డ్‌కప్ వంటి మెగా టోర్నీల్లో మహిళా క్రికెటర్లకు పురుషులతో సమానంగా నగదు బహుమతిని అమలు చేస్తున్న ఐసీసీ ఈసారి బంతిపై దృష్టి సారించనుంది. ప్రస్తుతం టెస్టులకే పరిమితమైన పింక్ బాల్‌ను ఇక నుంచి వన్డే, టీ20ల్లోనూ ప్రవేశపెట్టేందుకు అత్యున్నత క్రికెట్ మండలి పావులు కదుపుతోంది. అన్నీ కుదరితే అహ్మదాబాద్‌లో జరగనున్న ఐసీసీ సమావేశంలో నిర్ణయం వెలువడే అవకాశముంది. పొట్టి క్రికెట్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతున్న ఈ రోజుల్లో టెస్టులు, వన్డేలను మరింత ఆసక్తిగా మార్చేందుకు ఐసీసీ ప్రయత్నిస్తోంది. ఇదివరకే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(బొజ)తో సుదీర్ఘ ఫార్మాట్‌కు జీవం పోసిన ఐసీసీ ఈసారి(డ్రింక్స్ బ్రేకులోనూ హెడ్‌కోచ్‌ను అనుమతించాలనే ఉద్దేశంతో ఉంది. అలానే వన్డే, టీ20ల్లోనూ గులాబీ బంతికి ఓకే చెప్పడం, పొట్టి క్రికెట్‌లో ఇన్నింగ్స్ విరామం సమయాన్ని కుదించడం, ఆన్‌ఫీల్డ్ అంపైర్లకు హ్యాక్ ఐ డేటాను పరిశీలించే అవకాశమివ్వడం వంటి వాటిపై ఐసీసీ దృష్టి సారిస్తోంది. బౌలర్లు బా అహ్మదాబాద్ వేదికగా మే 30న జై షా(జీుఱ ూaష్టుష్ట్ర) నేతృత్వంలోని ఐసీసీ ప్రతినిధుల సమావేశంలో వీటిపై తీర్మానాలు చేసి.. ఆమోద ముద్ర వేసే అవకాశముంది.





పరిస్థితులను బట్టి.. టెస్టు క్రికెట్ ఆరంభం నుంచి ఎర్ర బంతినే ఉపయోగించేవారు. కానీ, ఈమధ్య గులాబీ బంతి టెస్టు మ్యాచులు చూశాం. ఐదు లేదా మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రత్యేక ఆకర్షణగా డే నైట్‌లో పింక్ బాల్ టెస్టు ఆడిస్తున్నారు. వన్డేలు, టీ20ల్లో ఎప్పటి నుంచో తెల్ల బంతినే వాడుతున్నారు. ఇకపై పరిస్థితులను బట్టి వన్డే, టీ20ల్లోనూ పింక్ బాల్ మ్యాచ్‌లకు ఐసీసీ అనుమతించనుంది. ఇరుజట్లు అంగీకరిస్తే డే నైట్ మ్యాచుల్లో గులాబీ బంతిని వాడేందుకు అనుకూలంగా నిబంధనలను మార్చనుంది. ఇన్నింగ్స్ బ్రేక్ కుదింపు.. టీ20ల్లో ఇన్నింగ్స్ బ్రేక్‌ను కుదించడంపై ఐసీసీ సభ్యులు ఆలోచిస్తున్నారు. ప్రస్తుతం తొలుత ఆడిన జట్టు ఇన్నింగ్స్ ముగిశాక 20 నిమిషాలకు రెండో జట్టు ఇన్నింగ్స్ మొదలవుతుంది. ఈ సమయాన్ని 15 నిమిషాలకు మార్చాలని ఐసీసీ బృందం భావిస్తోంది. ఇన్నింగ్స్ ముగిశాక ఆటగాళ్లు కలిసి.. చర్చించుకునేందుకు ఐదు నిమిషాలు పడుతుంది. మరో పది నిమిషాల తర్వాత వారు మైదానంలోకి దిగేలా నిబంధనలు మార్చాలని ఐసీసీ ప్రతినిధులు అనుకుంటున్నారు. డ్రింక్స్ బ్రేక్‌లో.. ప్రస్తుతం టీ20ల్లో మాత్రమే డ్రింక్స్ బ్రేకులో హెడ్‌కోచ్‌లను మైదానంలోకి అనుమతిస్తున్నారు. వన్డేలు, టెస్టుల్లో మాత్రం స్క్వాడ్‌లోని ఆటగాళ్లకు మాత్రమే డ్రింక్స్‌ను గ్రౌండ్‌లోకి తీసుకువస్తుంటారు. కానీ, ఇకపై ఈ రెండు ఫార్మాట్లలోనూ ఇన్నింగ్స్ మధ్యలో కోచ్‌లను మైదానంలోకి అనుమతివ్వాలని ఐసీసీ భావిస్తోంది. అయితే.. డ్రింక్స్ తెచ్చే ఆటగాళ్లు క్రికెట్ జెర్సీ వేసుకోవాలి. ఇప్పుడు కోచ్‌లకు కూడా అదే నియమం వరిస్తుందా? అనేది తెలియాల్సి ఉంది. అలానే.. ఆన్‌ఫీల్డ్ అంపైర్లకు హ్యాక్ ఐ డేటాను పరిశీలించే అవకాశమివ్వాలని ఐసీసీ అనకుంటోంది. తద్వారా మైదానంలో బౌలర్లు ఎలాంటి అనైతికమైన పనులకు పాల్పడకుండా చూడాలని భావిస్తోంది.

# విజయ్ శంకర్ రిటైర్మెంట్ ప్రకటన

భారత ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ దేశీయ క్రికెట్‌తో పాటు ఇండియన్ ప్రీమియర్ లీగ్ కు కూడా వీడ్కోలు పలికాడు. శుక్రవారం సోషల్ మీడియా ద్వారా తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించిన ఈ తమిళనాడు క్రికెటర్, "కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడం, మరింత క్రికెట్ ఆడడం" కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. 35 ఏళ్ల విజయ్ శంకర్ ఇటీవల 2025-26 సీజన్‌కు ముందు త్రిపుర జట్టులో చేరిన సంగతి తెలిసిందే. భారత జట్టుకు 2018-2019 మధ్య ప్రాతినిధ్యం వహించిన అతను 12 వన్డేలు, 9 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా, పార్ట్‌టైమ్ సీమర్‌గా జట్టుకు సేవలందించాడు. క్రికెట్ నా జీవితం".. భావోద్వేగ పోస్టు రిటైర్మెంట్ ప్రకటిస్తూ చేసిన పోస్టులో విజయ్ శంకర్ భావోద్వేగానికి లోనయ్యాడు. "క్రికెట్ నా జీవితం. 10 ఏళ్ల వయసులో ఆట ప్రారంభించాను. 25 ఏళ్ల ప్రయాణంలో ప్రతి స్థాయిలో ఆడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో అత్యంత గర్వకారణం," అని పేర్కొన్నాడు. అలాగే బీసీసీఐ, భారత జట్టు, కోచ్‌లు, సహచర ఆటగాళ్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. నాగ్‌పూర్‌లో జరిగిన భారత్ 500వ వన్డేలో చివరి ఓవర్ బౌలింగ్ చేయడం, 2019 ప్రపంచకప్‌లో తొలి బంతికే వికెట్ తీయడం వంటి క్షణాలు ఎప్పటికీ మరిచిపోలేనివని గుర్తుచేసుకున్నాడు. 2019 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టులో చోటు దక్కించుకున్న విజయ్ శంకర్, వెస్టిండీస్‌తో మాంచెస్టర్‌లో జరిగిన మ్యాచ్ తర్వాత గాయంతో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. కాలి వేలి గాయం కారణంగా ప్రపంచకప్ మధ్యలోనే వైదొలగడం అతని అంతర్జాతీయ కెరీర్‌కు పెద్ద దెబ్బగా మారింది. ఆ తర్వాత భారత జట్టులో స్థానం కోల్పోయిన విజయ్ శంకర్ మళ్లీ జాతీయ జట్టులోకి రాలేకపోయాడు. అయినప్పటికీ దేశీయ క్రికెట్, ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో తన ప్రయాణాన్ని కొనసాగించాడు. కుడిచేతి వాటం బ్యాటర్, కుడిచేతి సీమర్ అయిన విజయ్ శంకర్ 2012లో ప్రొఫెషనల్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. తన కెరీర్‌లో మొత్తం 77 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు, 112 లిస్ట్-ూ మ్యాచ్‌లు, 159 టీ20లు ఆడాడు. అంతర్జాతీయ స్థాయిలో ఎక్కువ కాలం కొనసాగకపోయినా, దేశీయ క్రికెట్‌లో స్థిరమైన ఆల్‌రౌండర్‌గా గుర్తింపు సంపాదించాడు. ముఖ్యంగా తమిళనాడు క్రికెట్‌లో అతని సేవలు ప్రత్యేకంగా నిలిచాయి. వీడ్కోలు పలికిన విజయ్ శంకర్ ఇకపై కొత్త అవకాశాల వైపు అడుగులు వేయనున్నాడు. కోచింగ్, ఫ్రాంచైజీ క్రికెట్ లేదా విదేశీ లీగ్‌లలో అతను కనిపించే అవకాశాలు ఉన్నాయని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.



# లేడీ ఫ్యాన్‌కు 'సారీ' చెప్పిన రోహిత్ శర్మ

రోహిత్ శర్మ అంటే అభిమానులకు ఎప్పుడూ ప్రత్యేకమే. అలాగే అభిమానులంటే కూడా రోహిత్?కు స్పెషలే. మరోసారి దీనిని హిట్?మ్యాన్ నిరూపించుకున్నాడు. ఇంతటీ బడా స్టార్ క్రికెటర్ అయినప్పటికీ, తాజాగా ఓ లేడీ ఫ్యాన్?కు రోహిత్ 'సారీ'? చెప్పాడు. తనను కలవలేకపోయానని ఏడుస్తూ బాధపడుతున్న ఓ యువతి కోసం రోహిత్ వీడియో సందేశం పంపించాడు. మళ్లీ కోల్?కతాకు వచ్చినప్పుడు ఆ అమ్మాయిని తప్పకుండా కలుస్తానంటూ వీడియోలో చెప్పుకొచ్చాడు. దీంతో ఆ అమ్మాయి ఆనంధానికి అవుధుల్లేకుండా పోయాయి!కోల్?కాతా ఈడెన్ గార్డెన్స్?? వేదికగా ముంబయి రీసెంట్?గా కేకేఆర్?తో మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్ సందర్భంగా రోహిత్?ను కలవాలని ఓ లేడీ ఫ్యాన్ స్టేడియానికి వెళ్లింది. హిట్?మ్యాన్?ను కలిసేందుకు కొన్ని గంటల నుంచి వెయిట్ చేస్తున్నానని, అతడని కలవడమే తన డ్రీమ్ అని చెప్పింది. అయితే డ్రెస్సింగ్ రూమ్ నుంచి ప్లేయర్లు ఒక్కొక్కరు వస్తుండగా రోహిత్ కోసం ఆత్రుతగా ఎదురుచూసింది. అతడు రాగానే 'రోహిత్ భాయ్', 'రోహిత్ భాయ్' అంటూ గట్టిగా అరిచింది. అయితే క్రౌడ్ శబ్దం వల్ల రోహిత్ ఆమెను పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. అంతే ఒక్కసారిగా ఆ యువతి ఏడ్చేశింది. ఈ మొత్తం సన్నివేశాన్ని పక్కనే ఉన్న ఆమె బంధువు వీడియో రికార్డ్ చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో రోహిత్? దాకా చేరింది. అయితే తనను కలవలేకపోయానన్న బాధతో ఆ అమ్మాయి ఏడవడం రోహిత్?ను కలచివేసినట్లుంది. దీంతో ఆమెకు సారీ చెబుతూ హిట్?మ్యాన్ ఓ వీడియో చేశాడు. 'హాయ్, జినియా! ఈడెన్ గార్డెన్స్?లో నిన్ను కలవలేకపోయినందుకు నన్ను క్షమించు. నీ వీడియో చూశాను. నాకూ బాధేసింది. అయితే క్రౌడ్ ఎక్కువగా ఉండడం వల్ల కొన్నిసార్లు ఎవరు పిలుస్తున్నారో గుర్తుపట్టడం కష్టంగా ఉంటుంది. నేనూ అలాగే మిస్ అయినట్లు ఉన్నాను. కానీ, నెక్ట్ ఈడెన్ గార్డెన్స్?కు వచ్చినప్పుడు మాత్రం నిన్ను కచ్చితంగా కలుస్తాను' అని వీడియో షేర్ చేశాడు. ఈ వీడియో ఓ అభిమాని ద్వారా సదరు యువతికి చేరింది. తన వీడియోకు రోహిత్? రెస్పాన్స్ ఇవ్వడంతో హ్యాపీగా ఫీల్ అయ్యింది. మహిళా అభిమానికి సారీ చెబుతూ రోహిత్ చేసిన వీడియో వైరల్ అయ్యింది. ఆయన రేంజ్? స్టార్ అభిమానికి సారీ చెప్పడంతో హిట్?మ్యాన్?పై ప్రశంసలు కురుస్తున్నాయి. రోహిత్ తన అభిమానులను ఎప్పుడూ నిరాశ పర్చదని, అతడి బంగారం అంటూ పోస్టులు షేర్ చేస్తున్నారు. ఇక ప్రస్తుత ఐపీఎల్? సీజన్?లో ముంబయికి ఇంకా ఒక మ్యాచే మిగిలింది. ఆదివారం (మే 24) మధ్యాహ్నం 3.30 గంటలకు రాజస్థాన్ రాయల్స్?తో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్?కు ముంబయి వాంఖడే స్టేడియం వేదిక కానుంది. ఇది ముంబయికి పెద్దగా అవసరం లేకున్నా, రాజస్థాన్?కు మాత్రం కీలకమైన మ్యాచ్. ప్లేఆఫ్స్?కు చేరుకోవాలంటే ఈ మ్యాచ్?లో తప్పక నెగ్గాల్సిందే! ప్రస్తుతం 14 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ 16 పాయింట్లతో బెర్త్ ఖరారు చేసుకుంటుంది. ఒకవేళ ఓడితే పంజాబ్ కింగ్స్, కోల్?కతా నైట్?రైడర్స్?కు ఛాన్స్ ఉంటుంది.రోహిత్ ఈ మ్యాచ్?లో బరిలో దిగనున్నాడు. ఇప్పటిదాకా 8 మ్యాచ్?లు ఆడిన హిట్?మ్యాన్ 283 పరుగులు చేశాడు. ఇందులో రెండుసార్లు 50ం స్కోర్లు నమోదు చేశాడు. ఇక ఆఖరి మ్యాచ్?లో రాజస్థాన్?పైనా భారీ ఇన్నింగ్స్?తో చెలరేగిపోవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఈ మ్యాచ్ తప్పితే మళ్లీ వచ్చే ఏడాదే రోహిత్ టీ20ల్లో కనిపిస్తాడు.



## మళ్లీ కుస్తీ పట్టనున్న వినేశ్.. ఆసియా క్రీడల ట్రయల్స్‌కు అనుమతించిన హైకోర్టు..!

భారత రెజ్లింగ్ సమాఖ్యతో పోరాడుతున్న వినేశ్ ఫొగాట్ పునరాగమనానికి అడ్డంకులు తొలగిపోయాయి. ఆసియా క్రీడల ఎంపిక పోటీల్లో ఆమె పాల్గొనేందుకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. తల్లైన రెజర్ల విషయంలో డబ్ల్యూఎఫ్ఐ నిబంధనలు అనుచితంగా ఉన్నాయని పేర్కొన్న ధర్మాసనం వినేశ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ తీర్పునిచ్చింది. దాంతో.. ఆమెను అడుగడుగునా అడ్డుకోవాలని చూసిన బ్రిజ్ భూషణ్ గ్యాంగ్‌కు హైకోర్టు నిర్ణయం చెంపపెట్టు కానుంది. ఆసియా క్రీడలతో పునరాగనం చేయాలనుకున్న వినేశ్ ఫొగాట్ కల నిజమవ్వనుంది. భారత రెజ్లింగ్ సమాఖ్య నిబంధనలపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన వినేశ్‌కు అనుమతి లభించింది. ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాలతో కూడిన ద్విసభ్య బెంచ్.. వినేశ్‌ను ఆసియా క్రీడల ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతించింది. ఎంపిక ప్రక్రియను వీడియో రికార్డు చేయాలని రెజ్లింగ్ సమాఖ్యను కోర్టు ఆదేశించింది. భారత స్పోర్ట్స్ అథారిటీ, భారత ఒలంపిక్ సంఘానికి చెందిన స్వతంత్ర ప్రతినిధులు ట్రయల్స్‌ను పర్యవేక్షించనున్నారు. మే 30 నుంచి 31 తేదీల్లో ట్రయల్స్ జరుగనున్నాయి.

# గైక్వాడ్ పై భారీ జరిమానా

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రయాణం చేదు జ్ఞాపకంతో ముగిసింది. గురువారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్ లో శుభ్‌మన్ గిల్ టీమ్ చేతిలో 89 పరుగుల తేడాతో ఓడిపోయిన సీఎస్‌కే, ప్లేఆఫ్స్ రేసు నుండి అధికారికంగా నిష్క్రమించింది. ఈ ఘోర పరాజయం తర్వాత చెన్నై జట్టుకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మరో షాక్ ఇచ్చింది. మ్యాచ్ లో నిర్ణీత సమయానికి ఓవర్ల కోటాను పూర్తి చేయనందుకు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు రూ. 24 లక్షల భారీ జరిమానా విధించింది. ఈ సీజన్ లో చెన్నై జట్టుకు ఇది రెండో తప్పు కావడంతో కెప్టెన్‌తో పాటు ప్లేయింగ్ ఎలెవన్ లోని మిగతా ఆటగాళ్లందరిపైనా పెనాల్టీ పడింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన మ్యాచ్ 66 లో ఐపీఎల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌లోని ఆర్టికల్ 2.22 ప్రకారం కనీస ఓవర్ రేట్ నిబంధనను సీఎస్‌కే ఉల్లంఘించింది. అంతకుముందు లీగ్ లోని 18వ మ్యాచ్ లో కూడా ఈ టీమ్ ఇదే తప్పు చేసింది. రెండోసారి నిబంధనలు అతిక్రమించినందుకు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు రూ. 24 లక్షల ఫైన్ విధించగా, మ్యాచ్ ఆడిన మిగిలిన టీమ్ మెంబర్స్ అందరికీ, ఇంపాక్ట్ ప్లేయర్‌తో సహా ఒక్కొక్కరికి రూ. 6 లక్షలు లేదా వారి మ్యాచ్ ఫీజులో 25 శాతం (ఏది తక్కువైతే అది) జరిమానాగా ప్రకటించారు. ఈ మేరకు ఐపీఎల్ యాజమాన్యం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్ నిర్దేశించిన 230 పరుగుల భారీ టార్గెట్‌ను ఛేజ్ చేసే క్రమంలో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్ లైనప్ పూర్తిగా విఫలమైంది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ పరుగులేమీ చేయకుండా గోల్డెన్ డక్‌గా అవుట్ కావడంతో జట్టు భారీ దెబ్బతింది. మిడిలార్డర్ బ్యాటర్ శివమ్ దూబే కేవలం 17 బంతుల్లో 47 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడి కాసేపు ఆశలు రేకెత్తించినా, మిగతా ప్లేయర్స్ నుండి సపోర్ట్ లభించలేదు. దీంతో చెన్నై ఘోర పరాజయాన్ని చవిచూసి టోర్నమెంట్ నుండి అవుట్ అయింది. ఈ పరాజయంతో చెన్నై సూపర్ కింగ్స్ ఈ ఏడాది లీగ్ నుండి నిష్క్రమించింది. లెజెండరీ ప్లేయర్ ఎంఎస్ ధోనీ భవిష్యత్తుపై ఇంకా స్పష్టత రాని తరుణంలో, చాలా మంది కీలక ఆటగాళ్లు తమ ఫామ్‌ను నిరూపించుకోవడంలో ఘోరంగా విఫలమయ్యారు. ఈ ఓటమి, ప్లేఆఫ్స్ రేసు నుండి తప్పుకోవడం వంటి పరిణామాల నేపథ్యంలో వచ్చే ఐపీఎల్ సీజన్ నాటికి చెన్నై టీమ్ మేనేజ్‌మెంట్ జట్టులో భారీ మార్పులు చేసే అవకాశం కనిపిస్తోంది. కొత్త బ్లూప్రింట్ తో జట్టును రీబిల్డ్ చేయడానికి సీఎస్‌కే యాజమాన్యం కసరత్తులు ప్రారంభించనుంది.

# సన్ రైజర్స్ ఐపీఎల్ టైటిల్ సాధించేనా?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ఆఖరి అంకానికి చేరుకుంది. ఆదివారం జరిగే డబుల్ హెడర్ పోరుతో లీగ్ దశ ముగియనుంది. ప్రస్తుతం మరో మూడు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. శనివారం పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌లు తలపడతాయి. ఇక ఆదివారం జరిగే డబుల్ హెడర్‌లో కేకేఆర్‌తో ఢిల్లీ క్యాపిటల్స్.. రాజస్తాన్ రాయల్స్‌తో ముంబై ఇండియన్స్ జట్లు తలపడతాయి. ఇప్పటికే ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లు ప్లే ఆఫ్స్ చేరుకున్నాయి. ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ జట్లు టాప్ 2లో నిలిచాయి. ఇక ఆర్సీబీపై తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో నెగ్గినా మెరుగైన నెట్ రన్ రేట్ లేకపోవడంతో సన్ రైజర్స్ హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. టాప్ 2లో నిలిచిన జట్లకు ఫైనల్ చేరేందుకు రెండు అవకాశాలు ఉంటాయి. ఇక 3, 4వ స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ చేరాలంటే వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గాల్సిందే. అయితే ఇలాంటి స్థితిలో నిలవడం సన్ రైజర్స్ హైదరాబాద్‌కు ఇదేం తొలిసారి కాదు. 2016లో కూడా ఇలాంటి పరిస్థితినే సన్ రైజర్స్ హైదరాబాద్ ఎదుర్కొంది. 2016 ఐపీఎల్‌లో గుజరాత్ లయన్స్.. ఆర్సీబీ జట్లు వరుసగా టాప్ 2లో నిలిచాయి. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ మూడు.. కేకేఆర్ 4వ స్థానంలో నిలిచాయి. క్వాలిఫయర్ 1లో గుజరాత్ లయన్స్‌పై ఆర్సీబీ నెగ్గి ఫైనల్ చేరగా.. కేకేఆర్ ను ఓడించిన సన్ రైజర్స్ హైదరాబాద్ క్వాలిఫయర్ 2కు అర్హత సాధించింది. అనంతరం క్వాలిఫయర్ 2లో గుజరాత్ లయన్స్‌పై నెగ్గింది. అనంతరం ఫైనల్లో ఆర్సీబీని ఓడించి టైటిల్ సాధించింది. ఆ సమయంలో సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా ప్లేయర్ డేవిడ్ వార్నర్ ఉన్నాడు. ఈసారి కూడా ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఉన్నాడు. 2016లో మాదిరే ఈసారి కూడా ఆర్సీబీ, గుజరాత్, సన్ రైజర్స్ జట్లు ప్లే ఆఫ్స్‌కు చేరాయి. కేకేఆర్ రేసులో ఉంది. కేకేఆర్ కూడా ప్లే ఆఫ్స్‌కు చేరితే అచ్చం 2016 సీజన్‌లానే ఉంటుంది. 2016 సెంటిమెంట్ వర్కౌట్ అయితే ప్యాట్ కమిన్స్ నేతృత్వంలోని సన్ రైజర్స్ హైదరాబాద్ కప్పు నెగ్గడం ఖాయం. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ మే 27న జరిగే ఎలిమినేటర్ పోరులో తలపడనుంది. అయితే ప్రత్యర్థి ఇంకా డిసైడ్ కాలేదు. ప్రస్తుతం సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టులో బ్యాటర్లు సూపర్ ఫామ్‌లో ఉన్నారు. అభిషేక్ శర్మ, క్లాసెన్, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డిలు సూపర్ టచ్‌లో ఉన్నారు. ఇక బౌలింగ్ కూడా మెరుగైంది. ప్యాట్ కమిన్స్, సకీబ్ హుస్సేన్, ఈషాన్ మలింగలు లయలో ఉన్నారు. వీరు క్వాలిఫయర్స్‌లో కూడా రాణిస్తే సన్ రైజర్స్ హైదరాబాద్ ఫైనల్ చేరడం ఖాయం. ఆర్సీబీతో మరోసారి పోరు జరిగితే మాత్రం అభిమానులు పండగ చేసుకోవడం ఖాయం. మే 31న అహ్మదాబాద్ వేదికగా జరిగే ఫైనల్ జరగనుంది.



# విశ్వజ



## నానబెట్టిన బాదం తింటే ఈ సమస్యలకు మంచి రిలీఫ్..!!

బాదం ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది. బాదంలో ఉండే పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. శక్తిని అందిస్తాయి. చెడు కొలెస్ట్రాల్ ను నిరోధిస్తుంది. బాదంలో అనేక రకాలైన విటమిన్లు లభ్యం అవుతాయి. నానబెట్టిన బాదం తినటం ద్వారా మధుమేహం నియంత్రణతో పాటుగా రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ఫలితంగా దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం కలుగుతుంది. అయితే, బాదం పరిమితంగానే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బాదం ఆరోగ్య పరంగా మేలు చేస్తుంది. బాదం ఎప్పుడూ నానబెట్టిన తర్వాత, ఖాళీ కడుపుతో తినాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో నోటి లోపల చాలా ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా ఉంటుంది. ఇది బాదంను జీర్ణం చేయడంలో, ప్రయోజనాన్ని పొందడంలో సహాయపడుతుంది. ఒక రోజులో 20 నుండి 30 గ్రాముల బాదం గింజలను తినవచ్చునని చెబుతున్నారు. బాదం పప్పు తినడం వల్ల ఫైబర్, ప్రోటీన్, విటమిన్ ఆరోగ్యకరమైన కొవ్వు, మెగ్నీషియం, మాంగనీస్, విటమిన్ 2, భాస్వరం, రాగి లభిస్తాయి. ఇవి మెదడు, కండరాలు, కడుపు మరియు గుండెకు ప్రయోజనకరంగా ఉంటాయి. బాదంలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. అవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి పనిచేస్తాయి. ఈ ఒత్తిడి కణాలను దెబ్బతీస్తుంది. దాదాపు అన్ని దీర్ఘకాలిక వ్యాధుల అభివృద్ధిలో పాత్ర పోషిస్తుంది. ఇది కొవ్వులో కరిగే విటమిన్, ఇది జుట్టు, చర్మం, కండరాలకు చాలా అవసరం. కణాల నిర్మాణానికి ఇది చాలా ముఖ్యమైనది. మధుమేహం నియంత్రించడానికి ఇది ఒక గొప్ప మార్గం. ఇందులో ఫైబర్ ఉంటుంది. రక్తంలో షుగర్ లెవల్స్ ఆకస్మికంగా పెరగకుండా నిరోధిస్తుంది. రక్తపోటును నియంత్రించే మెగ్నీషియం సైతం బాదంలో పుష్కలంగా ఉంటుంది. కొలెస్ట్రాల్ గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. కానీ బాదం కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. అయితే, వైద్యులు నిర్దేశించిన మొత్తంలో నాన బెట్టిన బాదం తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

## మొటిమలు మాయం

జిడ్డు చర్మం ఉన్నవారికి మొటిమలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రోజులో నాలుగైదుసార్లు చల్లటి నీటితో ముఖం శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఉదయం, సాయంత్రం రోజ్‌వాటర్‌తో ముఖం కడుక్కుంటే మొటిమల తీవ్రత తగ్గుతుంది. నూనె వంటకాలు మొటిమలకు కారణం అవుతాయి. రెగ్యులర్ డైట్‌లో నూనె శాతం తగ్గించాలి. సమతుల ఆహారం తీసుకోవాలి. నీళ్లు సమృద్ధిగా తాగాలి. రెగ్యులర్‌గా పండ్ల రసాలు తీసుకోవాలి. డిప్రెషన్‌లో ఉన్నవారికి సైతం మొటిమలు వచ్చే అవకాశం ఉందని పలు పరిశోధలు చెబుతున్నాయి. మానసికంగా సంతోషంగా ఉండాలి. సాలిసిలిక్ ఆయిల్, టీట్రీ ఆయిల్ కలిగిన ఫేస్‌వాష్‌లను ఉపయోగించడం వల్ల మొటిమలు తగ్గుముఖం పడతాయి. కలబంద జెల్‌తో కస్తూరి కలిపి ఫేస్‌ప్యాక్‌గా వేసుకున్నా మొటిమలను నియంత్రించవచ్చు.

## పెసల మొలకలతో ఇలా చేస్తే..
# రెట్టింపు శక్తి, ఎన్నో లాభాలు...!!



ప్రతిరోజు పెసలును నానబెట్టుకుని మొలకలు చేసుకుని తినడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పెసరలో మెగ్నీషియం, పొటాషియం స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. పెసర పప్పుల్లో మన శరీరానికి అవసరమైన అమైనో ఆమ్లాలు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. అంతేకాదు వీటిలో ప్రోటీయోలైటిక్ ఎంజైమ్స్ కూడా ఉంటాయి. అలసటను పోగొట్టేందుకు, మెరుగైన నిద్రకు పెసరపప్పు ఎంతగానో సహాయపడుతుంది. ఉదయం వేళ బ్రేక్ ఫాస్ట్ వేళ వీటిని తీసుకుంటే రెట్టింపు శక్తి ఇవ్వటంతో పాటుగా ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు అందుతాయి. మొలకల్లో విటమిన్‌లు, మినరల్‌లు, ఫైబర్, మరియు ప్రోటీన్‌లు అధికంగా ఉంటాయి. వీటల్లో ముఖ్యంగా విటమిన్ కాంప్లెక్స్, మరియు విటమిన్ లాంటి పోషకాలు ఎక్కువగా లభిస్తాయి. మొలకలను తినడం ద్వారా జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. మొలకలు తేలికగా జీర్ణం అయ్యే ఆహారం కావడంతో, ఇబ్బంది లేకుండా జీర్ణమవుతాయి. మొలకల్లో ఉండే ఫైబర్ జీర్ణశక్తిని పెంచి, మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. మొలకల్లో ప్రోటీన్ చాలా శాతం లభిస్తుంది, ప్రత్యేకంగా పప్పులు, శెనగలు వంటి వాటి మొలకల్లో అధికంగా ప్రోటీన్ ఉంటుంది. ఇది మాంసాహారాన్ని తగ్గించి, ప్రోటీన్ అవసరాలను తేలికగా తీర్చగలగడం వలన, ఇది శాకాహారులకు మంచి ఆహారంగా ఉపయోగపడుతుంది. మొలకలు తక్కువ క్యాలరీలు కలిగి ఉంటాయి, కానీ పోషకాలు ఎక్కువ. మొలకల్లో అధికంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. మొలకల్లో ఉండే విటమిన్ శరీరాన్ని వింత రోగాల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. ఇవి శరీరంలో ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించి, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. మొలకల్లో ఫైబర్ మరియు పుట్టుమటుకులాంటి పోషకాలు అధికంగా ఉండటంతో, ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. ఫలితంగా, హృదయ సంబంధిత వ్యాధులను నివారించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా, ఈ మొలకలు రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మరియు రక్తపోటు నియంత్రణలో సహాయపడతాయి. మొలకల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఈ కారణంగా, మొలకలు మధుమేహం ఉన్న వారికి చాలా మంచివి. వీటిని తరచుగా తీసుకోవడం ద్వారా బ్లడ్ షుగర్ లెవెల్స్ క్రమంలో ఉంటాయి. మొలకలు యాంటీ-క్యాన్సర్ లక్షణాలను కలిగి ఉంటాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

## ఏ చిన్న అనారోగ్యమైనా యాంటీ బయాటిక్స్
# వాడుతున్నారా? ఎంత డేంజర్ అంటే

యాంటీబయాటిక్స్ .. ప్రస్తుతం మన సమాజంలో యాంటీబయాటిక్స్ వినియోగం విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో యాంటీబయాటిక్స్ దుర్వినియోగం అనేక అనారోగ్య సమస్యలకు, ఆరోగ్య ప్రమాదాలకు కారణంగా మారుతుంది. సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్ కొనుగోలు చేసి, వాటిని ఉపయోగించడం వల్ల వారిలో యాంటీబయాటిక్స్ రెసిస్టెన్స్ పెరుగుతుంది.

యాంటీ బయాటిక్స్ విపరీతమైన వాడకం.. ఆరోగ్య ముప్పు


ఇక గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేని ఆర్ఎంపీ వైద్యులు చిన్న చిన్న అనారోగ్యాలకు చాలా ఎక్కువ డోసేజ్ యాంటీ బయాటిక్స్ ఇస్తున్నారు. ఇది కూడా వారిలో యాంటీ బయాటిక్స్ రెసిస్టెన్స్ కు కారణం అవుతుంది. దీనివల్ల భవిష్యత్తులో యాంటీబయాటిక్స్ ఉపయోగిస్తే పనిచేయని పరిస్థితి చోటు చేసుకుంటుంది. ప్రజల ఆరోగ్యానికి పెరుగుతున్న అతిపెద్ద ఆందోళన.

యాంటీ బయాటిక్స్ రెసిస్టెన్స్ వస్తే కష్టం

యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ అనేది బాక్టీరియా మార్పులు చెందినప్పుడు, మందుల ప్రభావాలకు ఇమ్యూన్‌గా మారినప్పుడు జరుగుతుంది. దీనివల్ల ఇతరత్రా వ్యాధులు సంక్రమించిన చికిత్స చేయడం కష్టం అవుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు తక్కువగా ఉండటం వల్ల యాంటీబయాటిక్స్ తో సొంత వైద్యం చేసుకుంటున్నారు. ప్రజలు తరచుగా డాక్టర్‌ను సంప్రదించకుండా స్థానిక దుకాణాల నుండి ఈ మందులను కొనుగోలుచేసి వాడడం కారణంగా భవిష్యత్తులో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది.

యాంటీ బయాటిక్స్ వల్ల మనకు తెలీకుండానే సైడ్ ఎఫెక్ట్స్

యాంటీ బయాటిక్స్ దుర్వినియోగం వ్యక్తులను మాత్రమే ప్రభావితం చేయదు, ఇది ప్రజా ఆరోగ్యానికి విస్తృతమైన ప్రభావాలను కలిగి ఉంటుంది. మనకు తెలియకుండానే మన





శరీరంలో వివిధ సైడ్ ఎఫెక్ట్స్ కు యాంటీబయాటిక్స్ కారణమవుతున్నాయి. అందుకే యాంటీబయాటిక్స్ ఎక్కువగా ఉపయోగించడం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల వచ్చే సమస్యలను క్లిష్టంగా మారిన తర్వాత పరిష్కరించడం కష్టమవుతుంది. అందుకే యాంటీబయాటిక్స్ వినియోగం పైన, విక్రయం పై కఠినమైన నియంత్రణలు అవసరం. వైద్యులు, రోగులకు యాంటీబయాటిక్స్ తగిన విధంగా ఉపయోగించకపోవడం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన పెంచాలి. గ్రామీణ ప్రాంతాలలో నేరుగా యాంటీబయాటిక్స్ కొనుక్కునే విధానాన్ని నియంత్రించాలి. సాధ్యమైనంతవరకు ఆరోగ్య సమస్యలను నాచురల్ గానే తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి.

# మార్కెట్

## ఐపీవోకి ఆర్ఎస్‌బీ రిటైల్..

### రూ.1,500 కోట్ల నిధుల సేకరణలో సంస్థ

హైదరాబాద్ : ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ పేర్లతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా లిమిటెడ్..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తుచేసుకున్నది కూడా. ఈ ఐపీవో ద్వారా రూ.1,500 కోట్ల వరకు నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో తాజా ఈక్విటీలను జారీ చేయడంతో రూ.500 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో ప్రమోటర్లకు చెందిన 2.98 కోట్ల షేర్లను అమ్మకానికి పెట్టింది. ఇలా సేకరించిన నిధుల్లో రూ.275 కోట్లను రుణాల చెల్లింపుల కోసం, మరో రూ.118 కోట్లను నూతన స్టోర్లను ఏర్పాటు చేయడానికి వినియోగించనున్నది. ప్రస్తుతం సంస్థకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో 22 నగరాల్లో 73 స్టోర్లను నిర్వహిస్తున్నది. సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఆర్ఎస్ బ్రదర్స్, కాంచీపురం నారాయణి సిల్క్స్, డీఏ రాయల్, వాల్యూ జోన్ హైపర్ మార్ట్ పేర్లతో అవుట్‌లెట్లను నిర్వహిస్తున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2,694 కోట్ల ఆదాయంపై రూ.104.4 కోట్ల నికర లాభాన్ని గడించింది. దేశీయ రిటైల్ రంగం అంచనాలకుమించి రాణిస్తున్నదని, గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.92.6 లక్షల కోట్లుగా నమోదైంది. దీంట్లో దుస్తులు, యాక్సెసరీస్ రూ.6.90 లక్షల కోట్లుగా ఉన్నది.




## ఫాస్టాగ్ వార్షిక పాస్..
# తొలిరోజు 1.4 లక్షల మంది కొనుగోలు

స్వాతంత్ర్య దినోత్సవం నుంచి దేశంలో ఫాస్టాగ్ టోల్ చెల్లింపు విధానంలో పెనుమార్పులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తరచూ ప్రయాణించే వారికి మరింత సులభ, చౌక హైవే ప్రయాణాన్ని కల్పించేందుకు కొత్తగా ఫాస్టాగ్ వార్షిక పాసును నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్ల కోసం ప్రవేశపెట్టిన రూ.3,000 వార్షిక హైవే టోల్ పాసు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలలోని సుమారు 1,150 టోల్ ప్లాజాల్లో %ఖీూఎఝుస్త్ర% వార్షిక పాస్ సౌకర్యాన్ని ఎన్‌హెచ్ఏఐ విజయవంతంగా అమలు చేసింది. తొలి రోజు సాయంత్రం 7 గంటల వరకు దాదాపు 1.4 లక్షల మంది వినియోగదారులు వార్షిక పాస్‌ను కొనుగోలు చేసి యాక్టివేట్ చేసుకున్నట్లు ఎన్‌హెచ్ఏఐ వెల్లడించింది. అదేవిధంగా టోల్ ప్లాజాల్లో దాదాపు 1.39 లక్షల లావాదేవీలు నమోదైనట్లు తెలిపింది. ఈ వార్షిక పాస్ తీసుకున్న వినియోగదారులు ఎస్ఎంఎస్ ద్వారా జీరో టోల్ మెసేజ్ అందుకుంటున్నట్లు ఎన్‌హెచ్ఏఐ వివరించింది.

ఎవరికి వర్తిస్తుంది?

ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే ఈ వార్షిక ఫాస్టాగ్ పాస్ వర్తిస్తుంది. ఎన్‌హెచ్ఏఐ నిర్వహించే జాతీయ హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలపైన టోల్ చార్జీలు చెల్లించేందుకు ఒకేసారి డబ్బు చెల్లించి ఫాస్టాగ్ వార్షిక పాసును తీసుకోవచ్చు. ఈ పథకం కింద వాహన యజమానులు ఒకేసారి రూ. 3,000 చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిపాటు ఎన్‌హెచ్ఏఐ నిర్దేశించిన జాతీయ




రహదారుల్లో 200 వరకు టోల్ ప్లాజాలను దాటవచ్చు. ఒకవేళ గరిష్ఠ పరిమితి (200 టోల్ క్రాసింగ్‌లు) ఏడాదిలోపలే ముగిసిపోతే ఆటోమేటిక్‌గా సాధారణ విధానంలోకి ఫాస్టాగ్ మారిపోయి డబ్బు చెల్లించి టోల్ దాటవలసి ఉంటుంది.

పాసు ఎలా కొనాలి?

వార్షిక ఫాస్టాగ్ పాసు కొనేందుకు వాహనదారులు తమ వాహన నంబరు, ఫాస్టాగ్ ఐడీ ఉపయోగించి రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్ఏఐ/ఎంఓఆర్‌టీహెచ్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వాలి. తమ ఫాస్టాగ్ యాక్టివ్‌గా, సక్రమంగా ఇన్‌స్టాల్ అయి ఉందో లేదో ధ్రువీకరించుకోవాలి. యూపీఐ, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ. 3,000 చెల్లించాలి. ఆగస్టు 15న పాసు యాక్టివేట్ అవుతుంది. యూజర్లకు ఎస్ఎంఎస్ ద్వారా కన్ఫర్మేషన్ మెసేజ్ అందుతుంది. ఫాస్టాగ్ వార్షిక పాసు ఇతరులకు బదిలీ కాదు. రిజిస్టర్డ్ వాహనానికి మాత్రమే పనిచేస్తుంది. అంతేగాక ఈ పాస్‌ను ఒకసారి కొనుగోలు చేస్తే మళ్లీ డబ్బు వాపసు వచ్చే అవకాశం ఉండదు. పాసు ఆటోమేటిక్‌గా రెన్యూ కాదు. దాని గడువు తీరిన తర్వాత మళ్లీ కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

# వైఎస్ రాజారెడ్డి అరచకాలు అన్నీఇన్నీకావు

### వైఎస్ మరణం ఎలా జరిగిందో అందరికీ తెలుసు
### జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ అనకాపల్లి ఎంపి సిఎం రమేశ్

అమరావతి,మే23 : పులివెందులలో వైఎస్ రాజారెడ్డి చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ చెప్పుకొచ్చారు. వైఎస్ ఎలా చనిపోయారో అందరికీ తెలుసునని... ఈ విషయంలో జగన్ సెల్ఫ్ గోల్ వేసుకున్నారని సెటైర్లు గుప్పించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి రాజారెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రౌడీషీట్ ఉందని విమర్శించారు. ఓ కులాన్ని అడ్డం పెట్టుకుని దొంగతనాలు చేయించి డబ్బు గడించిన చరిత్ర రాజారెడ్డిదని ఎద్దేవా చేశారు. శనివారం అమరావతి వేదికగా మీడియాతో ఎంపీ రమేశ్ మాట్లాడారు. ఓ మైన్ ఓనర్‌ను అంతమొందించి రాజారెడ్డి గనులు దక్కించుకుని ధనవంతుడయ్యారని విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాన్ని, మాజీ మంత్రి వివేకారెడ్డి మరణాన్ని జగన్ వేరేలాగా చిత్రీకరిస్తున్నారని ఎంపీ రమేశ్ అన్నారు. వివేకా హత్య కేసులో జగన్ హస్తం ఉందా..?, లేదా..? అనేది ఓపెన్ పోల్ పెట్టాలని సవాల్ చేశారు. ఈ కేసుతో జగన్‌కి సంబంధం లేదని వస్తే తాను రాజకీయాలు వదిలేస్తానని ఛాలెంజ్ చేశారు. ప్రజలకు జగన్ హత్యా రాజకీయాల గురించి తెలిసిపోయిందని.. అందుకే ఆయన ఇప్పుడు తాను మంచివాడిని అని చెబుతున్నారని అన్నారు. వివేకా కేసులో సీబీఐ విచారణ చేసి భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేసిందని ప్రస్తావించారు. ఎస్టీ కులాన్ని అడ్డుపెట్టుకుని రాజారెడ్డి దోపిడీలు చేశారని.. ఇలా పోలీసుల రికార్డుల్లో కూడా ఉందని గుర్తుచేశారు. పులివెందులలో పార్నపల్లి గ్రామంలో రాజారెడ్డి చేసిన ఆకృత్యాలకు ఇంకా సజీవ సాక్షులు ఉన్నారని చెప్పుకొచ్చారు. రాజారెడ్డి ఎందరినో రాజకీయ లబ్ది కోసం హత్య రాజకీయాలు చేశారని ఆరోపించారు. రాజారెడ్డిని హత్య చేసింది ఆయన వల్ల ఇబ్బంది పడిన బాధితులేనని చెప్పుకొచ్చారు. రాజారెడ్డి మీద రౌడీషీట్ సహా పలు కేసులు గతంలో ఉన్నాయని ప్రస్తావించారు. ఆ సమయంలో చంద్రబాబు సీఎం కాదని.. టీడీపీ ప్రభుత్వమే లేదని ఎంపీ సీఎం రమేశ్ పేర్కొన్నారు.

# గ్రీన్ కార్డు జారీలో స్వల్ప సవరణలు

### భారీతీయులకు ఊరటనిచ్చేలా ప్రకటన

వాషింగ్టన్,మే24 : అమెరికాలో నివసిస్తున్న తాత్కాలిక వలసదారులు శాశ్వత నివాసం పొందే హక్కు కోసం అగ్రరాజ్యం ప్రవేశపెట్టిన గ్రీన్ కార్డ్ నిబంధనల్ని సడలించింది. ఈ నిబంధనల్లో కొన్ని మినహాయింపులు ఇస్తున్నట్టు ప్రకటించింది. తాజా సడలింపులతో భారతీయులకు ఉపశమనం లభించింది. అగ్రరాజ్యంలో తాత్కాలిక వీసాలపై నివసిస్తున్న భారతీయులు ఆందోళనను రేకెత్తించిన అనంతరం.. యునైటెడ్ స్టేట్స్ ఇమ్మిగ్రేషన్ అధికారులు ఇటీవల ప్రకటించిన గ్రీన్ కార్డ్ నిబంధనలను పాక్షికంగా సడలించారు. సవరించిన విధానం ప్రకారం.. వర్క్, స్టూడెంట్, పర్యాటక వీసాలపై ఉన్న దరఖాస్తుదారులు తమ స్వదేశాలకు వెళ్లి, అమెరికా రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్ ద్వారా గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే.. ఈ నిబంధనలు అందరికీ వర్తించవని యూఎస్‌సీఐఎస్ ప్రతినిధి జాక్ కహ్లర్ వెల్లడించారు. అమెరికా జాతీయ, ఆర్థిక ప్రయోజనాలే ప్రధానమనుకున్న వలసదారులకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఉంటుంది. గ్రీన్ కార్డ్ ఆశావహులు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా.. మా దేశానికి ప్రయోజనముందని భావిస్తే వాటిని పరిగణనలోకి తీసుకుంటాం. అలాంటప్పుడు వారు ప్రస్తుత నిబంధనల ప్రకారం కొనసాగేందుకు అనుమతిస్తాం. మిగిలినవారిని వారి స్వదేశానికి వెళ్లి దరఖాస్తు చేసుకోమని సూచిస్తాం' అని కహ్లర్ తెలిపారు. అయితే.. ఆ దరఖాస్తులు తమ దేశానికి ఏరకంగా ప్రయోజనం చేకూరుస్తాయి, వాటిని ఎలా నిర్ణయిస్తారనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. కొత్త నిబంధనల్లోని లోపాలను ఉపయోగించుకుంటూ ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసే అవకాశాలు తగ్గిపోతాయని ఆయన స్పష్టం చేశారు.

## పవన్‌తో పోలవరం ఎమ్మెల్యే భేటీ

### నియోజకవర్గ అభివృద్ధి తదితరాలపై చర్చ
### అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని సూచన

అమరావతి,మే23 : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. పోలవరం ఎమ్మెల్యేగా ఆయన పని తీరుపై డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. పోలవరం నియోజకవర్గం పరిధికి సంబంధించి పార్టీ దృష్టికి వచ్చిన విషయాలు, ఆరోపణలపై ఎమ్మెల్యేను పవన్ వివరణ అడిగినట్లు తెలుస్తోంది. తన వ్యక్తిగత విషయాలను కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొని చక్కదిద్దుకొనేందుకు కొంత గడువు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా.. నాలుగు వారాల్లోగా చక్కదిద్దుకోవాలని పవన్ సూచించినట్లు సమాచారం. పోలవరం నియోజకవర్గంలో పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు రూ.147 కోట్లు కేటాయించారు. ఆ పనుల పురోగతిపైనా డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. పనుల సకాలంలో వేగంగా పూర్తి చేయకపోవడంపై పవన్ ప్రశ్నించారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తానని, వ్యక్తిగత వ్యవహారాలు చక్కదిద్దుకోవాలని సూచించినట్లు సమాచారం.

# హాస్పిటల్ టాయిలెట్‌లో ప్రసవించిన బాలిక..

### కమోడ్‌లో ఇరుక్కున్న శిశువును రక్షించిన సిబ్బంది

రాంచీ: ఒక బాలిక ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నది. అక్కడి టాయిలెట్‌లో బిడ్డను ప్రసవించింది. కమోడ్‌లో పడేసి ఫ్లష్ చేసేందుకు ప్రయత్నించింది. కుదరకపోవడంతో టాయిలెట్ నుంచి బయటకు వచ్చింది. అయితే రక్తం మరకలు చూసిన కొందరు వ్యక్తులు వైద్య సిబ్బందిని అరెస్ట్ చేశారు. (+అతీశ్రీ ఎవశ్రీఅజవతీం అఅ ప్ర్శీంజూఖ్శ్రీ శీఅశ్రీవ) జార్ఖండ్‌లోని గిరిడిహ్‌లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం గర్భవతి అయిన 14 ఏళ్ల బాలిక సదర్ ఆసుపత్రికి చేరుకున్నది. ఒక వార్డులోని టాయిలెట్‌లో బిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత ఆందోళనతో టాయిలెట్ నుంచి బయటకు వచ్చింది. కాగా, టాయిలెట్ బయట, లోపల రక్తం మరకలు ఉండటాన్ని అక్కడున్న కొందరు వ్యక్తులు గమనించారు. ఏదో జరిగినట్లు అనుమానించి ఆసుపత్రి సిబ్బందిని అప్రమత్తం చేశారు. అయితే ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఆ బాలికకు కళ్లు తిరుగడంతో అక్కడ పడిపోయింది. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. వైద్య సిబ్బందితో కలిసి టాయిలెట్‌ను తనిఖీ చేశారు. టాయిలెట్ కమోడ్‌లో ఇరుక్కున్న నవజాత శిశువును గమనించి రక్షించారు. ఆ బాలిక, పసికందును అంబులెన్స్‌లో చైతాడిహ్‌లోని మాతా శిశు ఆసుపత్రికి తరలించారు. తల్లి, బిడ్డ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నదని డాక్టర్లు తెలిపారు. 14 ఏళ్ల బాలిక గర్భం దాల్చడం, శిశువుకు జన్మనివ్వడంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# గొడ్డలి పార్టీతో జాగ్రత్త సుమా

### రప్పారప్పా అంటే తోక కట్ చేస్తాం
### వైసిపికి సిఎం చంద్రబాబు హెచ్చరిక



చిత్తూరు,మే24 : 'సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం.. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా యాదమర్రిలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో సీఎం మాట్లాడారు. రప్పారప్పా రంకెలు.. జంతు రక్తంతో కటౌట్లకు అభిషేకాలా..సీబీఎన్ దగ్గర తోక జాడిస్తే.. ప్రజాహితం కోసం తోక కట్ చేస్తానని హెచ్చరించారు. గొడ్డలి పార్టీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి, ప్రజాస్వామ్యంలో ఆ పార్టీకి చోటులేదని సీఎం అన్నారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ ఇవ్వాలి. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రోజుకొక నాటకమాడుతున్నారు. అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా? దళిత యువకుడు సుబ్రమణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వారికి సన్మానాలా? కుటుంబ బంధాలపై గొడ్డలి వేటు.. తల్లి, చెల్లికి ఆస్తులివ్వకుండా వేధించారు. తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వారు.. ప్రజలను ఏం చూస్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారు. నేను ప్రజల సేవకుణ్ణి.. పెత్తందారు కాదు. నిరంతరం పనిచేసి పేదల రుణం తీర్చుకుంటా. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కల్పించింది. ఎన్డీయే కూటమి అని సీఎం అన్నారు. జగన్ నంగనాచిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ నోరు తెరిస్తే అన్నీ అబద్దాలేనని విమర్శించారు. మాజీ మంత్రి వివేకా హత్యకేసులో తనపై దుష్ప్రచారం చేశారని ఆగ్రహించారు. బాబాయ్ హత్యలో తనపై నారాసుర రక్త చరిత్ర అని ప్రచారం చేశారని దుయ్యబట్టారు. డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను చంపిన ఎమ్మెల్సీ అనంతబాబుకు.. జగన్ సన్మానం చేశారని సెటైర్లు గుప్పించారు. తల్లి, చెల్లిని చూడనివారు ప్రజలకు మంచి చేస్తారా..? అని ప్రశ్నించారు. ఏపీ అభివృద్ధిని చూసి గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. అమరావతిపై గొడ్డలి వేటు వేసిన వ్యక్తి జగన్‌రెడ్డి అని విమర్శించారు. అసత్య ప్రచారాలతో జగన్ అండ్ కో లబ్ది పొందాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా? అని ప్రశ్నించారు. కులమతాల మధ్య చిచ్చుపెట్టి రోజుకో నాటకమాడుతున్నారని విమర్శించారు. జగన్ అధికార దాహానికి తల్లి, చెల్లి అతీతం కాదని అన్నారు.హిందూ ధర్మం, దేవాలయాలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు పాస్టర్లతో డ్రామాలు చేయిస్తున్నారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. రప్పా.. రప్పా అని జగన్ కటౌట్లకు జంతువుల రక్తం చల్లుతున్నారని విమర్శించారు. తన దగ్గర తోకజాడిస్తే కట్ చేస్తా.. ఇక్కడుంది 1995 నాటి సిబిఎన్ అని ప్రస్తావించారు. జగన్.. ముందు నీ ఇంట్లో సమస్యలు చూసుకోవాలని హితవు పలికారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. గొడ్డలి పార్టీ బుద్ధి మారట్లేదని ఆగ్రహించారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీకి చోటు లేదని చెప్పుకొచ్చారు. సమాజానికి గొడ్డలి పార్టీ హానికరమని.. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ అని పేర్కొన్నారు.

## జగన్ కుటుంబ రాజకీయం అందరికీ తెలిసిందే

### ఇప్పుడేమో అహింసావాదిలా పోజులు కొడుతున్నాడు
### వారు ఎన్ని హత్యలు చేశారో రాయలసీమ గడపగడపకూ తెలుసు
### జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అనగాని సత్యప్రసాద్

అమరావతి,మే24 : గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొత్తగా తాను చాలా అమాయకుణ్ణి, అహింసావాదిని అంటూ మాట్లాడుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ చురకలు వేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పూర్వీకుల చరిత్ర, ఆయన చరిత్ర ఏంటి అనేది ప్రపంచంలో అందరికీ తెలుసన్నారు. ఎన్ని దారుణాలు చేశారో, ఎన్ని హత్యలు చేశారో రాయలసీమలో ఏ గడపని అడిగినా చెప్తారని అన్నారు. రాజారెడ్డి రాజ్యాంగం గురించి ఎవరిని అడిగినా కథలు కథలుగా చెప్తారని వ్యాఖ్యానించారు. అటువంటి రాజారెడ్డి పోలికలు తనకొచ్చాయని చెప్పుకున్న వ్యక్తి జగన్ అంటూ దుయ్యబట్టారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు చేసిన అరాచకాలు కళ్లారా చూశామని మంత్రి అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని.. తన వ్యాపారానికి అడ్డుగా ఉన్న ప్రతి ఒక్కరినీ హతమార్చారని జగన్‌పై మంత్రి ఆరోపణలు గుప్పించారు. పరిటాల రవితో సహా ఎంతోమందిని హత్య చేశారన్నారు. అమరనాథ్ గౌడ్, సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం విషయంలో ఏమైందో అందరికీ తెలుసన్నారు. 'తల్లిని తరిమేశాడు.. చెల్లిని ఆస్తి కోసం తరిమేశాడు.. అతని వ్యక్తిత్వం అలాంటిది' అంటూ వ్యాఖ్యానించారు. బాబాయ్ హత్య కేసుపై సీబీఐ వచ్చి ఎంక్వైరీ చేస్తుంటే.. తన పార్టీ ఎంపీని కాపాడేందుకు సీబీఐ అధికారులపైనే దాడి చేసి తరిమేశారని మండిపడ్డారు. వైఎస్ సునీత ఆవేదన కనిపించటం లేదా అని మంత్రి ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా చేసిన ఐదేళ్లలో బాబాయ్‌ను హత్య చేసిన వ్యక్తిని కనుక్కోలేకపోయారా అని నిలదీశారు. తప్పుదోవ పట్టిద్దామనుకుంటే నమ్మే స్థితిలో ఏపీ ప్రజలు లేరన్నారు. ఇప్పుడు ఆ 11 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని అన్నారు. 'ఈరోజు రాష్ట్రం సుభిక్షంగా ఉంది. పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. యువత హ్యాపీగా ఉంది. ఉద్యోగాలు వస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమం జరుగుతోందన్న ఆనందంలో ప్రజలు ఉన్నారు' అని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

## ప్రభుత్వ విప్ పదవికి అరవ శ్రీధర్ రాజీనామా

### పవన్ ఆదేశాలతోనే అంటూ ప్రచారం

అమరావతి,మే24 : రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ విప్ పదవికి శ్రీధర్ రాజీనామా చేశారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మీద ఇటీవలి కాలంలో పలు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా ఓ వివాహిత మహిళ అరవ శ్రీధర్ మీద చేసిన ఆరోపణలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపాయి. దీనిపై జనసేన విచారణ కమిటీని ఏర్పాటు చేయగా.. అరవ శ్రీధర్ తన వివరణ కూడా తెలియజేశారు. అయితే ఆ తర్వాత కూడా బాధితురాలు మరిన్ని వీడియోలు విడుదల చేయటం.. వివిధ అంశాలలో అరవ శ్రీధర్ మీద ఆరోపణలు రావటంతో ఆయన ప్రభుత్వ విప్ పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. ఈ మేరకు డిప్యూటీ సిఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు తన రాజీనామా లేఖను సమర్పించారు. మరోవైపు రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ , పోలవరం ఎమ్మెల్మే చిర్రి బాలరాజుతో పవన్ కళ్యాణ్ శనివారం సమావేశమైనట్లు తెలిసింది. ఈ సందర్భంగా తమపై వస్తున్న ఆరోపణలపై ఇద్దరు ఎమ్మెల్యేలు తమ వివరణ వినిపించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే శాసన సభలో విప్‌గా ఉన్న అరవ శ్రీధర్ తన విప్ పదవికి రాజీనామా పత్రాన్ని అందచేశారు. వ్యక్తిగత కారణాలతో విప్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు అరవ శ్రీధర్ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలు, నెలకొన్న వివాదాలపై పవన్ కళ్యాణ్‌కు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. కొన్ని రోజులుగా రైల్వేకోడూరుకు చెందిన ఓ మహిళ సామాజిక మాధ్యమాల్లో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మీద చేస్తున్న ఆరోపణల వ్యవహారం సంచలనంగా మారింది. తనను పెళ్లి చేసుకుంటానని అరవ శ్రీధర్ తనను నమ్మించి మోసం చేశారంటూ సామాజిక మాధ్యమాల్లో పలు సంచలన వీడియోలు విడుదల చేశారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే కేసు నమోదై విచారణ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై మరికొన్ని రాజకీయపరమైన ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే అసెంబ్లీలో విప్ పదవికి అరవ శ్రీధర్ రాజీనామా చేసినట్లు తెలిసింది. అయితే రాజీనామా లేఖలో వ్యక్తిగత కారణాలతో అని పేర్కొన్నారు.

# రాజ్యసభ ఎంట్రీకి సిద్ధమైన టీవీకే.. దక్కనున్న ఒక స్థానం

చెన్నై: తమిళనాడులో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే, రాజ్యసభలో ప్రవేశానికి సిద్ధమైంది. ఆ



పార్టీ ఒక స్థానం దక్కించుకోనున్నది. రాజ్యసభలోని 26 స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ప్రతి రెండేళ్లకు ఖాళీ అయ్యే స్థానాలను భర్తీ చేయనున్నారు. కాగా, ఈ 26 స్థానాలకు సంబంధించి 12 రాష్ట్రాల్లో రాజ్యసభ ఎన్నికలు జరుగనున్నాయి. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటకలో చెరో నాలుగు స్థానాలకు, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో చెరో మూడు స్థానాలకు, జార్ఖండ్‌లో రెండు స్థానాలకు, మణిపూర్, మేఘాలయ, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్‌లో ఒక్కో స్థానానికి జూన్ 18న పోలింగ్ జరుగనున్నది. అలాగే మహారాష్ట్ర, తమిళనాడులోని చెరొక రాజ్యసభ స్థానాలకు అదే రోజున ఉప ఎన్నికలు జరుగనున్నాయి. మరోవైపు ప్రస్తుతం రాజ్యసభ ఎన్నికలు జరుగనున్న 26 స్థానాల్లో ఎన్డీయే 18, కాంగ్రెస్ 4, వైఎస్సార్ కాంగ్రెస్ 3, జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఒక స్థానాన్ని కలిగి ఉన్నాయి. అయితే ఈ ఎన్నికల తర్వాత ఎన్డీయే ఒక స్థానాన్ని కోల్పోనున్నది. దీంతో దాని సంఖ్య 17కు తగ్గుతుందని అంచనా. అదే సమయంలో కాంగ్రెస్ స్థానాల సంఖ్య 4 నుంచి 5కు పెరుగవచ్చని తెలుస్తున్నది. జేఎంఎం కూడా రెండు స్థానాలను కైవసం చేసుకోనున్నది. అలాగే తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే కూడా రాజ్యసభలో అడుగుపెట్టనున్నది. ఆ పార్టీ ఒక స్థానాన్ని గెలుచుకోనున్నది. మహారాష్ట్రకు చెందిన ఎన్సీపీ అజిత్ పవర్ వర్గం కూడా ఒక స్థానాన్ని గెలుచుకుంటుందని అంచనా. ఈ రెండు స్థానాలకే ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాల నిర్దిష్ట పదవీకాలం కేవలం రెండేళ్లు మాత్రమే.

## మర్యాద, సంస్కారాలు భారత్ నుంచి నేర్చుకోండి

### అమెరికా విదేవాంగ మంత్రికి ఇరాన్ కాన్సులేట్ సూచన

ముంబై,మే24 : అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత్ పర్యటనకు వచ్చిన నేపథ్యంలో ఇరాన్ వ్యంగ్యంగా స్పందించింది. ఇరాన్ ముంబై కాన్సులేట్ సోషల్ మీడియా వేదికగా రుబియోను ఉద్దేశిస్తూ 'భారతీయుల నుంచి కొంచెమైనా మర్యాద, సంస్కారం నేర్చుకోండి' అంటూ ఎక్స్ ఖాతాలో వ్యంగ్యంగా ఓ పోస్ట్ చేసింది. అమెరికా–భారత్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగు పరిచేందుకు మార్కో రుబియో ప్రస్తుతం పర్యటనకు వచ్చారు. యుద్ధం ముగింపు చర్చలు జరుగుతుతన్న ప్రస్తుత తరుణంలో అమెరికాకు చెందిన కొందరు నేతల డిమాండ్లు, ప్రవర్తనపై ఇరాన్ తీవ్ర ఆగ్రహంగా ఉంది. ఇరాన్ తమ డిమాండ్లకు తలొగ్గకుంటే మరోసారి సైనిక చర్యకు దిగుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. అమెరికా ఉపాధ్యక్షుడు, రక్షణ మంత్రి కూడా ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ అమెరికా విదేశంగా మంత్రికి చురక అంటించింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత్ పర్యటన తొలి రోజే ప్రధాని నరేంద్ర మోదీతో న్యూఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించారు. దాదాపు గంటకు పైగా సాగిన ఈ భేటీలో కీలక అంశాలు చర్చకు వచ్చినట్టు సమాచారం. అంతకు ముందు రుబియో కోల్‌కతాకు చేరుకుని మథర్ థెరిసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీ ప్రధాన కేంద్రాన్ని సందర్శించారు.

## ప్రధాని మోడీతో రామ్మోహన్ కుటుంబం భేటీ

### జీవితాంతం గుర్తిండి పోయే మధుర క్షణం అంటూ పోస్ట్

న్యూఢిల్లీ,మే24 : కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం కుటుంబంతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తల్లి ప్రధాన మంత్రికి మొక్కను బహుకరించారు. కుటుంబంతో కలిసి ప్రధాని మోదీని కలవటంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎక్స్‌లో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. ఆ పోస్టులో.. 'ఈ రోజు మా కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే ఓ భావోద్వేగ క్షణం. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కుటుంబ సమేతంగా కలిసే అదృష్టం కలగడం ఎంతో ఆనందంగా, గర్వంగా భావిస్తున్నాను'.. ఆయన అసాధారణ వ్యక్తిత్వం, ఆప్యాయత మా కుటుంబంలోని మూడు తరాలను ఒకేలా ఆకట్టుకుంది. ప్రజల హృదయాల్లో ఆయన ఎందుకు అపారమైన ఆదరణ పొందారో ఆ క్షణంలో మరింత స్పష్టంగా తెలిసింది. ప్రత్యేకంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే మహత్తర ఆలోచనకు ప్రేరణగా నా తల్లి ప్రధానమంత్రికి మొక్కను బహుకరించడం మా కుటుంబానికి ఎంతో మధురమైన, గర్వకారణమైన క్షణంగా నిలిచిపోతుంది. ఆయన చూపిన ప్రేమ, ఆప్యాయత, ఆశీస్సులకు మేమెప్పటికీ కృతజ్ఞులమే. మాతో గడిపిన అమూల్యమైన సమయానికి వారికి హృదయపూర్వక ధన్యవాదాలు' అని అన్నారు.






# అనిరుధ్‌తో లవ్‌లో కావ్య మారన్

## త్వరలోనే వెడ్డింగ్ అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఓనర్ కావ్య మారన్‌కు సోషల్ మీడియాలో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో ఆమె హావభావాలు, రియాక్షన్స్ తరచూ వైరల్ అవుతూ అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపును సంపాదించాయి. అభిమానులు ప్రేమగా 'కావ్య పాప' అని పిలుచుకునే ఆమెకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కావ్య మారన్ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అంతేకాదు, ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో ఆమె పెళ్లి జరగబోతుందనే వార్తలు పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ప్రచారం కొత్తది కాదు. గత ఏడాది నుంచే కావ్య మారన్, అనిరుధ్ మధ్య సాన్నిహిత్యం ఉందంటూ సోషల్ మీడియాలో పుకార్లు వినిపించాయి. ముఖ్యంగా ఇద్దరూ న్యూయార్క్‌లో కలిసి కనిపించారనే వార్తలు రావడంతో డేటింగ్ రూమర్స్ మరింత ఊపందుకున్నాయి. అప్పటి నుంచి వీరిద్దరి గురించి అనేక కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడు మరోసారి కొత్త ప్రచారం తెరపైకి వచ్చింది. కొన్ని మీడియా కథనాల ప్రకారం, ఇరువురి కుటుంబ సభ్యులు ఈ వివాహానికి అంగీకారం తెలిపారని, విదేశాల్లో వివాహం జరిపించే అవకాశాలపై చర్చలు జరుగు తున్నాయని సమాచారం. వివాహం అనంతరం చెన్నైలో ఘనంగా రిసెప్షన్ నిర్వహించే ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయనే ప్రచారం నడుస్తోంది. ఇదిలా ఉండగా మరో ఆసక్తికర విషయం కూడా చర్చనీయాంశమైంది. అనిరుధ్‌కు కుటుంబ సంబంధాలు ఉన్న సినీ ప్రముఖులు ఈ వివాహం కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారనే కథనాలు తమిళ మీడియా వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు కావ్య మారన్ క్రీడా, వ్యాపార వ్యవహారాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఈ వివాహ వార్తలపై అటు కావ్య మారన్ కుటుంబం కానీ, ఇటు అనిరుధ్ వర్గాలు కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.






# అఖిల్ లెనిన్ టీజర్ విడుదల

## అక్కినేని అభిమానుల్లో ఉత్సాహం

అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే సినిమా అనౌన్స్‌మెంట్‌తో మంచి అంచనాలు ఏర్పడగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంగా, 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ ఎలిమెంట్స్ కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన చెప్పిన డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మనోడు వస్తున్నాడు? నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా? అంటూ అఖిల్ చెప్పిన డైలాగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ డైలాగుల్లో కనిపించిన యాటిట్యూడ్, స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక టీజర్ విడుదలపై నాగార్జున కూడా స్పందించారు. తనకు ఈ టీజర్ ఒక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. టీజర్ మొత్తం ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా అనిపించిందని అభిప్రాయపడ్డారు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న ఆయనకు 'లెనిన్' మంచి మైలురాయిగా మారుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. టీజర్ చూస్తుంటే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




# 200 కోట్లు రాబట్టిన కరుప్పు

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, స్టార్ హీరోయిన్ త్రిష జంటగా నటించిన తాజా చిత్రం 'కరుప్పు' తెలుగులో 'వీరభద్రుడు' బాక్సాఫీస్ వద్ద విజయపరంపర కొనసాగిస్తోంది. విడుదలైన కొద్ది రోజులకే ఈ సినిమా భారీ వసూళ్లు నమోదు చేస్తూ కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందనతో ఈ చిత్రం తమిళ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. విడుదలైన వారం రోజుల్లోనే 'కరుప్పు' ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా తమిళనాడులో ఈ సినిమా సాధించిన వసూళ్లు ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చకు కారణమయ్యాయి. గత తొమ్మిది నెలలుగా తమిళనాడులో ఏ సినిమా అందుకోలేని అరుదైన ఘనతను 'కరుప్పు' సాధించింది. కేవలం తమిళనాడు రాష్ట్రంలోనే రూ.100 కోట్ల మార్క్‌ను దాటిన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రాన్ని పంపిణీ చేసిన డిస్ట్రిబ్యూషన్ వర్గాలు కూడా ఈ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కలెక్షన్లలో ప్రధానంగా తమిళ వెర్షన్ నుంచే అధిక ఆదాయం వచ్చినప్పటికీ, తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదలైన సినిమా కూడా మంచి ఆదరణ పొందుతోంది.



# ఎఐతో నకిలీ బికినీ ఫోటలు


## నెట్టింట వైరల్ కావడంపై నటి రుక్మిణీ ఆగ్రహం

'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కొన్ని బికినీ ఫోటోషూట్ క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా కనిపించడంపై న టి రుక్మిణీ వసంత్ ఆగ్రహం చెందారు. గ్రీన్ కలర్ బికినీ ధరించి ఆమె స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్నట్లు ఉన్న ఈ విజువల్స్ నెటిజన్లను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేశాయి. చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు ఉండటంతో ఇది ఏదైనా అధికారిక షూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక్ అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తంచేశారు. అయితే ఈ వివాదంపై తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నెట్‌లో తన పేరిట సర్క్యులేట్ అవుతున్న బికినీ చిత్రాలన్నీ పూర్తిగా ఎఐ ద్వారా సృష్టించిన నకిలీ ఫోటోలని ఆమె స్పష్టం చేశారు. ఆ చిత్రాలు పూర్తిగా తప్పుడు సమాచారంతో, కల్పితంగా సృష్టించబడినవని ఆమె పేర్కొన్నారు. బాధ్యతా రాహిత్యంగా ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఇటువంటి మార్ఫింగ్ కంటెంట్‌ను తయారు చేయడం మరియు వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన టీమ్ చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఫోటోలను సృష్టించిన వారిపై, అలాగే వీటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు రుక్మిణి వెల్లడించారు. నెటిజన్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయవద్దని, వాటిని ప్రోత్సహించవద్దని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# నాగార్జునకు మే 23 స్పెషల్

## తొలి చిత్రం విక్రమ్ విడుదలై 23 ఏళ్లు

తన జీవితంలో 'మే 23' ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. 'విక్రమ్' నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా' అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన 'హీరో' సినిమాకు రీమేక్‌గా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. 'కింగ్ 100'అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది.




Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com